ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 15, మే 2025

దొంగలూ దొంగలూ కలిసి ఊళ్లు పంచుకున్నట్లు రెండు ప్రధాన పార్టీల్లో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా పంచేసుకుంటున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. పొదిలి పట్టణంలో ఇప్పటికే చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, రహదారి మార్జిన్‌లను ఆక్రమించేశారు. దాదాపు రూ.100కోట్లకు పైగా విలువైన భూములను లాగేసుకున్నారు. పట్టణం శర వేగంగా విస్తరించడం, జిల్లాకు నడికూడలి కావడం, రైల్వేస్టేషన్, గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తుండడం, స్థలాల ధరలు అమాంతం పెరగడంతో అక్రమార్కులు దొరికినకాడికి దోచేసుకునే పనిలో పడ్డారు. వారికి అంటకాగిన అధికార యంత్రాంగం తమ వంత సహకారం అందిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ పేదెవరు.. ఆక్రమించెయ్..!

పొదిలిలో పోరంబోకు భూములపై అక్రమార్కుల కన్ను

- కబ్జాల్లో ప్రధాన పార్టీల నేతలు
- అంతా సిండికేట్‌గా మారి భూదందాలు

కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కిన కబ్జాదారులు

పొదిలి, మే 14 (ఆంధ్రజ్యోతి) : తిలాపాపం తలాపిడికెడు అన్నట్టు పొదిలిలో కొందరు అక్రమాలకు తెగబడుతున్నారు. ఖాళీ స్థలాలను విచ్చలవిడిగా ఆక్రమిస్తున్నారు. వీటిపై సమగ్ర సర్వే నిర్వహించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అన్సారియా పలుమార్లు ఆదేశించినప్పటికీ స్థానిక యంత్రాంగం బేఖాతరు చేస్తోంది. గతంలో పొదిలిలో జరిగిన ఒక బహిరంగ సభలో స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ అక్రమార్కుల ఆట కట్టిస్తానని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తానని, ప్రభుత్వ ఆస్తులను అక్రమార్కుల చెర నుంచి విడిపిస్తానని మంత్రి బాలవీరాంజనేయస్వామి, జేసీ గోపాలకృష్ణ ఎదుట ప్రకటించారు. స్పందించిన మంత్రి, జేసీలు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అక్రమాలు నిగ్గుతేల్చాలని, వారం లోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కంటి తుడుపు చర్యగా సర్వే పేరుతో అధికారులు కాలయాపన చేసి కలెక్టర్ ఆదేశాలను తుంగలోతొక్కారు. దీంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.


చర్యలు లేకపోవడంతో మళ్లీ ఆక్రమణలు

సర్వే నెంబర్ 219-2లో 1.86 సెంట్ల భూమి ఉంది. ఈ భూమి విలువ సుమారుగా రూ.6 కోట్లు ఉంటుంది. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. అది ప్రభుత్వ భూమి అని కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో కొనకనమిట్ల మండలానికి చెందిన వైసీపీ కార్యకర్త 20సెంట్ల స్థలంలో సిమెంట్ ఇటుకలతో ప్రహరీని కట్టారు. ఆ తరువాత పత్రికల్లో వార్తలు రావడంతో మేలుకున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని

మిగతా 6లో...

కుంట భూమిలో పాగా

పట్టణంలో విద్యుత్ కార్యాలయం సమీపంలో సర్వే నెంబర్ 217లో 3.06 ఎకరాల కుంట పోరంబోకు భూమి ఉంది. అందులో 50 సెంట్లలో ఓ దేవాలయాన్ని నిర్మించారు. ఎకరంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్‌క్లినిక్‌తో పాటు మరి కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించేందుకు కేటాయించారు. మిగిలిన 1.56 సెంట్ల భూమిపై అక్రమార్కులు కన్నేశారు. దాని విలువ సుమారుగా రూ.4 కోట్లు ఉంటుంది.





217 సర్వే నెంబరులో ఆక్రమణకు గురైన కుంట పోరంబోకు స్థలం



దర్శి నగర పంచాయతీ కార్యాలయం

మున్సిపాలిటీగా దర్శి

- నగర పంచాయతీ నుంచి అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు

దర్శి, మే 14(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పలుసార్లు ప్రభుత్వాన్ని కోరారు. పురపాలకశాఖ మంత్రి పి.నారాయణను కలిసి పూర్తి వివరాలతో నివేదికను అందజేశారు. మున్సిపాల్టీ చేయాలని దర్శి నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించి పంపించింది. దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా చేసేందుకు అన్నీ అర్హతలు ఉండటంతో ప్రభుత్వం మున్సిపాలిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నూతన మున్సిపాలిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు అందే అవకాశం ఉంది. దర్శి పట్టణం మరింత అభివృద్ధి చెందే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దర్శిని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పురపాలక శాఖ మంతి పి. నారాయణ, టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి ఎద్దడిపై తప్పుడు నివేదిక

- దోర్నాలలో నీటి కష్టాలు లేవంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ వివరణ
- ఆంధ్రజ్యోతి కథనంపై క్షేత్రస్థాయిలో జిల్లా ఉన్నతాధికారుల పరిశీలన
- అదే సమయంలో ఐనముక్కుల బీసీ కాలనీవాసుల ధర్నా
- తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆదేశం
- తిమ్మాపురంలో అప్పటికప్పుడు కొత్త మోటార్ ఏర్పాటు

7



టీచర్ల బదిలీలకు రంగం సిద్ధం

- విధి విధానాలు ఖరారు
- ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లపై స్పష్టత
- అనధికార గైర్హాజరుకు నెగిటివ్ పాయింట్లు
- మార్గదర్శకాలు జారీ

ఒంగోలు విద్య, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలకు రంగం సిద్ధమైంది. దీనిపై విధివిధానాలను విద్యాశాఖ ఖరారు చేసింది. టీచర్లకు ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్ల కేటాయింపుపై కూడా స్పష్టత ఇచ్చింది. బదిలీల్లో మొదటిసారిగా నెగిటివ్ పాయింట్లు కేటాయిస్తున్నారు. కచ్చితంగా బదిలీ కావాల్సిన హెచ్‌ఎంలు టీచర్లకు కటాఫ్ తేదీలను కూడా నిర్దేశించారు. ఒకే పాఠశాలలో 2020 ఆగస్టు 31 నుంచి పనిచేస్తున్న హెచ్‌ఎంలు, 2017 ఆగస్టు 31 ముందు నుంచి పనిచేస్తున్న ఇతర టీచర్లు తప్పనిసరిగా

మిగతా 6లో...

నేడు అమ్మనబ్రోలుకు లోకేష్

నాగులుప్పలపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన వీరయ్యచౌదరి కుటుంబాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గురువారం పరామర్శించనున్నారు. అందుకోసం వీరయ్య స్వగ్రామమైన అమ్మన బ్రోలుకు వస్తున్నారు. ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ చేరుకుని అక్కడి నుంచి అమ్మనబ్రోలుకు వెళ్తారు.

హెలిప్యాడ్‌ను పరిశీలించిన ఎస్పీ



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం అమ్మన బ్రోలు రానున్న నేపథ్యంలో చదలవాడలోని సాయివిష్ణు విల్లాస్‌లోని హెలిప్యాడ్‌ను బుధవారం ఎస్పీ ఎఆర్ దామోదర్ పరిశీలించారు. అక్కడి నుంచి అమ్మనబ్రోలుకు చేరుకునే మార్గంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. మంత్రి లోకేష్ ప్రయాణించే మార్గంతోపాటు అమ్మనబ్రోలులోనూ పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అమ్మనబ్రోలులో గ్రామస్థులతో సమావేశం నిర్వహించిన ఎస్పీ దామోదర్ అందరూ సమన్వయం పాటించాలని సూచించారు. కేసు దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందన్నారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనసేన నాయకులు కంది రవిశంకర్, అడ్మిన్ ఏఎస్పీ ఎం.నాగేశ్వరరావు, ఏఆర్ అడ్మిన్ ఏఎస్పీ కె.అశోక్‌కుమార్, రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, ఎస్‌ఐ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్య పోరుతోనే హత్య



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, బ్యాగ్, సెల్‌ఫోన్లు



నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

వీరయ్యచౌదరి హతమార్చేందుకు నాలుగు నెలల ముందు నుంచే ప్లాన్

పెద్ద మొత్తంలో సుపారీ, అడ్వాన్స్‌గా రూ.20లక్షలు

- సూత్రధారి సిద్ధాంతి, ప్రధాన పాత్రధారి వినోద్
- తొమ్మిది మంది అరెస్టు
- పరారీలో సురేష్‌తోపాటు మరో ఇద్దరు

ఒంగోలు క్రైం, మే14 (ఆంధ్రజ్యోతి): ఆధిపత్య పోరులో భాగంగానే తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరిని అత్యంత దారుణంగా మట్టుబెట్టారు. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన వీరయ్యచౌదరి టీడీపీలో చురుకైన నేత. అదే సమయంలో లిక్కర్‌తోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఉంటాడు. గ్రామంలో వీరయ్యచౌదరితోనే తిరిగి మనస్పర్థల కారణంగా మరో గ్రూపుగా ఏర్పడిన కొందరు వ్యక్తులు కిరాయి హంతకులతో వీరయ్యచౌదరిని గతనెల 22 రాత్రి ఒంగోలులోని పద్మ టవర్స్ సమీపంలో ఆయన కార్యాలయంలోనే దారుణంగా హత్య చేయించారు. అందుకు సంబంధించి 12 మందిని నిందితులుగా గుర్తించి తొమ్మిది మందిని అరెస్టు చేశామని, ఇంకా ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. ఈ మేరకు ఎస్పీ ఏఆర్.దామోదర్ బుధవారం తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుల వద్ద ఏడు మొబైల్ ఫోన్లు, మూడు కత్తులు, నల్ల బ్యాగ్, స్కూటీ, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు... ఒంగోలు

మిగతా 6లో...

పోలీసుల అదుపులో నిందితులు వీరే..

నిందితుల్లో ప్రధాన పాత్రధారి కొప్పోలు రోడ్డులోని డ్రీమ్స్ స్కూలు సమీపంలో నివాసం ఉండే ఇసుక వ్యాపారి బోరుగుంట వినోద్, కిరాయి హంతకులు నెల్లూరు ఏసయ్య కాలనీకి చెందిన తువ్వర వంశీకృష్ణ అలియాస్ జల్సా కృష్ణ, నెల్లూరులోని భక్తవత్సలనగర్ కృష్ణమందిరం ఎదురుగా నివాసం ఉండే బెల్లంకొండ వెంకటగౌతం, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంనకు చెందిన మన్నెం తేజలతో పాటుగా వినోద్ బావ అయిన హైదరాబాద్‌లో ఉంటున్న ఒంగోలు బాలాజీనగర్ వాసి మార్బూరి కిరణ్‌కుమార్, చీమకుర్తి నివాసి ప్రస్తుతం ఒంగోలు బలరామ్‌కాలనీలో ఉంటున్న వినోద్ అసిస్టెంట్ షేక్ సమీర్, హత్య కేసులో సూత్రధారిగా ఉన్న అమ్మనబ్రోలుకు చెందిన ఆళ్ల సాంబయ్య, దేవేంద్రనాథ్ చౌదరి, నాగులుప్పలపాడు మండలం దాసరివారిపాలెంనకు చెందిన తోటా శ్రీనివాసరావులను పోలీసులు అరెస్టు చేశారు. అమ్మనబ్రోలుకు చెందిన పారిశ్రామికవేత్త ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ముప్పా సురేష్, కిరాయి హంతకుడు నెల్లూరుకు చెందిన ఓబిలి నాగరాజు, నెల్లూరుకు చెందిన గోళ్ల రుత్యేంద్రబాబు అలియాస్ నానిలు పరారీలో ఉన్నారు. ఇంకా ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుందని, అనుమానితులను విచారించామని, ఇంకా దర్యాప్తులో భాగంగా మరికొంతమందిని విచారిస్తామని పోలీసులు తెలిపారు.



ఈ రోగం తగ్గేదెలా?

- జిల్లా వైద్యశాఖలో ఏం మారలేదు
- ప్రభుత్వం కోట్లు వ్యయం చేస్తున్నా ప్రజలకు అందని ఆరోగ్య సేవలు
- మంత్రి సత్యకుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బయటపడ్డ డొల్లతనం
- డీఆర్సీ సమావేశంలోనూ ఎమ్మెల్యేలు గరంగరం
- అనేక పథకాల అమలులోనూ వెనుకబాటే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అనేక మార్పులు తెచ్చినా క్షేత్రస్థాయిలో వాటి అమలు విషయంలో నిర్లక్ష్యం, నిర్లిప్తత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జిల్లాస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవల వైద్యశాలల్లో అందుతున్న సేవలపై ప్రభుత్వం ప్రకటించిన గ్రేడ్‌లలో జిల్లాలో ఒక్క పీహెచ్‌సీ కూడా ఏ-గ్రేడ్‌లో లేకపోవడమే ఇందుకు నిదర్శనం. నెలకు లక్షల్లో వేతనం తీసుకుంటున్న వైద్యులు, ఇతర సిబ్బంది ఆ వైద్యశాలలకు ఎప్పుడు వెళ్తున్నారో కూడా తెలియడం లేదు. జిల్లాలో 50శాతం మందికి మించి ప్రజలకు వైద్య సేవలు అందడం లేదు. పీహెచ్‌సీల్లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కాన్పులు (డెలివరీలు) జరగడం లేదనే విషయం స్పష్టమైంది.

6

అందమైన కుటుంబం.. ఆనంద నిలయం

నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం 7

మెగా డీఎస్సీ దరఖాస్తుకు నేడు తుది గడువు

ఒంగోలు విద్య, మే 14(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ దరఖాస్తు గడువు గురువారంతో ముగియనుంది. మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు గురువారం సాయంత్రంలోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఈనెల 20 నుంచి అభ్యర్థులకు ఆన్‌లైన్ మాక్ టెస్టులు అందుబాటులో ఉంటాయి. 30 నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఆపేదెవరు.. ఆక్రమించెయ్..!

(5వ పేజీ తరువాయి)
హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ భూమి కోర్టులో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. ఆ భూమిపై రెండు ప్రధాన పార్టీల పార్టీలకు చెందిన నేతలు కన్నేశారు. అది తమ ఆధీనంలో ఉన్నట్లు బుయిస్తున్నారు. సిండికేట్ రాజకీయాలతో భూమిని పంచుకునేందకు రహస్య ఒప్పందాలు కుర్చుకున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే వీటితోపాటు ఎంతో విలువైన ఖాళీ భూములు కబ్జా అయ్యే ప్రమాదం ఉంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

219-2 సర్వే నెంబర్‌లో భూ సమస్య ప్రస్తుతం కోర్టులో ఉంది. సర్వే నెంబర్ 217లో 1.56 సెంట్లు భూమిలో ఆక్రమణలు జరుగుతున్న విషయం తెలియదు. పరిశీలించి ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- క్రిష్ణారెడ్డి, తహసీల్దార్

ఈ రోగం తగ్గేదెలా?

ఒంగోలు కలెక్టరేట్ మే 14 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ, అనుబంధ శాఖల ద్వారా అందుతున్న వైద్యసేవలు, అమలవుతున్న పథకాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ఎంటి. కృష్ణబాబులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యశాఖలో అనేక మార్పులు తెచ్చినా క్షేత్రస్థాయిలో అవి సక్రమంగా అమలు కాకపోవడంపై మండిపడ్డారు. ఆ కాన్ఫరెన్స్‌లో జిల్లాల వారీగా సమీక్ష చేయగా మన జిల్లా మధ్య స్థానంలో ఉంది. కొన్ని అంశాల్లో మరింత వెనుకబడి ఉండటాన్ని ప్రస్తావించారు. మరోవైపు రెండు రోజుల క్రితం ఒంగోలులో జరిగిన జిల్లా సమీక్షా మండలి సమావేశంలో పలువురు శాసనసభ్యులు వైద్యశాఖ తీరుపై మండిపడ్డారు. వైద్యసేవలతోపాటు ఇటీవల కాలంలో ఉద్యోగుల డిప్యుటేషన్లపై ఎమ్మెల్యేలు సమావేశంలో ప్రస్తావించారంటే ఆ శాఖ పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ముఖహాజరులో అక్రమాలు

ఉద్యోగుల విషయానికి వస్తే ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యాధికారులు, ఇతర సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు అమలు చేస్తున్నా సక్రమంగా అమలు కావడం లేదు. మార్చి నెలలో 17 మంది మెడికల్ ఆఫీసర్లు ఐఫోన్ ద్వారా ముఖ హాజరును ట్యాంపరింగ్ చేయగా ఇతర వైద్యులు, సిబ్బంది ఇష్టానుసారంగా పీహెచ్‌సీలకు వెళ్లిన పరిస్థితి కనిపించింది. ప్రస్తుతం కూడా కొంతమంది వైద్యులు, ఇతర సిబ్బంది ఉదయం, సాయంత్రం సమయంలో ముఖహాజరు వేసి వ్యక్తిగత పనులు చూసుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కూటమి ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో వైద్యశాఖకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించినా క్షేత్రస్థాయిలో మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వైద్యశాఖను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొబ్బరిచెట్టుపై పడిన పిడుగు

యద్దనపూడి, (మార్టూరు)మే14(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం పోలూరు గ్రామంలో నున్నా సీతారావమ్మ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరిచెట్టుపై బుధవారం సాయంత్రం పిడుగు పడింది. ఈ ఘటనలో కొబ్బరి చెట్టు పూర్తిగా దగ్గమయ్యింది. అయితే ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

- మల్లవరంనకు భారీగా తరలివచ్చిన భక్తులు
- స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోగుని గుండ్లకమ్మ ప్రాజెక్టు చెంత ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉభయ దేవేరులతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు కల్యాణ క్రతువు నిర్వహించారు. శ్రీవారి కల్యాణం తిలకించేందుకు దాదాపు 25 వేల మంది భక్తులు తరలిరావడంతో ఆలయ అధికారులు అందకనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రవికుమార్, కొండూరి శ్రీనివాస్ అయ్యంగార్, దివి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ఈవో దామా నాగేశ్వరరావు ఎమ్మెల్యేకు శాస్త్రోక్తంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉభయ దాతలుగా మహాలక్ష్మమ్మ, ఎర్రరెడ్డి దంపతులు, పల్లకి సుబ్బరామిరెడ్డి మనువలు వ్యవహరించారు. ఇక సంపత్‌కుమార్, గాలి రాఘవవరప్రసాద్, అద్దంకి శ్రీరామచంద్రమూర్తి, అద్దంకి మురళీకృష్ణ, వింజనంపాటి సారథి ఆలపించిన నారాయణ తీర్థ తరంగాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. మల్లవరం అన్నదాన కమిటీ నిర్వాహకులు నారిపెద్ది వరహాలుచౌదరి, శ్రీవారి వనం కమిటీ సభ్యులు మార్నేని కృష్ణారావు, కావూరి వాసుబాబు, మార్నేని సుబ్బారావు, మార్నేని రాఘవరావు, మన్నం శ్రీనివాస్, తేళ్ల వెంకటసుబ్బారావు, చెరుకూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా బ్రాహ్మణ సేవా సంఘం, ఆర్యవైశ్య సంఘం, ఇతర పలు సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబుతో పాటు పలువురు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.


అమ్మవారి మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకులు

శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం పురస్కరించుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు పర్యవేక్షణలో నాగులుప్పలపాడు, మద్దిపాడు, ఎస్ఎన్‌పాడు, చీమకుర్తి పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యులు ఆలయం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. ఇక వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మెరుగ నాగార్జున స్వామివారిని దర్శించుకుని పూజలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు వాకా కోటిరెడ్డి, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, ఎంపీటీసీ పైనం ప్రభాకర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం


స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

టీచర్ల బదిలీలకు రంగం సిద్ధం

(5వ పేజీ తరువాయి)
బదిలీ కావాల్సిందే.

పాయింట్ల కేటాయింపు ఇలా..

కేటగిరీ-1 పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న టీచర్లకు సంవత్సరానికి ఒక పాయింట్, కేటగిరీ-2 మునిసిపల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి రెండు పాయింట్లు, గ్రామీణ ప్రాంతాల్లో కేటగిరీ-3లో పనిచేస్తున్న వారికి ఏడాదికి మూడు పాయింట్లు, కేటగిరీ-4 మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ఏడాదికి ఐదు పాయింట్లు కేటాయిస్తారు.

- ఉపాధ్యాయులు పనిచేసిన మొత్తం కాలానికి సంవత్సరానికి 0.5 పాయింట్లు
- భార్యభర్తలు ప్రభుత్వ ఉద్యోగులు/ఉపాధ్యాయులు అయితే వారికి ఐదు పాయింట్లు కేటాయిస్తారు. భార్యభర్తల్లో ఒకరికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. అయితే భార్య లేదా భర్త దగ్గరకు కోరుకోవాల్సి ఉంటుంది. భార్య లేదా భర్త ఇరువురు తప్పనిసరిగా బదిలీ కావాల్సి వస్తే ఒకరికి మాత్రమే ఈ పాయింట్లు వర్తిస్తాయి.
- అవివాహిత మహిళా టీచర్లకు ఐదు పాయింట్లు.
- 40 నుంచి 55శాతం వరకు శారీరక వైకల్యం ఉన్నవారికి, 60 నుంచి 70శాతం వినికిడి లోపం ఉన్న వారికి ఐదు పాయింట్లు.
- 40 శాతం దృష్టిలోపం ఉన్నవారికి, 56 నుంచి 59 శాతం శారీరక వైకల్యం గల వారికి ఏడు పాయింట్లు.
- ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు ఐదు పాయింట్లు.
- విడాకులు తీసుకున్న మహిళలు (మళ్లీ పెళ్లి చేసుకోనివారు) ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్‌లో పనిచేసి ప్రస్తుతం టీచర్లుగా పనిచేస్తున్న వారికి ఐదు పాయింట్లు
- రెండు సంవత్సరాలుగా పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ నిర్వహిస్తున్న వారికి ఐదు పాయింట్లు
- పునర్విభజనలో తప్పనిసరిగా బదిలీ అయ్యే వారికి ఐదు పాయింట్లు

ప్రాధాన్యత కేటగిరి వీరికే..

- వందశాతం దృష్టిలోపం, 80శాతం అంతకుపైగా శారీరక వైకల్యం గలవారికి బదిలీల్లో మొదటి ప్రాధాన్యత ఇస్తారు.
- 75శాతం దృష్టిలోపం 70 నుంచి 79శాతం శారీరక వైకల్యం గలవారు, 70శాతంపైగా వినికిడి లోపం ఉన్నవారికి రెండో ప్రాధాన్యత
- పునర్వివాహం చేసుకొని వితంతువు
- క్యాన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ, బోనోటీసీ, కిడ్నీ మార్పిడి, డయాలసిస్, స్పైనల్ సర్జరీ చేయించుకున్న వారికి
- స్పౌజ్ లేదా పిల్లలు మానసిక రుగ్మతతో జునవైల్ డయాలసిస్, తలసేమియా, హీమోఫిలియా, కండరాల క్షీణితకు వైద్య చికిత్స పొందుతున్న వారికి అవకాశం ఇస్తారు.

నెగిటివ్ పాయింట్లు

టీచర్ల బదిలీల్లో మొదటిసారిగా నెగిటివ్ పాయింట్లు ప్రవేశపెట్టారు. అధికారుల ముందస్తు అనుమతి లేకుండా అనధికారికంగా విధులకు గైర్హాజరైన టీచర్లకు నెలకు ఒక పాయింట్ చొప్పున గరిష్ఠంగా 10 నెగిటివ్ పాయింట్లు కేటాయించారు. వీరిపైన క్రమశిక్షణ చర్యలు కూడా ఉంటాయి.

- బదిలీల్లో ఇద్దరు ముగ్గురు టీచర్లకు ఒకే ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్లు వస్తే సర్వీసులో సీనియారిటీకి మొదటి ప్రాధాన్యత. ఒకే సర్వీసు ఉంటే పుట్టిన తేదీని బట్టి మహిళా టీచర్లకు ఆ తర్వాత ప్రాధాన్యత లభిస్తుంది.

యథాస్థానాల్లో దివ్యాంగ టీచర్లు.. కోర్టు కేసు తేలితేనే బదిలీ

ఒంగోలు విద్య, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగ టీచర్లు ప్రస్తుతానికి వారు పనిచేస్తున్న స్థానాల్లోనే యథావిధిగా కొనసాగుతారు. ఆయా స్థానాల్లో హెచ్‌ఎంలకు ఐదు సంవత్సరాలు, ఇతర టీచర్లకు ఎనిమిది సంవత్సరాలు పూర్తయినా వారికి స్థానచలనం ఉండదు. ప్రస్తుతం హైకోర్టు ఉన్న కేసు తేలి తుది తీర్పు వచ్చేవరకు వారి స్థానాలకు ఢోకా లేదు. ఉపాధ్యాయుల బదిలీ నిబంధనల ప్రకారం ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తయిన హెచ్‌ఎంలు, ఎనిమిదేళ్లు పూర్తయిన ఇతర టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. వారి స్థానాలను ముందుగా బదిలీలకు ఖాళీలుగా చూపించాల్సి ఉంది. అయితే దృష్టిలోపం ఉన్న వారు తమను బదిలీ చేయవద్దని, పనిచేస్తున్న స్థానాల్లోనే కొనసాగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. గత ప్రభుత్వం తమకు బదిలీల్లో మినహాయింపు ఇచ్చినందున ఇప్పుడు కూడా ఇవ్వాలని హైకోర్టును అభ్యర్థించారు. హైకోర్టు వారి మొర ఆలకించి బదిలీల్లో వీరికి యథాతథస్థితి (స్టేటస్ కో) ఇస్తూ విచారణను జూలైకి వాయిదా వేసింది. దీంతో దృష్టిలోపం గల టీచర్లను బదిలీల నుంచి మినహాయించారు. వారు తప్పనిసరిగా ఉన్న వారి స్థానాలను ఖాళీలుగా చూపించలేదు. కోర్టు కేసు తేలేంత వరకు వారు అక్కడే కొనసాగుతారు. దృష్టిలోపం ఉన్న టీచర్లను స్ఫూర్తిగా తీసుకొని హైకోర్టును ఆశ్రయించిన శారీరక వైకల్యంగల టీచర్లు కూడా హైకోర్టు స్టేటస్ కో ఇచ్చి ఊరట కల్పించింది. గతంలో 40శాతం వైకల్యం వారిని ప్రాధాన్యత కేటగిరీలో బదిలీకి అవకాశం కల్పించగా ప్రస్తుతం 70శాతంపైన వైకల్యం ఉంటేనే ప్రాధాన్యత కేటగిరీలో గుర్తిస్తున్నారు. ఈ అంశాన్ని సవాల్ చేస్తూ దివ్యాంగ టీచర్లు హైకోర్టును ఆశ్రయిచారు. వీరి కేసు కూడా విచారణ జూలైకి వాయిదా వేసింది. దీంతో హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో వీరి స్థానాలు కూడా ఖాళీగా చూపించకుండా వారిని అక్కడే కొనసాగిస్తున్నారు. కోర్టు కేసు తేలితేగాని వీరి బదిలీల వ్యవహారం కొలిక్కి రాదు. ఇటీవల రిమ్స్ మెడికల్ బోర్డు దివ్యాంగ టీచర్లను పరీక్షించి వారికి 40శాతంలోపు వైకల్యం ఉన్నట్లు ధ్రువీకరించడంతో వారు మాత్రం బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావడంతో వారి స్థానాలను ఖాళీలుగా చూపించారు.

ఆయిల్‌ఫాం సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- మార్టూరు మండలంలో 250 ఎకరాల్లో సాగుకు తోడ్పాటు
- ఉచితంగా మొక్కల పంపిణీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

పర్చూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిలో భాగంగా మార్టూరు మండల రైతాంగానికి 250 హెక్టార్లలో పామాయిల్ సాగు చేసుకునే విధంగా ఉద్యానశాఖ అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇస్తూ జీవో విడుదల చేసింది. దీనిలో భాగంగా ప్రభుత్వం రైతులకు తొలివిడతగా సాగుచేసే 250 ఎకరాలకు సరిపడా మొక్కలను అజంతా సోయా సీడ్స్ లిమిటెడ్ సమకూర్చనుంది. ఒక హెక్టారుకు రూ.20వేల విలువైన 150 మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేయనుంది. అంతేకాక నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.5250 చొప్పున హెక్టారుకు నిర్వహణ నిమిత్తం కింద పెట్టుబడి అందజేసేలా కూటమి ప్రభుత్వం ఉద్యాన శాఖకు అనుసందానించింది. ఎమ్మెల్యే ఏలూరి వ్యవసాయ రంగంపై ఉన్న మక్కువతో మార్టూరు, బల్లికురవ మండలాల్లోని ఉద్యాన రైతులను ఆధునికసాగు వైపు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో ఫలితం దక్కినట్లయ్యింది. అంతేకాక ఇంపోర్టెడ్ మొక్కల సాగుచేసే అయిల్ ఫామ్ రైతులకు మొక్కలు కొనుగోలు కోసం నూరుశాతం రాయితీగా రూ.29 వేలు అందజేయనున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం మార్టూరు మండలంలో ఆయిల్‌ఫామ్ సాగుకు 250 ఎకరాల్లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


సాగుపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు

76 విద్యాలయాలకు ఫ్యాన్లు, లైట్లు

అద్దంకి, మే14 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో సుమారు రూ.50 లక్షలతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)నిధులతో అద్దంకి నియోజకవర్గంలోని 76 పాఠశాలలు, కళాశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలకు 1009 ఫ్యాన్‌లు, 1160 లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు ఫ్యాన్లు, లైట్లు చేరాయి. పనులు కూడా ప్రారంభించి పూర్తి చేస్తున్నారు. అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఇప్పటి వరకు 550 మందికి సైకిళ్లు పంపిణీ చేయగా, నియోజకవర్గంలోని అన్ని హైస్కూళ్లలో చదివే సుమారు 10 వేల మంది బాలికలకు త్వరలో సైకిళ్ళ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. పేద విద్యార్థులు విద్యనభ్యసించే పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో వసతులను విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అన్ని విద్యాలయాలలో కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటుపై మంత్రి దృష్టి సారించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా పీ-4 విధానాన్ని ఆదర్శంగా తీసుకున్న మంత్రి గొట్టిపాటి విద్యాశాఖకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన చేస్తున్నారు. దీనిపై విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఏర్పాటు చేస్తున్న ఫ్యాన్లు, వచ్చిన స్టాక్

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అవీఇవీ

- ఫోన్‌చేసి కుటుంబ సభ్యులకు చివరి కాల్ అంటూ సమాచారం
- మాటల్లో పెట్టి అడ్డుకున్న కుటుంబ సభ్యులు

చీరాల, మే 14 (ఆంధ్రజ్యోతి) : మనసస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈఘటన బుధవారం మండల పరిధిలోని వాడరేవు సముద్రతీరంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కావూరివారిపాలెంకు చెందిన వ్యక్తి ఇటీవల కొంత అప్పులు పాలయ్యాడు. ఈక్రమంలో ఓ బ్యాంకులో లోనుకు దరఖాస్తు చేసుకొనగా కొంత ప్రాసెస్ జరగాక బ్యాంకర్స్ లోను రాదని మంగళవారం ఫోన్ ద్వారా తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన అతను ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి వెతుకులాట ప్రారంభించిన కుటుంబ సభ్యులకు తిరిగి అతనే బుధవారం చివరి సారిగా అంటూ వీడియో కాల్ చేశాడు. ఈసమయంలో కుటుంబ సభ్యులు ఈపూరుపాలెం పోలీసుల సహాయంతో లొకేషన్ గుర్తించి అతడిని సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. ఆలస్యమయితే ఇబ్బంది జరిగేదని కుటుంబ సభ్యులు విలపించారు.

బెదిరింపులకు పాల్పడుతున్నట్లు మహిళ ఫిర్యాదు

వేటపాలెం/చీరాల, మే 14 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీలతో బెదిరింపులకు పాల్పడుతున్నారని ఓ మహిళ వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దేశాయిపేటకు చెందిన మహిళ మరొకరికి బాకీ పడింది. దీంతో వారు రూ.10 వడ్డీ వసూలు చేస్తూ బెదిరిస్తున్నట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

చెత్త తొలగిస్తుండగా తల్లి, కొడుకుపై దాడి

అద్దంకి, మే 14(ఆంధ్రజ్యోతి) : వర్షం నీళ్ల ఇంటిలోకి వస్తుండగా సైడ్ కాలువలో చెత్త తొలగిస్తున్న తల్లి, కొడుకుపై దాడి చేయటంతో గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... మండలంలోని ధర్మవరంలో బుధవారం ఉదయం వర్షం పడి సైడ్ కాలువలో నీరు ఇంట్లోకి వస్తుండటంతో యద్దనపూడి లీలమ్మ సైడ్ కాలువలో చెత్త తొలగిస్తుంది. చెత్త తొలగిస్తే వర్షపు నీరు పక్క ఇంట్లోకి పోతాయని మారం సుబ్బారెడ్డి, కుమారులు కోటిరెడ్డి, సుదర్శన్‌రెడ్డిలు లీలమ్మ, కుమారుడుని కొట్టగా గాయాలయ్యాయి. దీంతో బాధితుడు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవితేజ తెలిపారు.

ఆధిపత్య పోరుతోనే హత్య!

(5వ పేజీ తరువాయి)
డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు బుధవారం దక్షిణ బైపాస్ రోడ్డులో గల కార్గిల్ పెట్రోల్ బంకు వద్ద కొంత మంది నిందితులను, ముక్తినూతలపాడు ప్లైఓవర్ బ్రిడ్జి కింద మరి కొంతమందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.

పంచాయతీ ఎన్నికలు నాంది

నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వీరయ్య చౌదరికి వ్యతిరేకంగా సర్పంచ్ అభ్యర్థిని నిలబెట్టి ఆళ్ల సాంబయ్య నేతృత్వంలో రూ.1.80కోట్లు వసూలు చేసి ఖర్చుపెట్టి గెలిపించుకున్నారు. అందుకు సాంబయ్య మేనల్లుడు ముప్పా సురేష్ కూడా సహకారం అందించాడు. అదేసమయంలో వీరయ్యచౌదరికి వ్యతిరేకులు అంతా ఒక తాటి మీదకు వచ్చారు. అప్పటి నుంచి వడ్డీ వ్యాపారం చేసే సాంబయ్య వద్ద అప్పు తీసుకున్న వారు తిరిగి చెల్లించకుండా చేస్తున్నాడని వీరయ్యపై కక్ష పెంచుకున్నాడు. అదే సమయంలో ఇసుక వ్యాపారం చేసుకుంటున్న వినోద్‌కు సంబంధించిన ఇసుక లారీలను అధికారులకు పట్టించి వ్యాపారానికి అడ్డు వస్తున్నాడని, తమ ఆర్థిక మూలాలు దెబ్బతీస్తున్నాడని వీరయ్యచౌదరిపై వినోద్ కూడా పగ పెంచుకున్నాడు. ఇలా వరుసగా జరుగుతున్న పరిణామాలతో వీరయ్యచౌదరి బతికి ఉంటే తమ పెత్తనం సాగదని, అంతేకాకుండా తన మేనల్లుడు సురేష్ రాజకీయ భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకమే అని భావించారు. దీంతో సాంబయ్య, వినోద్‌లు కలిసి వీరయ్యచౌదరిని హత్య చేయడానికి పథకం రూపొందించారు. పెద్దమొత్తంలో నగదు ఇస్తానని వినోద్‌కు చెప్పి రూ.20లక్షలు అడ్వాన్స్‌గా సాంబయ్య ఇచ్చాడు. అయితే కిరాయి హంతకులకు మాత్రం వినోద్ రూ.40 వేలు మాత్రమే ఖర్చులకు ఇచ్చి హత్య చేయించాడు.

హత్య చేసింది ఇలా...

గత జనవరి నుంచే వీరయ్యచౌదరి హత్యకు పథకం రూపొందించిన వినోద్.. ఒకసారి హైదరాబాద్‌కు చెందిన కిరాయి ముఠాను ఒంగోలు తీసుకొచ్చాడు. అయితే వారు ఒంగోలు వచ్చి ఇక్కడ వీరయ్య గురించి తెలుసుకొని ఆయన టీడీపీలో పేరు ఉన్న నాయకుడని గుర్తించి హత్య చేసేందుకు అంగీకరించకుండా వెళ్లిపోయారు. అనంతరం వినోద్‌పై సాంబయ్య వత్తిడి పెంచాడు. ఎందుకు జాప్యం జరుగుతుందని నిలదీయడంతో వినోద్ నెల్లూరులో తన స్నేహితుడైన గోళ్ల రుత్వేంద్ర బాబు అలియాస్ నానిని సంప్రదించాడు. అక్కడి నుంచి నెల్లూరుకు చెందిన కిరాయి హంతకుడు నాగరాజుతో మాట్లాడి వారు ఇరువురు కలిసి ఒంగోలు వచ్చి కొద్దిరోజులు ఒక లాడ్జిలో మకాం వేసి వీరయ్యచౌదరి హత్యకు వినోద్‌తో కలిసి పథకం రూపొందించారు. జనవరి నుంచి మూడు నెలల పాటు పలు దఫాలు వారు ఒంగోలు వచ్చి వెళ్లారు. గత నెల 20న నెల్లూరు నుంచి నాగరాజు, వంశీకృష్ణ, వెంకట్ గౌతం, మన్నెం తేజ అలియాస్ బన్నీలు ఒంగోలు వచ్చి ఓ హాస్టల్ మకాం వేశారు. అయితే వీరయ్య చౌదరి హైదరాబాద్ వెళ్లినట్లు తెలుసుకున్నారు. అనంతరం 21న ఒంగోలు రాగా ఆయనపై నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు తోట శ్రీనివాసరావు ద్వారా వీరయ్యచౌదరి కదలికలను తెలుసుకుంటున్నారు. 22వ తేదీ సాయంత్రం 7 గంటల తర్వాత వీరయ్య తన కార్యాలయానికి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ముందుగానే హత్య చేసేందుకు వారు వెంట తెచ్చుకున్న కత్తులను బ్యాగ్‌లో పెట్టుకొని స్కూటీపై ఇద్దరు, మోటర్ సైకిల్‌పై ఇద్దరు కిరాయి హంతకులు వీరయ్యచౌదరి కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఉన్న సిబ్బందిని బెదిరించి వీరయ్యని నాగరాజు, వెంకటగౌతం అత్యంత కిరాతకంగా 50 కత్తిపోట్లు పొడిచారు. ఆ సమయంలో వంశీ చేతికి కూడా కత్తిగాటు పడి గాయమైంది. అయితే ఇదంతా రెండు నిమిషాలలో జరిగింది. వీరయ్యచౌదరి మృతిచెందాడని తేల్చుకుని నలుగురు అక్కడి నుంచి పరారయ్యారు.

సురేష్‌కు వినోద్‌తో పరిచయం

ఇసుక వ్యాపారంలో నష్టపోయి ఉన్న వినోద్ అప్పటికే వీరయ్యచౌదరిపై పగ పెంచుకున్నాడు. అదేసమయంలో పురుగుమందులు వ్యాపారం చేసే తోట శ్రీనివాసరావు ద్వారా వినోద్‌తో సాంబయ్యకు పరిచయం ఏర్పడింది. దీంతో సురేష్‌కు హైదరాబాద్‌లో ఉన్న కొన్ని ఇళ్లకు సంబంధించిన వివాదాలను పరిష్కరించేందుకు వినోద్‌ని తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో చెన్నైలో సురేష్‌కు రూ.9కోట్లు బకాయి ఉన్న రఘురామ్ దగ్గర డబ్బులు వసూలు చేసేందుకు సాంబయ్య, వినోద్‌ను ప్రయోగించాడు. నెల్లూరు నుంచి కొంతమంది రౌడీషీటర్లను వెంట తీసుకెళ్లి వినోద్ రఘురామ్‌ను బెదిరించారు. దీంతో వినోద్‌పై సాంబయ్యకు నమ్మకం పెరిగి వీరయ్యచౌదరి హత్యకు డీల్ కుదుర్చుకున్నారు.

- పోలీసులను అభినందించిన ఎస్పీ

వీరయ్యచౌదరి హత్య కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు పాండురంగారావు, సుధాకరరావు, సుబ్బారావు, సూర్యనారాయణ, జగదీష్, సుబ్బారావు, శ్రీకాంత్‌బాబుతోపాటు ఎస్ఐలను ఎస్పీ అభినందిచారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు


చీరాల, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉషారాణి, అపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్‌థామస్ ఆధ్వర్యంలో 35 బృందాలుగా ఏర్పడి 2263 మీటర్లను తనిఖీలు చేశారు. అందులో భాగంగా విద్యుత్‌చౌర్యం కేసులో 16 మందికి రూ.29,100, అపరిమిత లోడ్ 342 మందికి గాను రూ.12,38 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి ప్రసాదరావు, ఏఈలు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

అందమైన కుటుంబం.. ఆనంద నిలయం

కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాలు
బలహీనపడుతున్న జాయింట్ ఫ్యామిలీ వ్యవస్థ
పెద్దల పర్యవేక్షణ లేక పెడదోవపడుతున్న యువత

నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం



ఒంగోలు కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : తల్లి, తండ్రి, అన్న, వదిన, తమ్ముడు, మరదలు, వాళ్ల పిల్లలు వెరసి దాదాపు 15 నుంచి 20 మంది వరకు ఒకే ఇంట్లో ఉంటూ ఒకరికొకరు ఆప్యాయతలను పంచుకుంటూ.. ప్రతి పనిలో పెద్ద వాళ్ల సలహాలను పాటిస్తూ సాగేవి గతంలో ఉమ్మడి కుటుంబాలు. కొన్ని దశాబ్దాల కిందటి వరకు ఇటువంటి కుటుంబాలు ప్రతి ఊరిలో విస్తృతంగా కనిపించేవి. మగవారు అందరూ కలిసి వ్యవసాయమో, వ్యాపారమో చేయటం, ఆడవారు ఇంటిపనులు చక్కబెట్టడం చేసేవారు. ఇక ఏదైనా పండగ వచ్చినా, శుభకార్యం జరిగినా ఆ ఇంటిలో వారందరూ అన్యోన్యంగా కలిసి చేసుకునే విధానం చూస్తే ఎంతో ముచ్చటేసేది. కాలం మారేకొద్దీ ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్న పరిస్థితి. గ్రామాలలో ఉండేవారిలో చాలా వరకు పట్టణాలు, నగరాలకు జీవనోపాధి కోసం తరలిపోవటంతో ఉమ్మడి కుటుంబాలు కనిపించకుండా పోతున్నాయి. ఉమ్మడి కుటుంబంలో చిన్నవాళ్లకు పెద్దవాళ్ల సలహాలు ఇవ్వటమే కాకుండా వారి పర్యవేక్షణ కూడా ఉంటుంది. దీనితో క్రమశిక్షణ కలిగిన వారుగా పిల్లలు పెరుగుతారు. అయితే నేడు ఉమ్మడి కుటుంబాలు పోయి చిన్న కుటుంబాలు ఏర్పడటం, తల్లిదండ్రులిద్దరు ఉద్యోగాలలో ఉండటంతో పిల్లలపై పర్యవేక్షణ సైతం తగ్గిపోయి వారు పెడదోవ పడుతున్న దాఖలాలు అనేకం కనిపిస్తాయి. ఇటువంటి కుటుంబవ్యవస్థ గొప్పదనాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఐక్యరాజ్య సమితి ప్రతి సంవత్సరం మే 15వ తేదీన అంతర్జాతీయ కుటుంబ దినోత్సవంగా ప్రకటించి 1993 నుంచి అమలు చేస్తున్నది.



మారుతున్న జీవన విధానం

ప్రస్తుత సమాజంలో జీవన విధానంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుత తరంలో ఎక్కువ మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలలో స్థిరపడాలనే ఆలోచనతో పట్టణాలు, నగరాలకు వెళుతున్నారు. దీంతో ఉమ్మడి కుటుంబం అనేది దాదాపుగా కనుమరుగవుతోంది. ఇక పట్టణాలు, నగరాలలో స్థిరపడే వారు తమ వ్యాపారాలు, ఉద్యోగాలలో బిజీబిజీగా గడుపుతూ తల్లిదండ్రులను, అన్నదమ్ములను, బంధువులను కలుసుకునే తీరిక లేకుండా గడుపుతున్నారు. దీంతో కుటుంబ సంబంధాలు సైతం తగ్గిపోతున్నాయి.



యువతపై పర్యవేక్షణ కరువు

తల్లిదండ్రులు ఉద్యోగాలు, వ్యాపారాలలో బిజీగా ఉండటంతో వారి పిల్లలపై పర్యవేక్షణ కూడా తగ్గిపోతోంది. అనేకమంది యువత తల్లిదండ్రులకు తెలియకుండా చెడు స్నేహాలు చేయటం, వ్యసనాలకు బానిసలు కావటం కూడా జరుగుతోంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబంలో పిల్లలకు పెద్దల పట్ల భయం ఉండేది. తాము ఏదైనా తప్పు చేస్తే వెంటనే పెద్దవాళ్లకు తెలిసిపోతుందనే భావన ఉండేది. ప్రస్తుతం అనేక కుటుంబాలలో పిల్లలు బైటికి వెళ్లిన తర్వాత వాళ్లు ఏమి చేస్తున్నారనే విషయం పట్టించుకునే తీరిక చాలా మంది తల్లిదండ్రులకు ఉండటం లేదు. దీంతో యువత పెడదారి పడుతున్న సంఘటనలు నిత్యం చూస్తుంటాము.

అవగాహన పెరగాలి

ప్రస్తుత సమాజంలో కుటుంబవ్యవస్థ గొప్పదనంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. దీనికోసం ఎక్కడికక్కడ కుటుంబ వ్యవస్థ గురించి సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రస్తుతం పట్టణాలు, నగరాలలో ఫ్యామిలీ క్లబ్‌లను ఏర్పాటుచేసి వారాంతంలో అనేక కుటుంబాలు కలిసి ఆటపాటలతో గడపటం వంటివి చేస్తున్నాయి. మన జిల్లాలో ఒంగోలు నగరంలో సైతం ఇటువంటి ఫ్యామిలీ క్లబ్‌లను ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా కార్యక్రమాలు జరగటం లేదు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు విద్య, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం గణితం, బోటనీ, సివిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం పరీక్షకు 11,176 మందికిగాను 10,464 మంది హాజరయ్యారని ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్‌ఐవో సైమన్ విక్టర్ చెప్పారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 2081 మందికి 1893 మంది హాజరయ్యారు. యర్రగొండపాలెం, త్రిపురాంతకం, మార్కాపురంలోని పరీక్షా కేంద్రాలను ఆర్‌ఐవో తనిఖీ చేశారు.

చందలూరు కొండ పోరంబోకు నకిలీ పట్టాలు రద్దు



నకిలీ పట్టాలు రద్దు చేసిన చందలూరు కొండపోరంబోకు భూమి ఇదే

దర్శి, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు కొండభూమికి కొంతమంది అక్రమార్కులు పొందిన నకిలీ పట్టాలను జిల్లా రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. ఇందుకు సంబంధించి గతంలో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. చందలూరు రెవెన్యూలోని 787 సర్వేనెంబర్‌లో 1,400 ఎకరాల కొండభూమి ఉంది. అందులో కొంతమంది గుంటూరు జిల్లాకు చెందిన అక్రమార్కులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆన్‌లైన్ చేయించుకొని పట్టాలు సృష్టించుకున్నారు. ఆ తర్వాత కొండభూమిలో దిగి చెట్లుకొట్టి మొక్కలు నాటారు. కొన్నిచోట్ల బోర్లు కూడా వేశారు. కొండభూమిని అక్రమంగా సాగు చేసుకుంటున్న వారిని చందలూరు గ్రామస్థులు అడ్డుకున్నారు. ఆ సమయంలో తమకు పట్టాలు ఉన్నాయని అక్రమార్కులు బుకాయించారు. చందలూరు గ్రామస్థులు కొండపోరంబోకు కబ్జా చేసి నకిలీ పట్టాలు సృష్టించుకున్న విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేశారు. అ అవినీతిపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించటంతో రెవెన్యూ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. రికార్డులు పరిశీలించి కొండభూమికి సంబంధించి ఎలాంటి పట్టాలు ఇచ్చినట్లు రికార్డులు లేవని ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. దీంతో జిల్లా అధికారులు కొద్ది రోజుల క్రితం ఆ పట్టాలను రద్దుచేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో చందలూరు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కొండపోరంబోకు భూమిలో వేసిన బోర్లు

లారీ, బైక్ ఢీ.. వ్యక్తి మృతి



గంగరాజు మృతదేహం

గిద్దలూరు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): లారీ, మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటన జరిగింది. అందిన సమాచారం మేరకు బుధవారం గిద్దలూరు మండలం దంతెరపల్లి సమీపంలో లారీ, బైకు ఎదురుగా వస్తూ ఢీకొనడంతో కడప జిల్లా కలసపాడు మండలం పుల్లారెడ్డిపల్లెకి చెందిన గంగరాజు (32) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి ఎద్దడిపై తప్పుడు నివేదిక

దోర్నాలలో నీటి కష్టాలు లేవంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ వివరణ
ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై క్షేత్రస్థాయిలో జిల్లా ఉన్నతాధికారుల పరిశీలన
అదే సమయంలో ఐనముక్కల బీసీ కాలనీవాసుల ధర్నా
తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆదేశం
తిమ్మాపురంలో అప్పటికప్పుడు కొత్త మోటార్ ఏర్పాటు



మండల అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు

పెద్ద దోర్నాల, మే 14 (ఆంధ్రజ్యోతి) : 'నీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలి.. వేసవి వచ్చినా ఎందుకు జాప్యం చేస్తున్నారు.. ప్రజలు ఇబ్బంది పడేంత దూరం ఎందుకు తీసుకొచ్చారు.. ఈరోజు వరకు బోరు నుంచి మోటారును బయటకు తీయలేదు.. ఏమి సమాధానం చెప్తారు.. పద్ధతి మార్చుకోండి' అంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు మండిపడ్డారు. 'దోర్నాలలో నీటి కష్టాలు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఈ నెల 12న కథనం ప్రచురితమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ భ్రమరాంబికాదేవి దోర్నాలలో ఎటువంటి తాగునీటి సమస్యలు లేవు, అన్నీ సక్రమంగానే ఉన్నాయి.. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం అవాస్తవమంటూ ఎంత నీరు కావాలి, ఎన్ని లీటర్లు ఇవ్వాలి, అవన్నీ ఇస్తున్నట్లు లెక్కలతో సహ నివేదికను రూపొందించి జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు నిజనిజాలను పరిశీలించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి ఎస్‌ఈ బాలశంకర్‌రావు, ఈఈ పొదిలి సురేష్, ఎర్రగొండపాలెం డీఈ శ్రీనివాస్ దోర్నాల వచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో ఎస్‌ఈ మాట్లాడుతూ నిధుల సమస్య లేదని, సాంకేతిక లోపాల వల్ల జాప్యం జరిగిందని, నిర్లక్ష్యం వహిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటి నుంచి సచివాలయం ఇంజనీరు శ్రీనుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఎస్‌ఈ తెలిపారు. అనంతరం తిమ్మాపురంలో బోరు బావిని పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు నీటి సమస్యను ఏకరువు పెట్టారు. ఇప్పటి నుంచి అలా జరగదని హామీ ఇచ్చారు.

సమస్యతో జనం గగ్గోలు పెడుతున్నా...

- దోర్నాల పంచాయతీలోని తిమ్మాపురం, ఐనముక్కల, దోర్నాల కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తింది. అధికారులు ఆ సమస్యలను పట్టించుకోకపోవడంతో ప్రజలు నీటి ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.
- తిమ్మాపురం బోరుబావుల్లో నీరు ఉంది. కాకపోతే మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతుంటాయి. వెంటనే బాగు చేయిస్తే సమస్య ఉండదు. వారం, పదిరోజుల వరకు పట్టించుకోకపోవడం వల్ల జనం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ఐనముక్కల బీసీ కాలనీలో చిన్న సమస్య కానీ పట్టించుకోవడం లేదని నివాసితులు వాపోతున్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లో మనుషులతో పాటు పశువులు, మూగజీవాలు ఉన్నాయి. వాటి దాహం తీర్చడానికి నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. ఆ మేరకు అందక మరింత కష్టాలు పడాల్సి వస్తోంది.

ఈ ప్రశ్నకు సమాధానం చెప్తారా?

ఆంధ్రజ్యోతిలో ఈ నెల 12న దోర్నాలలో నీటి కష్టాలు అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. అందుకు సంబంధిత అధికారిణి ప్రజలకు ఎక్కడా నీటి ఇబ్బందులు లేనేలేవని, ఆంధ్రజ్యోతిలో అవాస్తవం రాశారని ఓ నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. నిజనిజాలు తెలుసుకొనేందుకు బుధవారం మండలానికి ఉన్నతాధికారులు వచ్చిన సమయంలోనే మిట్టమధ్యాహ్నం ఐనముక్కల బీసీ కాలనీలో నీటి సమస్య పరిష్కరించాలని పంచాయతీ కార్యాలయం వద్ద తాగునీటిని అందించాలని ప్రజలు ఆందోళన చేశారు. దీనికేమి సమాధానం చెబుతారు.

"అన్నీ బాగున్నాయిని నివేదిక అందజేసిన మూడో రోజు కూడా తిమ్మాపురంలో బోరుబావిలో మోటారు బయటకు తీయలేదు. జిల్లా అధికారి వచ్చి మందలిస్తే కానీ మోటారు ఏర్పాటు చేయలేదు. మరి దీనికి సమాధానం ఉందా.. దోర్నాలలోని పలుప్రాంతాల్లో శివసదన్, మెయిన్‌రోడ్డు, ప్రభుత్వ వైద్యశాలకు నీళ్ల లేవు. ఇందుకు సమాధానం చెబుతారా.. సుందరయ్య కాలనీకి నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైపులైన్‌లో భాగంగా పక్కనే ఉన్న పశువైద్యశాలకు నీటి కుళాయి ఏర్పాటు చేయమంటే పలకలేదని" జడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగిలి పిచ్చయ్య ఆరోపించారు.

ప్రభుత్వ లక్ష్యానికి వ్యతిరేకంగా అధికారుల పనితీరు

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను వేగవంతం చేసింది. ప్రధానంగా నీటి వసతి కల్పనలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించింది. మేజర్ పంచాయతీ దోర్నాలలో పది వేలకు పైగా జనాభా ఉంది. నీటి వనరులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆ వనరులను సద్వినియోగం చేసుకుంటూనే అవసరమైన చోట ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని ప్రభుత్వం సంబంధిత శాఖలకు అప్పగించింది. కానీ అధికారులు ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులులేవని, ఏవో పిచ్చి లెక్కలేసి ఉన్నతాధికారులకు నివేదికవ్వడం గమనార్హం.

వ సం	నీటి వనరులు	మొత్తం	పనిచేయుచున్నవి	చెడిపోయినవి
1	PWS స్కీములు	1	1(30000)LITRES	1
2	MPWS స్కీములు	3	2(20000)litres	1
3	చేతి పంపులు	9	0	9
4	టీపీ బోర్లు	5	2(14640)litres	3

[illegible] SC COLONY (782 [illegible]) [illegible] 32000LITRES [illegible]

వ సం	మండలం	పంచాయతీ	గ్రామము	పాపులేషన్	ఒక్కొక్కరికి 40 లీటర్ల చొప్పున నీటి అవసరత	ప్రస్తుతం నీటి లభ్యత కి.లీ	నీటి అవసరత కి.లీ	కావలసిన ట్రిప్పుల సంఖ్య
1	దోర్నాల	దోర్నాల	ఐనముక్కల	3809	152360	112360	40000	10

వ సం	నీటి వనరులు	మొత్తం	పనిచేయుచున్నవి	చెడిపోయినవి
1	PWS స్కీములు	1	(0)LITRES	1
2	MPWS స్కీములు	2	2(30000)litres	0
3	చేతి పంపులు	14	0	14
4	టీపీ బోర్లు	6	4(82360)litres	2

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉన్నతాధికారులకు అందించిన తప్పుడు నివేదిక

ఐనముక్కల బీసీ కాలనీలో నీటి సమస్య పరిష్కరించాలి

పంచాయతీ కార్యాలయం వద్ద మహిళల ఆందోళన
అదే సమయంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారుల సమీక్ష

నీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని ఐనముక్కల గ్రామానికి చెందిన బీసీ కాలనీ మహిళలు బుధవారం రోడ్డెక్కారు. దోర్నాల పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. పది రోజులుగా నీళ్ల కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. తమ చుట్టూ ఉన్న వీధుల్లో నీరు పుష్కలంగా ఉంటే తమకు ఎందుకు నీళ్లివ్వరూ అంటూ గోడు వెళ్లబోసుకున్నారు. పిల్లా పాపలతో చాలా దూరం ఎండకు పోయి నీళ్ల తెచ్చుకోవాలసిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇదే సమయంలో అదే సమస్యపై ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు మండల అధికారులతో సమీక్ష నిర్వహిస్తుండడం గమనార్హం. ఎంపీడీవో నాసర్ రెడ్డి, కార్యదర్శి స్పందిస్తూ సాయంత్రానికల్లా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తో ఆందోళన విరమించారు.



ఐనముక్కల బీసీ కాలనీలో నీటి గోడు వెళ్ల బోస్తున్న మహిళలు

సీసీ కెమెరాలు పెట్టండి

నేరాల కట్టడికి సహకరించండి : సీఐ హాజరత్తయ్య

సింగరాయకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంట గ్రామాలైన సింగరాయకొండ, మూలగుంటపాడు గ్రామాల్లో ఆవకాశం ఉన్న ప్రతి ఒక్కరు తమ ఇంటికి సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని సీఐ చావా హాజరత్తయ్య కోరారు. 'సీసీ కెమెరాలు పెట్టండి.. నేరాలు అరికట్టడం మీ బాధ్యతగా వ్యవహరించండి' అనే నినాదంతో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించడానికి చైతన్య టెక్నో స్కూల్ సహకారంతో ముంద్రించిన కరపత్రాలను బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ హాజరత్తయ్య ఎస్సై మహేంద్రతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఇతర ప్రదేశాలకు వెళ్లే వారు ఇంట్లో నగదు, విలువైన బంగారు ఆభరణాలు ఉంటే బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు. పోలీస్ వారికి ముందస్తు సమాచారం ఇస్తే తాళం వేసిన ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని వెల్లడించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ హాజరత్తయ్య, ఎస్సై బి. మహేంద్ర

పాలిసెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు

ఒంగోలు విద్య, మే 14 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా విద్యార్థి చలువాది ఖదిరేష్ 120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 14వ ర్యాంకు సాధించారు. పాలిసెట్‌కు జిల్లా నుంచి 4600 మంది పరీక్షకు హాజరు కాగా 3951 మంది అర్హత సాధించారు. మొత్తం 83.67శాతం మంది ప్రవేశాలకు అర్హత సాధించారు రాష్ట్ర స్థాయిలో 87.67శాతం మంది మాత్రమే అర్హులయ్యారు. బాలురు 85.89శాతం మంది, బాలికలు 87.15శాతం మంది అర్హత సాధించారు. జిల్లాలో మార్కులు, ర్యాంకుల సాధనలో చలువాది ఖదిరేష్ ప్రథమ స్థానంలో నిలవగా బెల్లంకొండ వెంకట్ ద్వితీయ స్థానంలో, పీ తారారాజ్ మూడవ స్థానంలో నిలిచారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



బ్యాటింగ్ చేస్తూ ఉత్సాహపరుస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సీతారాంపురం వద్ద రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ముందుగా ఆయన బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. సీతారాంపురం యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. నిర్వాహకులు మణి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో నగదు బహుమతులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భాను, పోతినేని శ్రీనివాసరావు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, గట్టినేని అయ్యన్న, గోరంట్ల చిరంజీవి, మండవ వెంకటస్వామి, మన్నం కృష్ణ, నల్లూరి శ్రీనివాసరావు, రాయపాటి శ్రీనివాసరావు, వడ్డంపూడి శ్రీనివాసరావు, అడకా స్వాములు, ప్రభాకర్‌రెడ్డి, దుగ్గినేని నరసింహారావు, కొణిజేటి శివ, ముప్పా రవి, నందిగామ కోటయ్య, నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి

● డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు



అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం సాయంత్రం లైంగిక వేధింపుల అంచనా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కమిటీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పరిపాలన అధికారి గీతాంజలి, కనిగిరి డివిజన్ ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ సుజన, పెట్లూరు, గలిజరుగుళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు అనూష, డాక్టర్ లక్ష్మీజలేంద్రలను సభ్యులుగా నియమించారు. కమిటీ వ్యవహరించిన విధివిధానాలను లీగల్ అధికారి బి.రత్నప్రసాద్ వివరించారు. ఎక్కడైనా, ఎవరైనా వేధింపులకు గురైతే వారం రోజుల్లోగా ఆధారాలతో లిఖిత పూర్వకంగా కమిటీకి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంతో పాటు వారి పరిధిలో పనిచేసే మహిళా ఉద్యోగులు ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంట గ్రామాలైన సింగరాయకొండ, మూలగుంటపాడు గ్రామాల్లో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు తమ ఇంటికి సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని సీఐ చావా హజరత్తయ్య కోరారు. 'సీసీ కెమెరాలు పెట్టండి.. నేరాలు అరికట్టడం మీ బాధ్యతగా వ్యవహరించండి' అనే నినాదంతో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించడానికి చైతన్య టెక్నో స్కూల్ సహకారంతో ముద్రించిన కరపత్రాలను బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ హజరత్తయ్య ఎస్సై మహేంద్రతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఇతర ప్రదేశాలకు వెళ్లే వారు ఇంట్లో నగదు, విలువైన బంగారు ఆభరణాలు ఉంటే బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు. పోలీస్ వారికి ముందస్తు సమాచారం ఇస్తే తాళం వేసిన ఇళ్లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని వెల్లడించారు.

మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదని..

మామ గొంతు కోసిన మేనల్లుడు

● ఎన్‌ఎస్‌బీ టైలర్ పరిస్థితి ఆందోళన



తీవ్రంగా గాయపడిన షబ్బీర్

ఒంగోలుక్రైం, మే14(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని మామను గొంతు కోసాడు మేనల్లుడు. ఈ సంఘటన ఒంగోలు నగరం గాంధీరోడ్డులోని పూలకొట్ల సెంటర్‌లో బుధవారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక ప్రకాశంకాలనీలో నివాసం ఉంటున్న షేక్ షబ్బీర్ పూలకొట్ల సెంటర్‌లో ఎన్‌ఎస్‌బీ టైలరింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. అయనకు మేనల్లుడు షేక్ ఇంద్రీస్. ఈక్రమంలో మద్య తాగి వచ్చి డబ్బులు కావాలని షబ్బీర్‌ను అడిగాడు. రూ.500 ఇచ్చాడు. అయితే మరో రూ.500 కావాలని ఇంద్రీస్ అడగడంతో అందుకు మామ నిరాకరించాడు. దీంతో ఇంద్రీస్ గొడవపడ్డాడు. ఇద్దరి మధ్య కొద్ది సేపు వాదనలు జరిగాయి. అయితే డబ్బులు ఇవ్వలేదని ఆగ్రహం చెందిన ఇంద్రీస్ తనతో తెచ్చుకున్న కత్తితో షబ్బీర్ గొంతు కోసి పరారీ అయ్యాడు. దీంతో అయన గొంత వద్ద నరాలు తెగడంతో తీవ్ర రక్తస్రావం అయింది. స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. 70 ఏళ్ళ వయస్సు ఉన్న షబ్బీర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పమిడిపాడు మాజీ సర్పంచ్ మృతి

మేదరమెట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): పమిడిపాడు మాజీ సర్పంచ్ కేసరి వెంకటరెడ్డి(61) అనారోగ్యంతో గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు అనుచరుడుగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వెంకటరెడ్డి పమిడిపాడు సర్పంచ్‌గా, పమిడిపాడు సొసైటీ అధ్యక్షుడుగా రెండుసార్లు, పనిచేశారు. గ్రామ శివారు కృష్ణరాజువారిపాలెం(రెడ్డిపాలెం) చెందిన వెంకటరెడ్డి సర్పంచ్‌గా, సొసైటి అధ్యక్షుడుగా గ్రామంలో ప్రజలకు సేవలు అందించారు. ఆయనకు భార్య, ఒక కమారుడు ఉన్నారు.



ఆలయం వద్ద భక్తుల రద్దీ



ఆకట్టుకుంటున్న టీడీపీ విద్యుత్ ప్రభ

వైభవంగా కేవీపాలెం తిరునాళ్ల

శ్రీప్రసన్నాంజనేయస్వామికి భారీగా భక్తుల పూజలు

టీడీపీ, వైసీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



పూజలందుకుంటున్న మూలవిరాట్

చీమకుర్తి, మే14 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలంలోని కేవీ.పాలెంలో బుధవారం రాత్రి శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన తిరునాళ్లకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌ను దర్శించుకొని పూజలు జరిపారు. ఇక టీడీపీ, వైసీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వాటిపై టీవీ, సినీ కళాకారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక జనసేన, సీపీఎం ఆధ్వర్యంలో కళా వేదికలు ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పార్టీల ప్రభలపై నాయకులు పాల్గొని క్యాడర్‌ని ఉత్సాహపరిచారు. టీడీపీ ప్రభపై ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, నాయకులు, అలాగే వైసీపీ ప్రభపై జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ప్రసంగించారు.

తహసీల్దార్ వర్సెస్ టీడీపీ నాయకులు

● ఎమ్మెల్యే దామచర్ల ముందే వాగ్వాదం

● రెవెన్యూ అధికారులు తమ పనులు చేయటం లేదంటూ ధ్వజం

కొత్తపట్నం, మే 14(ఆంధ్రజ్యోతి): "తహసీల్దార్ వైసీపీ నాయకులకు మాత్రమే పనులు చేస్తున్నారు. వారికి మర్యాదలు చేసి పంపిస్తున్నారు. వీఆర్వోలు డబ్బులు ఇస్తే గాని పనిచేయటం లేదు. ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహం నిర్మించుకుందామన్నా పొజిషన్ సర్టిఫికెట్ కూడా ఇప్పించలేకపోతున్నాం" అంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ధ్వజమెత్తారు. టీడీపీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసేందుకు కొత్తపట్నం వచ్చిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముందు తెలుగు తమ్ముళ్ళు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. తెలుగు దేశం పార్టీ నాయకులకు ఏ పని చేయడం లేదని, వైసీపీ వారికి మాత్రం ఏ పని అయినా చకచకా చేసేస్తున్నారంటూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిత్రం ఒంగోలు అర్బన్‌కు బదిలీ అయిన తహసీల్దార్ మధుసూదనరావు ఈ సమావేశంలో ఉండగా ఆయన పనితీరుపై కూడా మండల టీడీపీ నాయకులు ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ రామచంద్రరావు గౌడ్ తహసీల్దార్ పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. దీతో ఇరువురి మధ్య ఎమ్మెల్యే సమక్షంలో వాగ్వాదం జరిగింది. 'నేను నీకేమి పని చేసి పెట్టలేదా' అని తహసీల్దార్ మధుసూదనరావు రామచంద్రగౌడ్‌ను ప్రశ్నించగా ఒకటి అర పనులు చేసి ప్రజల పనులన్నీ పెండింగ్‌లో పెట్టి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారంటూ గౌడ్ ఎదురుదాడికి దిగారు. వాదన పెరుగుతుండటంతో ఎమ్మెల్యే దామచర్ల కలగజేస్తున్నారు. రామచంద్ర గౌడ్‌ను సున్నితంగా మందలించారు. ఇతర గ్రామ, మండల స్థాయి నాయకులు కూడా రెవెన్యూ అధికారులు తీరుపై దామచర్ల సమక్షంలోనే ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ఎమ్మెల్యేకి విన్నవించారు. సమావేశంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీల ఎన్నికల కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవాలు





స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, తిలకిస్తున్న భక్తజనులు

● కొప్పోలు శ్రీచెన్నకేశవస్వామివారి కల్యాణం

ఒంగోలు(రూరల్), మే14(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ స్వామివారి కల్యాణం తిలకించిన భక్తుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని చెప్పారు. అనంతరం భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకుడు పరాకుశం సమీర్‌కుమార్, వేదపండితులు పరాకుశంచక్రవర్తిస్వామి, నారాయణం కళ్యాణచక్రవర్తి, వి.సుబ్రహ్మణ్యం, ధర్మకర్త శ్రీకొలను విజయరామిరెడ్డి, సువర్ణలత దంపతులు, ఈవో కట్టా సునీల్‌కుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులో వేంచేసిన వేణుగోపాలస్వామి వార్ల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. తరలివచ్చిన అశేష భక్త జనం సాక్షిగా దేవస్థానం వద్దనున్న కళ్యాణ వేదికపై శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి కల్యాణ క్రతువును వేదపండితులు, ఆలయ పూజారి దీవి శ్రీధర్‌బాబు వేదమంత్రోచ్ఛరణలతో జరిపించారు. ఉభయదాతలు మాగులూరి వంశీయులతో పాటు గ్రామానికి చెందిన పలువురు స్వామివార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం గ్రామానికి చెందిన తెలగ సంఘం ఆధ్వర్యంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్న ప్రత్యేక హోమం జరిపించి వేణుగోపాలస్వామి వార్ల రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకొంది. భక్తులు, యువతీ, యువకులు పోటీపడి స్వామి వారి రథాన్ని లాగేందుకు ఉత్సాహం చూపారు. అలాగే దేవాలయ ఈవో రామకృష్ణారావు, చైర్మన్ సత్యనారాయణ భక్తుల కోసం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఉప్పుగుండూరులో శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సేవా కార్యక్రమాల్లో మహిళలు ముందుండాలి

● ఘనంగా కమ్మ మహిళా ప్రతినిధుల సదస్సు



అరుణను సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

ఒంగోలు(కల్చరల్), మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కమ్మవారి సేవా సంఘం మహిళా ప్రతినిధుల ఆత్మీయ సదస్సు బుధవారం సాయంత్రం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా జరిగింది. సంఘ జిల్లా సలహాదారు మండవ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర కమ్మ సంఘ సేవా సమాఖ్య అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ కులస్తులు సంఘటితం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇతర కులాలకు సైతం సేవ చేసినప్పుడే సంఘానికి ఆదరణ లభిస్తుందని చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా సంఘం ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ఇందులో మహిళలు కీలకపాత్ర పోషించాలని ఆయన కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారగ్రహీత తేళ్ల అరుణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సహాయం చేస్తూ సొంత కుల అభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సేవా సంఘం జిల్లా మహిళాధ్యక్షురాలు వడ్డెంపూడి సుజాత మాట్లాడుతూ తాను గ్రామాల పర్యటన చేసే తరుణంలో అక్కడి మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల గురించి తెలుసుకున్నానని, మహిళలకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో కమ్మవారి సేవా సంఘం మహిళా విభాగం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘ కన్వీనర్ రఘుపతి, జిల్లా కార్యదర్శి ఆలా హనుమంతరావు, 1కే క్లబ్ చైర్మన్ వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

చీమకుర్తి విద్యార్థికి పాలిసెట్‌లో ప్రథమర్యాంకు



ఖదీరేశ్



ధన్విక

చీమకుర్తి, మే14(ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ఫలితాల్లో చీమకుర్తి విద్యార్థి 120కి 120 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. పట్టణానికి చెందిన చలువాది ఖదీరేశ్ ఏపీఆర్‌జేసీ కోచింగ్‌ను స్థానిక సూర్య ఇన్‌స్టిట్యూట్‌లో తీసుకున్నాడు. పదోతరగతి శ్రీచైతన్య స్కూలులో చదివాడు. అదేవిధంగా పట్టణానికి చెందిన కడవా ధన్విక రాష్ట్రస్థాయిలో 1420ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను బుధవారం సూర్యసంస్థ ఆర్గనైజర్ ఎంపీ.రుషి, ఎంఎస్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ.శివారెడ్డి, వెంకారెడ్డి, నాగార్జునరెడ్డి, గోపీకృష్ణారెడ్డి అభినందించారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బాలోత్సవం, ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. అనంతరం క్యాంపు కన్వీనర్ వినోద్ మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం, వికాసం పేరుతో పిల్లలు సృజనాత్మకత కలిగి ఉండాలనే లక్ష్యంతో గత మూడు సంవత్సరాలుగా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది రోజులపాటు జరిగిన శిబిరంలో బొమ్మలు వేయడం, క్రాఫ్టింగ్, ఫన్నీ ఇంగ్లీషు, గేమ్స్, సైన్స్ ప్రయోగాలు, కరాటే, మెమరీ టెక్నిక్, మ్యాజిక్, ప్రముఖల జీవితాలు పరిచయం వంటి కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను బహూకరించారు.

క్విస్ కళాశాల పీడీకి బెస్ట్ అవార్డు



పీడీ కోటేశ్వరరావుకు అవార్డును ప్రదానం చేస్తున్న యూనివర్సిటీ అధికారులు

ఒంగోలు విద్య, మే 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.కోటేశ్వరరావుకు యూనివర్సిటీ స్పోర్ట్స్‌డే పోటీల్లో జేఎన్‌టీయూ కాకినాడ బెస్ట్ ఫిజికల్ డైరెక్టర్ అవార్డును ప్రదానం చేసింది. వివిధ పోటీల్లో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దినందుకు ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ చాటిన ఎస్.మహేంద్ర, ఎస్‌కే.కరీముల్లా, పి.మణికంఠ, టి.భార్గవిలను సన్మానించారు. భార్గవికి రూ.20వేలు నగదు ప్రోత్సాహకాన్ని కూడా అందజేశారు. కాగా బెస్ట్ పీడీ అవార్డు సాధించిన కోటేశ్వరరావు, విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ శ్రీగాయత్రి, ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు అభినందించారు.

కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అబ్దుల్‌హఫీజ్, ఎంఎస్.రావు

ఒంగోలు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 2024-25 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ పదో తరతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో విజయభేరి మోగించారు. వందశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మార్కులు సాధించారు. 12వతరగతి సైన్స్ విభాగంలో సాహిల్ బాటి 94శాతం, యద్దనపూడి శ్రీకర్ 90.6, టి.భానుప్రసాద్ 89.6, హ్యూమనిటీస్ విభాగంలో ఎస్‌కే.సుహెల్ 91.6, పి.సుజిత్‌చంద్ర 89.4, జి.కౌశిక్ బాబు83.2శాతం సాధించారు. పదో తరగతిలో పి.పూర్ణశ్రీ 96.4, ఎస్‌కే.అర్షియాసుల్తానా 94.6, ఐ.మహిత 89.6శాతం మార్కులు సాధించారు. ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను బుధవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షేక్ అబ్దుల్‌హఫీజ్, ఎంఎస్.రావు అభినందించారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసవరప్రసాద్

మద్దిపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసవరప్రసాద్ కోరారు. బుధవారం మద్దిపాడులో జయరావు కళాబృందంచే హెచ్ఐవీ, క్షయ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు ఏఆర్టీ ద్వారా మందులు ఉచితంగా అందజేస్తుందన్నారు. కలుషిత సిరంజి, అక్రమ సంబంధాల ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని ఆయన చెప్పారు. గ్రో స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పీర్ బాష మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రజలలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అగ్నివీర్ మురళీనాయక్‌కు నివాళి

కంభం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్ ఓ గొప్ప ఆల్ రౌండర్ అని, ఆయనకు కెప్టెన్‌గా పని చేసిన 851 లైట్ రెజిమెంట్ సుబేదార్ పగడాల నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం కంభంలోని మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాపసభలో ఆయన మాట్లాడారు. అగ్నివీర్‌లో ఎంపికై శిక్షణ పొందిన మురళీనాయక్ తొలిపోస్టు అసోం రాష్ట్రంలోని మిస్సామారిలో 2022 ఆగస్టు 23న తన వద్ద జాయిన్ అయినట్లు చెప్పారు. అతడికి వాలీబాల్‌లో మంచి ప్రావీణ్యం ఉందని, తాను రెజిమెంట్‌లో చేరాక వాలీబాల్ విన్నర్‌గా తమ జట్టు గెలిచిందన్నారు. తన పరిధిలో 20 మంది సిపాయిలు ఉంటారని, అందులో మురళీనాయక్ ట్రేడ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో అందరి కంటే ముందుంటారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కావడానికి ముందు ఆ బెటాలియన్ కమాండర్‌కు వార్‌ఫేర్ గురించి తాను కొన్ని సూచనలు చేసినట్లు గుర్తు చేసుకున్నారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తే ఆపరేషన్ సిందూర్‌కు స్వచ్ఛందంగా సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటామన్నారు. సంఘ కార్యదర్శి పుల్లయ్య, ఉపాధ్యక్షుడు అంకయ్యగౌడ్, కెప్టెన్ రామయ్య, ప్రసాద్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధురాలి కంట్లో కారం చల్లి..

రూ.6.40లక్షల బంగారు ఆభరణాలు చోరీ

మార్కాపురం పట్టణంలో ఘటన

మార్కాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి కళ్లలో కారంకొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన బుధవారం మార్కాపురం పట్టణంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో రూ.6.40 లక్షల విలువగల 80 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు బండి రమణమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఇక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నా ఆమె ఒక్కతే జీవిస్తోంది. ఈ క్రమంలో బుధవారం వేకువజామున ఇద్దరు వ్యక్తులు రమణమ్మ ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె కళ్లల్లో తొలుత కారం కొట్టారు. అనంతరం ఆమె మెడలోని సరుడు, చేతికి ఉన్న నాలుగు బంగారు గాజులు లాక్కెళ్లారు. మొత్తం సుమారు 80 గ్రాముల మేర బంగారు ఆభరణాలు దొంగలు ఎత్తుకుపోయారు. దొంగలు పరారైన తర్వాత వృద్ధురాలు రమణమ్మ వెంటనే విషయాన్ని కుమారుడు చెన్నకేశవులుకు చెప్పారు. అతని ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఒంగోలు క్లూస్ టీంకు సమాచారం అందించారు. క్లూస్ టీమ్ సిబ్బంది ప్రాథమిక ఆధారాలను సేకరించారు. ఎస్సై సైదుబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రమణమ్మతో మాట్లాడుతున్న ఎస్సై సైదుబాబు

బాబోయ్ ఎండలు..!

- నిప్పుల కొలిమిగా మారిన కంభం సబ్ డివిజన్
- రెండు రోజులుగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత
- శీతల పానియాలకు గిరాకీ
- పెరిగిన కొబ్బరి బొండాలు, చెరకురసం విక్రయాలు

కంభం, మే 14 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో కంభం సబ్ డివిజన్ నిప్పుల కొలిమిలా మారింది. గత రెండు రోజుల నుంచి కంభంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో సూర్యప్రతాపాన్ని తట్టుకోలేక ఉదయం 11 గంటల నుంచి ప్రజలు ఇంటి గుమ్మం పడుతున్నారు. గతంలో మునుపెన్నడూ లేని విధంగా సూర్యప్రతాపం అధికం అవుతుండడంతో వీధుల్లో జనసంచారం కనిపించడం లేదు. మధ్యాహ్నానికి రోడ్లన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి. మరో పక్క ఎండకు తోడు కరెంట్ కోతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దారుణంగా ఉంది. విద్యుత్ కోతల కారణంగా ఇళ్లల్లో ఉండలేక బయటకు వచ్చి ఎండ ధాటికి తట్టుకోలేక ప్రజలు విలవిల లాడుతున్నారు. వేసవి తీవ్రత కారణంగా జ్వరాలు, వాంతుల బారిన పడుతూ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.


తాటి ముంజలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

జాగ్రత్తతోనే వడదెబ్బకు దూరం

జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బకు దూరంగా ఉండవచ్చు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటే బయటకు వెళ్లరాదు. అత్యవసరమైతే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లే వారు గొడుగులు, టోపీలు, తువాలు ఉపయోగించాలి. నీరసంగా ఉంటే ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం తాగాలి. శీతల పానియాలు తాగరాదు.

- డాక్టర్ ప్రియదర్శిని, కంభం వైద్యశాల సూపరింటెండెంట్

శీతల పానియాలకు డిమాండ్

వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో శీతల పానియాలకు డిమాండ్ పెరిగింది. సోడా, నిమ్మ రసం, చెరకు రసం, లస్సీ, తాటి ముంజులు, కొబ్బరి బొండాలకు గిరాకీ పెరిగింది. దీంతో ధరలు పెరిగాయి. ధర ఎలా ఉన్నా ఏదో ఒకటి తాగి సేద తీరాల్సిందేనని ప్రజలు విక్రయిస్తున్నారు. మినరల్ వాటర్ కొనుగోలు చేసే వారి సంఖ్య భారీగా పెరిగింది.


నిర్మానుషంగా ఉన్న కంభంలోని ప్రధాన రోడ్డు

తగ్గుతున్న పాడి దిగుబడి

కంభం సబ్ డివిజన్‌లోని కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల్లోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. ప్రజలు, పక్షాదులు మంచినీటికి కటకట లాడాల్సిన పరిస్థితి నెలకొన్నది. భూగర్భ జలాలు అడుగంటడంతో ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. వాడుక నీరు కూడా లేని పరిస్థితి ఉంది. పొలాల్లోని వ్యవసాయ బోర్లు వట్టిపోవడంతో నీటి ట్యాంకర్లపై ఆధార పడాల్సి వస్తున్నది. పశు గ్రాసానికి కొరత ఏర్పడి పాల దిగుబడి తగ్గిపోయింది.


రాచర్ల గేటులో వద్ద నిలిచిన వాహనదారులు

తరచూ గేటు మొరాయింపు

అటూ ఇటూ నిలిచిన వాహనాలు

గిద్దలూరు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల సెంటర్‌లోని రైల్వే గేటు తరచూ మొరాయిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. నిత్యం రైళ్ళు, గూడ్స్ అధిక సంఖ్యలో వెలుతుండడం, ఆ సమయంలో రైల్వేగేటు వేయడం తరచూ జరుగుతుంది. ఆ సమయాలలో రద్దీ తీవ్రంగా ట్రాఫిక్ స్తంభిస్తుంది. ట్రాఫిక్ స్తంభించిన సమయంలో దగ్గరలో ఉన్న నంద్యాల - ఒంగోలు జాతీయ రహదారి కూడా ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఇదిలావుండగా తాజాగా బుధవారం సాంకేతిక లోపంతో రైల్వే గేట్లు పనిచేయక పోవడంతో ట్రాఫిక్ అటూ ఇటూ చాలా దూరం నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉన్నారు. ఏదిఏమైనప్పటికీ ప్రజాప్రతినిధులు స్పందించి రాచర్ల రైల్వేగేటు సమస్యను పరిష్కరించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాశినాయనకు పూజలు

గిద్దలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భగవాన్ శ్రీకాశిరెడ్డి నాయన ఆశ్రమంలో కాశినాయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దాత పాలుగుళ్ల కాశిరెడ్డి దంపతులు, యోగా గురూజీ నారాయణరెడ్డి, దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయ కార్యదర్శి తనిఖీ


శిక్షణను పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి

గిద్దలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని తప్పకుండా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు. వేసవి శిక్షణ తరగతులను ఉపయోగించుకుని విజ్ఞానం పొందాలని, ఆటపాటల్లో శిక్షణ పొంది ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెద్దారవీడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జన్‌సుందరం బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

మురళీనాయక్ ఆల్‌రౌండర్

సుబేదార్ నాగేశ్వరరావు నివాళి

కంభం, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్ ఓ గొప్ప ఆల్ రౌండర్ అని ఆయనకు కెప్టెన్‌గా పని చేసిన 851 లైట్ రెజిమెంట్ సుబేదార్ పగడాల నాగేశ్వర్‌రావు తెలిపారు. కంభంలోని మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. అగ్నివీర్‌లో ఎంపికై శిక్షణ పొందిన మురళీనాయక్ తొలిపోస్టు అసోం రాష్ట్రంలోని మిస్సామారిలో 2022 ఆగస్టు 23న తన వద్ద జాయిన్ అయినట్లు చెప్పారు. అతడికి వాలీబాల్‌లో మంచి ప్రావీణ్యం ఉందని, తాను రెజిమెంట్‌లో చేరాక వాలీబాల్ విన్నర్‌గా తమ జట్టు గెలిచిందన్నారు. తన పరిధిలో 20 మంది సిపాయిలు ఉంటారని, అందులో మురళీ నాయక్ ట్రేడ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో అందరి కంటే ముందుంటారని తెలిపారు. మరికొన్ని గంటల్లో ఆపరేషన్ సిందూర్ ప్రారంభం కావడానికి ముందు ఆ బెటాలియన్ కమాండర్‌కు వార్‌ఫేరు గురించి తాను కొన్ని సూచనలు చేసినట్లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కంభం మాజీ సైనికులతోపాటు గిద్దలూరు వెడరన్ జేఏసీ సభ్యులు, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తే ఆపరేషన్ సిందూర్‌కు స్వచ్ఛందంగా సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటామన్నారు. సంఘ కార్యదర్శి పుల్లయ్య, ఉపాధ్యక్షుడు అంకయ్యగౌడ్, కెప్టెన్ రామయ్య, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, హరిప్రసాద్, నెమలిగుండం, శ్రీను, పులి శ్రీనివాసప్రసాద్, ఎస్.ఎఫ్‌భాషా, మస్తాన్, వీరనారి నంద్యాల వకులాదేవి పాల్గొన్నారు.

శివారు కాలనీల్లో కార్డెన్ సెర్చ్


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

మార్కాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివారు కాలనీల్లో టౌన్ పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ, హోంగార్డు కాలనీ, పోలేరమ్మ గుడి వెనుకాల ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఇంటింటి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలులేని సుమారు 20 వరకు వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా చోటు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆయా కాలనీల వాసులను హెచ్చరించారు. ఎవరైనా కొత్తగా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమాల్లో ఎస్సైలు ఎం.సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా .. యువకుడి మృతి

బొల్లాపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లటూరు కురవ సమీపంలో ముటుకూరు నుంచి ఇటుకల లోడుతో వస్తూ అదుపు తప్పి బోల్తా పడటంతో ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం తెల్లగట్లకు చెందిన మూరబోయిన అనంత రాములు(23) అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టించింది. పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఏ బాలకృష్ణ తెలిపారు.


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ, ఆర్టీసీ డీఎం

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఆటో డ్రైవర్లకు ఎంవీఐ మాధవరావు హెచ్చరిక

మార్కాపురం రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించి ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎంవీఐ మాధవరావు హెచ్చరించారు. మండల పరిధిలోని రాయవరం గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై ఆటోలను ఆర్టీసీ డిపో మేనేజర్ నరసింహులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్‌లను పలు సలహాలు సూచనలు తెలియజేశారు. రహదారులపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆటోలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆటోలలో డ్రైవర్ సీటు వద్ద ఇరుకుగా ప్రయాణికులను కూరోబెడితే డ్రైవింగ్‌కు ఇబ్బందిగా మారుతుందన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న ఆటోలను గుర్తించి రూ.30,500 జరిమానాలు విధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా సద్గుణరావు


ప్రిన్సిపాల్ సద్గుణరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

కొమరోలు, మే 14 (ఆంధ్రజ్యోతి) : కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా పీ సద్గుణరావు బుధవారం విధుల్లో చేరారు. సద్గుణరావు మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రమోషన్‌పై కొమరోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడి ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు ఉద్యోగవిరమణ చేయడంతో ఇక్కడున్న ప్రభాకర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా చేస్తున్నారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా విధుల్లో చేరిన సద్గుణను విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అందరి సఖ్యతతో మంచి ఫలితాలు సాధిస్తామని సద్గుణరావు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్

ఎర్రగొండపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడో పర్యాయం అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలను తెస్తుందన్నారు. సమావేశంలో రైతు సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు టీసీహెచ్ చెన్నయ్య, అధ్యక్ష, కార్యదర్శులు మన్నె సాంబశివరావు, బాణాల రామయ్య, సభ్యులు వెంకటేశ్వర్లు, తిరుపతయ్య పాల్గొన్నారు.

కనులపండువగా చెన్నకేశవుని కల్యాణం

ఒంగోలు(రూరల్), మే14(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ స్వామివారి కల్యాణం తిలకించిన భక్తుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉంటాయని చెప్పారు. అనతరం భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకుడు పరాకుశం సమీర్‌కుమార్, వేదపండితులు పరాకుశంచక్రవర్తిస్వామి, నారాయణం కల్యాణచక్రవర్తి, సుబ్రహ్మణ్యం, ధర్మకర్త శ్రీకొలను విజయరామిరెడ్డి, సువర్ణలత దంపతులు, ఈవో కట్టా సునీల్‌కుమార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గ్రాసం గోస

- మేత దొరక్క అల్లాడుతున్న పశువులు
- ఇబ్బంది పడుతున్న పోషకులు


గ్రాసం కోసం ఎండలో తిరుగుతున్న పశువులు

తర్లుపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పశువులకు గ్రాసం కోసం గోస పెడుతున్నాయి. మేత దొరక్క పశువులు అల్లాడుతున్నాయి. ప్రస్తుతం మండుటెండలు, వడగాల్పులతో పొలాల్లో ఎక్కడ కూడా గ్రాసం లేకపోవడంతో పశువులు గ్రాసం కోసం తిరుగుతూ తల్లడిల్లుతున్నాయి. కొన్ని పశువులు ఎండకు తట్టుకోలేక చెట్ల కింద పడుకుని తిరిగి ఇళ్లకు చేరుతున్నాయి. ప్రస్తుతం మంచి నీటి సమస్య కూడా ఏర్పడడంతో పొలాల్లో కూడా వాగులు, వంకల్లో చుక్కనీరు లేకపోవడంతో నీటికి అల్లాడుతున్నాయి. ఉదయం పొలానికి వెళ్లిన గేదెలు మధ్యాహ్నంలోపే ఎండకు తట్టుకోలేక ఇంటి బాట పడుతున్నాయి. రైతులు పశువులును పోషించలేక ఇబ్బందులకు గురవుతున్నారు. దూర ప్రాంతల నుంచి వరిగడ్డి ట్రాక్టర్ రూ.18,000 వెచ్చించి పశువలను బ్రతికించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పశువులను పోషించలేక తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. ఉపాధి పథకం ద్వారా పశువులకు నీటితొట్టెలు కట్టించి నీటిని కల్పించాలని అధికారుల ఆదేశాలున్నా కొన్ని గ్రామాల్లో తొట్టెలు నిర్మించినప్పటికీ కొన్ని గ్రామాల్లో నీరు నింపకపోవటంతో పశువులు నీటికి అల్లాడుతున్నాయి. ప్రభుత్వం పశుగ్రాసం, దానా సబ్సిడీ ద్వారా అందించి ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

జన్‌మన్ గృహాలను పరిశీలించిన ఎస్‌వో

ఎర్రగొండపాలెం రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి జన్ మన్ పథకం ద్వారా చేపట్టిన నివాసాలను వైపాలెం చెంచు క్లస్టర్ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. మండలంలోని తమ్మడపల్లి గ్రామంలోని చెంచు గిరిజనుల నిర్మాణాలను పరిశీలించి వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని అందుకు నిధులు వెంటనే మంజూరు అవుతున్నాయని అన్నారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకొని శాశ్వత నివాసంలోకి వెళ్లాలని అన్నారు. అనంతరం ఉపాధి పనులకు ప్రతి ఒక్కరూ పనికి వెళ్లాలన్నారు. జాబ్ కార్డులు లేవని కొందరు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వారి ఆధార్ కార్డులు తీసుకొని వారికి జాబ్ కార్డులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెండు రోజుల్లో కార్డులు వస్తాయని వచ్చిన వారందరూ పనులకు వెళ్లాలన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ శివరామిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ ఉన్నారు.


తమ్మడపల్లిలో చెంచు కుటుంబాలతో మాట్లాడుతున్న ఎస్‌వో నాగేశ్వరరావు


గ్రామోత్సవంలో స్వామివారికి మొక్కుతున్న భక్తులు

వైభవంగా వేణుగోపాలుని గ్రామోత్సవం

ఎర్రగొండపాలెం రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిల్లంపల్లి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం ఉదయం చంద్రవాహనం, రాత్రికి శేష వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. బొడ్డుపల్లి పవన్ కుమార్ శర్మ, ఆలయ అర్చకులు అన్నమరాజు రమేష్ బాబు శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలు మెరుగు కుటుంబ సభ్యులు సూరే రమారావు, కామేశ్వరి పాల్గొని పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న చెట్టు

గాలివానకు రోడ్డుపై కూలిన చెట్టు

వాహనదారులకు ఇక్కట్లు

ఎర్రగొండపాలెం రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమవారం రాత్రి వీచిన గాలులకు గడ్డమీద పల్లి గ్రామ సమీపంలో రోడ్డుకు ఆడ్డంగా వేప చెట్టు పడిపోయింది. దీంతో ఎర్రగొండపాలెం నుంచి గడ్డమీదపల్లి, వీరభద్రాపురం, వెంకటాద్రిపాలెం గ్రామానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఆడ్డంగా ఉండడంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాహనదారులు బుధవారం తెలిపారు. పంచాయతీ, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధురాలి కంట్లో కారంచల్లి బంగారు ఆభరణాల చోరీ

రూ.6.40లక్షల విలువైన వస్తువులు దోచుకెళ్లిన దొంగలు


వృద్ధురాలితో మాట్లాడి వివరాలను సేకరిస్తున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న ఓ వృద్ధురాలి కళ్లలో కారంకొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన బుధవారం మార్కాపురం పట్టణంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో రూ.6.40 లక్షల విలువగల 80 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు బండి రమణమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఇక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నా ఆమె ఒక్కతే జీవిస్తోంది. ఈ క్రమంలో బుధవారం వేకువజామున ఇద్దరు వ్యక్తులు రమణమ్మ ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె కళ్లల్లో తొలుత కారం కొట్టారు. అనంతరం ఆమె మెడలోని సరుడు, చేతికి ఉన్న నాలుగు బంగారు గాజులు లాక్కెళ్లారు. మొత్తం సుమారు 80 గ్రాముల మేర బంగారు ఆభరణాలు దొంగలు ఎత్తుకుపోయారు. దొంగలు పరారైన తర్వాత వృద్ధురాలు రమణమ్మ వెంటనే విషయాన్ని కుమారుడు చెన్నకేశవులుకు చెప్పారు. అతని ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అంతేకాక ఒంగోలు క్లూస్ టీంకు సమాచారం అందించారు. క్లూస్ టీమ్ సిబ్బంది ప్రాథమిక ఆధారాలను సేకరించారు. ఈ మేరకు టౌన్ ఎస్సై ఎమ్‌సైదుబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి జాన్సన్

బూత్‌లెవల్ ఏజెంట్ల నియామకాలకు ప్రతిపాదనలు ఇవ్వండి

దర్శి, మే 14(ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు బూత్‌లెవల్ ఏజంట్లను నియమించేందుకు ప్రతిపాదనలు వెంటనే అందించాలని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి ఎస్. జాన్సన్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓటర్ల రివిజన్‌పై నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజా ఓటర్ల జాబితా ప్రకారం దర్శి నియోజకవర్గంలో 2,26,231 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఓటర్ల జాబితాలను పరిశీలించుకొని అర్హత కల్గిన యువతీ, యువకులు ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కొత్త పోలింగ్ కేంద్రాలు అవసరమైన చోట ప్రతిపాదనలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దర్శి, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల తహసీల్దార్లు ఎం. శ్రావణ్‌కుమార్, జి. రజనీకుమారీ, ఎం. లక్ష్మీనారాయణ, కె సంజీవరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


రైతులకు పశువుల దాణాను అందజేస్తున్న ప్రభాకర్‌చౌదరి

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

పామూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొన్న కూటమి ప్రభుత్వం 50 శాతం రాయితీ కింద పశువుల దాణాను సరఫరా చేస్తుందని టీడీపీ విబిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి అన్నారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామ రైతు సేవ కేంద్రంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశుపోషకులకు బుధవారం రాయితీ పథకం కింద పశువుల దాణాను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, వెటర్నరీ, వ్యవసాయశాఖల అసిస్టెంట్ విజయదుర్గా, హరికృష్ణ, నాయకులు కోటపాటి రాజ, గూడూరు వెంకటాద్రి, పశుపోషకులు పాల్గొన్నారు.


పెదయిర్లపాడులో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ

గృహాలు త్వరగా నిర్మించుకోవాలి

పీసీపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం ద్వారా గృహాలు మంజూరు అయిన లబ్ధిదారులు వాటిని త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. మండలంలోని పెదయిర్లపాడులో నిర్మిస్తున్న ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణాలు చేపట్టకపోతే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి తీసుకున్న బిల్లులను తిరిగి చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. 3సంవత్సరాల క్రితం గృహాలు మంజూరైనా నేటికీ వాటిని పూర్తిచేయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎంత త్వరగా గృహాలను నిర్మించుకుంటే వెంటనే మిగిలిన బిల్లులను కూడా చెల్లిస్తామని ఆయన అన్నారు. అనంతరం స్థానిక సచివాలయాన్ని సందర్శించిన అక్కడ నిర్వహిస్తున్న ఆధార్‌కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనవెంట హౌసింగ్ ఏఈ ఫిరోజ్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి తదితరులు ఉన్నారు.


చలో విజయవాడకు తరలివెళుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

చలో విజయవాడకు వెళ్లిన నాయకులు

సీఎస్‌పురం(పామూరు) మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవో నెంబర్ 19 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేయ తల పెట్టిన 9 రకాల పాఠశాలల వ్యవస్థను ఉపసంహరించుకోవాలని, 1 నుంచి 5 తరగతులు హైస్కూల్‌కు అనుసంధానం చేసే విధానాన్ని విరమించుకోవాలని బుధవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ ధర్నాకు సీఎస్‌పురం మండలం నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరళివెళ్లారు. వీరిలో జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి. శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌లు ఉన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసుకోవాలి

మండలంలో బీజేపీని సంస్థాగతంగా బూత్ స్థాయి, శక్తి కేంద్ర స్థాయిలో పార్టీ నిర్మాణం చేపట్టి బలోపేతం చేసుకోవాలని జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు అన్నారు. స్థానిక అమ్మ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షుడు ఉమ్మడిశెట్టి శ్రీను అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. పీఎం మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నరాల శ్రీనివాసరెడ్డి, అమరసింహ, నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్యతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహం

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధికి బాటలు

దొనకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధి సాధించేలా టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. శిక్షణతో పాటు ఉపాధి కల్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని తలంచింది. మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ ఎంతో దోహదం చేస్తుందని భావించి వారికి కుట్టుమిషన్‌పై శిక్షణ అందించి కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచేలా చర్యలు చేపట్టింది. మహిళా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ పొందేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని గత నెల ప్రభుత్వం ప్రకటించింది. మండలంలో 137 మంది లక్ష్యంగా 18 నుంచి 50 సంవత్సరాల మహిళలు సంబంధిత సర్టిఫికెట్లతో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరగా లక్ష్యానికి మించి 230 మంది మహిళలు దరఖాస్తులు చేసుకున్నారు. వెనుకబడిన వర్గాల్లో ఈడబ్ల్యూఎస్ పరిధిలోని అర్హులైన బీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, కాపు, బ్రాహ్మణ వర్గాలకు చెందిన 140 మంది మహిళలను కుట్టు శిక్షణకు ఎంపిక చేశారు. వీరికి శిక్షణ అందించేందుకు ట్రైనర్స్‌గా ఎంపిక చేసిన పులిమి నాగమణి, షేక్ గౌసియాలు ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళలకు కుట్టు శిక్షణ అందిస్తున్నారు. వీరికి 90 రోజుల పాటు కుట్టు శిక్షణ అందించి, 75 శాతం హాజరున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ అందించేలా, భవిష్యత్తులో స్వయంశక్తి రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో గ్రామాల్లోని మహిళలు రానున్న రోజుల్లో తమ భవిష్యత్తుకు భరోసా లభిస్తుందనే ధీమాతో ఉత్సాహంగా కుట్టు శిక్షణ పొందుతున్నారు.


కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలు

‘ఉపాధి’ పనులు వేగవంతం చేయాలి

డ్వామా పీడీ జోసఫ్ కుమార్

ముండ్లమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించాలని డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని వసుపుగల్లు, పెద ఉల్లగల్లు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రూ.307కు తగ్గకుండా పని చేసుకోవాలన్నారు. ప్రధానంగా రైతాంగానికి ఉపయోగ పడే పనులు మాత్రమే చేయాలన్నారు. మండలానికి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకాల్లో చేర్పించి వారికి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఇన్సూరెన్స్ వర్తించే విధంగా చూడాలన్నారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పని చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. వేసవి కాలంలో ఉపాధి కూలీలు వడ దెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం ఉపాధి కూలీలు గత ఏడాదిలో చేసిన పనులకు ఇంత వరకు వేతనం రాలేదని అడగ్గా వెంటనే పీడీ సంబంధిత అధికారులను, సిబ్బందిని విచారణ చేపట్టి నివేదికను అందజేయాలన్నారు. ఈ ఏడాదిలో నాలుగు వారాలు బిల్లులు రాలేదని తెలపగా మరో పది రోజుల్లో కూలీల ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఆర్. లలిత కుమారి, ఎంపీడీవో పీ సునీత, ఏపీవో పీ వెంకటరావు, ఈసీ జీ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


పెద ఉల్లగల్లులో ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

పంటల వివరాలపై ప్రతి గ్రామంలో తనిఖీ

కేంద్ర గణాంకాధికారి శ్రీనివాసరావు

కనిగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంటల వివరాలను ప్రతి గ్రామంలో తనిఖీలు నిర్వహించనున్నట్లు కేంద్ర గణాంకాధికారి జేడీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దిరశవంచ గ్రామంలో బుధవారం పంటల విస్తీర్ణంపై కేంద్ర, రాష్ట్ర గణాంకాధికారుల ఉమ్మడి బృందం మండలంలో బుధవారం పర్యటించి తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిరశవంచ గ్రామాన్ని 4క్లస్టర్‌లుగా విభజించి ఒక్కో క్లస్టర్ నుంచి ఐదు సర్వే నెంబర్లను ఎంపిక చేసి ఆయా నంబర్లలో రైతులు ఏ పంటలు పండించారు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు ఏప పంటలు ఈ క్రాఫ్ ద్వారా నమోదు చేశారో పరిశీలించినట్లు తెలిపారు. పంటలు వేయని భూములు వాస్తవ స్థితిగతులతో పాటు ప్రతి ఏటా రబీ, ఖరీఫ్‌లో నమోదు మొత్తం విస్తీర్ణాన్ని, ఆ భూములలో రైతులు ఏ పంటలు వేశారో తనిఖీలు చేశామన్నారు. తనిఖీల్లో వెల్లడైన వాస్తవ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. గ్రామస్థాయి వ్యవసాయశాఖ సిబ్బంది నుంచి పంటల వివరాలపై ఆరా తీశారు. తనిఖీ బృందంలో ఎస్ఎస్‌వో వినోద్ తారసింగ్, రామకృష్ణ, రాష్ట్ర గణాంకాధికారులు జీవీ ప్రసాదరావు, సుధాకర్, రమణారెడ్డి, మండల వ్యవసాయాధికారులు జ్యోష్నా, వీఆర్‌వో ప్రసాద్‌రెడ్డి, వీఏఏలు రాజేష్, గ్రామ సర్వేయర్ ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.


దిరిశవంచ గ్రామంలో వ్యవసాయ భూములను పరిశీలిస్తున్న కేంద్ర గణాంకాధికారుల బృందం

కూలీలందరికీ పనులు కల్పించాలి

తాళ్లూరు, మే 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఉపాధి కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో డి.హనుమంతరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించటంలో వెనుకబడి ఉన్నదన్నారు. ఉపాధి పనులకు వచ్చే ప్రతి కూలీకి వేతనం రూ. 300 తగ్గకుండా పనికల్పించాలన్నారు. ఏపీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పనులు లేక ఇబ్బందులు పడుతున్న ఉపాధి కూలీలతో మాట్లాడి ఉపాధి పనులకు వెళ్లేలా క్షేత్రస్థాయిలో ఫీల్డ్‌అసిస్టెంట్లు చూడాలన్నారు. గ్రామాల్లో అసంపూర్ణంగా ఉన్న పశువుల షెడ్లను, పశువుల దాహార్తి తీర్చేందుకు మంజూరు చేసిన నీటి తొట్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీవో, టీఏలు,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

చెత్త సంపద కేంద్రాలతో గ్రామాల అభివృద్ధి

ఎంపీడీవో సునీత

ముండ్లమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలు సక్రమంగా నిర్వహించటం వల్ల వచ్చే ఆదాయాన్ని గ్రామ మౌలిక వసతులకు ఖర్చు చేస్తామని, తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో పీ సునీత అన్నారు. ఆమె బుధవారం మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామంలో డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది, సర్పంచ్‌తో మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న చెత్తా, చెదారం వ్యర్థ పదార్థాలను డంపింగ్ యార్డుల్లో పడ వేసి తడి, పొడి చెత్తను వేరు చేసి వచ్చే ఎరువును ఇతరులకు అమ్మటం వల్ల ఆదాయాన్ని గ్రామ మౌలిక వసతులు తీర్చేందుకు వినియోగిస్తారన్నారు. వీధులన్నీ శుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆర్. జనార్దన్, పంచాయతీ కార్యదర్శి జే రాజరాజేశ్వరి, సర్పంచ్ జనమాల నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుల ఎంపిక

దొనకొండ, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుల ఎంపికను టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ నేతృత్వంలో బుధవారం నిర్వహించారు. టీడీపీ తెల్లబాడు గ్రామపార్టీ అధ్యక్షుడిగా ఫణిదపు శ్రీనివాసరావు, కొచ్చెర్లకోట గ్రామ పార్టీ అధ్యక్షుడిగా తడికమళ్ల కోట వెంకటసుబ్బయ్య, ఇండ్లచెరువు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఫణిదపు సురేష్, చందవరం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా తొమ్మండ్రు నర్సింహారావుగుప్తా, మల్లంపేట గ్రామ పార్టీ అధ్యక్షుడిగా మూడమంచు పరిటయ్య, మంగినపూడి గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పరిమి గురవయ్య, రామాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా దుగ్గెంపూడి లక్ష్మీకోటయ్య, వెంకటాపురం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా వేమూరి శ్రీనివాసరావులను ఎంపిక చేశారు. ఈ ఎంపికలో టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

5 న మదనగోపాలుని బ్రహ్మోత్సవాలు

పామూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ మదన వేణుగోపాలస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు జూన్ 5 తేదీన జరప తలపెట్టినట్లు దేవస్థాన ఈవో నరసింహబాబు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఉభయ దాతలతో గురు, శుక్రవారాల్లో కులాల వారీగా దేవస్థాన ఆవరణలో సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన అర్చకులు నారాయణం సత్యబాబు, భక్తులు పాల్గొన్నారు.

కంభాలదిన్నె ఇన్‌చార్జి కార్యదర్శిగా హరినారాయణ

పామూరు మండలంలోని కంభాలదిన్నె గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఇండ్ల హరినారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వగ్గంపల్లి పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిగా ఉన్న హరినారాయణ మోపాడు, అయ్యన్నకోట పంచాయతీలతో పాటు ఇప్పుడు కంభాలదిన్నె పంచాయతీకి ఇన్‌చార్జిగా ఉన్నారు.

న్యాయవాది పట్టా రద్దు

దర్శి, మే 14(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణానికి చెందిన ఓ న్యాయవాది పట్టాను రద్దు చేస్తూ ఏపీ బార్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇచ్చింది. తప్పుడు సర్టిఫికెట్ల ద్వారా న్యాయవాది పట్టా తీసుకున్న 17 మందిపై వేటు వేసిన విషయం తెలిసిందే. అందులో దర్శికి చెందిన సీహెచ్ సిద్దయ్య అనే న్యాయవాది తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి పట్టా తీసుకున్నట్లు నిర్ధారించి న్యాయవాదుల జాబితాలో నుంచి తొలగించారు.

ప్రభుత్వ ఆదేశాలను పాటించాలి

తాళ్లూరు, మే 14(ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను తప్పక పాటించాలని ఎంఈవో జి.సుబ్బయ్య తెలిపారు. స్థానిక విద్యాశాఖా కార్యాలయంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన కరస్పాండెంట్స్ ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు సీఆర్‌పీ శ్రీనివాస్, ఎంఐ కిరణ్‌కుమార్, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు

మెగాజాబ్ మేళాకు విశేష స్పందన

- ఉద్యోగావకాశాలు పొందిన 90 మంది నిరుద్యోగులు

కనిగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఎం డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాలో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. ఈజాబ్‌మేళాలో 100 మంది నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూకు హాజరు కాగా, వారిలో 90 మందికి ఉద్యోగావకాశాలు దక్కాయి. రిఫ్రిజిరేటర్స్, ఏసీ, ఇతర ప్రొడెక్ట్‌ను మార్కెట్‌లో అమ్ముతూ వినియోగదారుల నుంచి విశేష ఆదరణ పొందుతున్న ప్రముఖ బ్లూస్టార్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి యువతీ, యువకులను ఉద్యోగావకాశాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలు పొందిన నిరుద్యోగులను ఎంఎస్ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ప్రిన్సిపాల్ ఆర్‌వీరెడ్డిలు అభినందించారు. ప్రభుత్వం, ప్రయివేటు కంపెనీలు నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు పొంది ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.


ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు సైడ్ అద్దాలు

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

- త్రుటిలో తప్పిన ప్రమాదం

తాళ్లూరు, మే14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివరాంపురం నుంచి వెళ్లే మార్గంలో గల మలుపు వద్ద మొక్కజొన్న లోడ్‌తో వెళుతున్న లారీ, ఆర్‌టీసీ బస్సులు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరుగక పోవటంతో ఊపిరిపీల్చుకున్నారు.ఈఘటన బుధవారం జరిగింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో తాళ్లూరు నుంచి మొక్కజొన్న లోడ్‌తో లారీ వెల్లంపల్లి వైపు వెళుతుండగా అదే సమయంలో ఒంగోలు నుంచి తాళ్లూరు వస్తున్న ఆర్‌టీసీ బస్సు మలుపు వద్దకు చేరుకున్నాయి. లోడ్‌తో ఉన్న లారీ డ్రైవర్ మలుపు వద్ద రోడ్డు మధ్యలోకి వచ్చి, ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును గమనించక పోవటంతో ఢీకొన్నాయి. ఆర్‌టీసీ బస్సు డ్రైవర్ సీట్ వెనుక వైపు కిటికీల కింది భాగంలో గట్టిగా తగలటంతో నాలుగు కిటికీ అద్దాలు, రైలింగ్, బస్సు బాడీ పూర్తిగా దెబ్బతింది. బస్సులో ప్రయాణికులు తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పింది. బస్సులో వస్తున్న కొర్రపాటివారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ ప్రమాదవిషయాన్ని తెలపటంతో స్థానిక ఎంపీపీ తాటికొండ శ్రీను హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఆర్‌టీసీడ్రైవర్ ప్రమాద ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

శునక విలాపం

- 20 రోజులుగా గదిలోనే ఉన్న వీధి కుక్క
- ఎట్టకేలకు అరుపులు విని బయటకు తీసిన స్కూల్ వాచ్‌మెన్


ముండ్లమూరు జడ్పీ హైస్కూల్‌లో ఒక గదిలో ఉన్న శునకం

ముండ్లమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముండ్లమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక వీధి కుక్క 20 రోజులుగా గదిలో ఉండిపోయింది. పాఠశాల గత నెల 24వ తేదీ మూసి వేయటంతో అదే సమయంలో కుక్కను గమనించక లోపల పెట్టి తాళాలు వేశారు. అప్పటి నుంచి కుక్క బయటకు వచ్చే మార్గం లేక గదిలోనే ఉండిపోయింది. పాఠశాలకు సెలవులు కావటంతో ఆ వైపు వెళ్లేవారు లేరు. దీంతో కుక్క రోజూ అరుస్తున్నాఎవరూ గమనించ లేదు. బుధవారం పాఠశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. తమ్మలూరు గ్రామానికి చెందిన కాసా అంజిరెడ్డి, మరి కొంత మంది కుక్క అరుపులు విన్నారు. బయట గదికి తాళాలు వేసి ఉండటం, కుక్క అరుపులు వినపటంతో ఒక్కసారిగా గది వద్దకు వెళ్లి చూడగా లోపల కుక్క ఉంది. దీంతో గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బేతపూడి లింగారావుకు సమాచారం అందించగా వెంటనే వాచ్‌మెన్‌ను పాఠశాలకు పంపించారు. తాళాలు తీయగా శునకం బయటకు వచ్చింది. బతుకు దేవుడా అంటూ వెళ్లి పోయింది. 20 రోజులుగా నీరు, ఆహారం లేక పోవటంతో కుక్క ఒక్కసారిగా సమీపంలోని కొళాయి వద్దకు వెళ్లి కడుపు నిండా నీరు తాగింది.

ఈదరలో పిచ్చికుక్క స్వైర విహారం

- 15 మందిని కరిచిన వైనం

ముండ్లమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదర గ్రామంలో మంగళ, బుధవారాల్లో ఒక పిచ్చి కుక్క వీధుల్లో స్వైర విహారం చేసింది. ఇళ్ల ముందు ఆడుకుంటున్న 15 మందిని కరిచింది. గ్రామానికి చెందిన పాడె లలిత, నలబోతుల వెంకట రమణ, కాసా ఆదిత్య, చలువాది కిరణ్, ఖరీదు దీక్షిత, కాల్వ ప్రషుద్ద, అడపాల నారమ్మ, మేడిశెట్టి వెంకాయమ్మ, నాగమల్లి రమాదేవిలను కరిచింది. వీరితో పాటు మరి కొంత మంది చిన్నారులను కూడా పిచ్చికుక్క కాటు వేసింది. గాయపడిన వారందరినీ వారి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వినుకొండ, అద్దంకి, మారెళ్ల ఆస్పత్రులకు వెళ్లి ఇంజక్షన్‌లు చేయించారు. స్వైర విహారం చేసిన పిచ్చి కుక్కను గ్రామస్థులు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో చంపి వేశారు. దీంతో ఒక్కసారిగా పలు వీధుల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఏవో

తాళ్లూరు, మే 14(ఆంధ్రజ్యోతి) : కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలో నాగంబొట్లపాలెం సొసైటీ పరిధిలోని బొద్దికూరపాడులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ఇప్పటివరకు 85 మంది రైతులకు చెందిన 75.15 మెట్రిక్ టన్నులు రూ. 50 లక్షల విలువైన కందులను ప్రభుత్వ మద్దతుధరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కందులు పండించిన రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి అమ్ముకుని లబ్ధిపొందాలన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్గించారు.

ఉష్ణోగ్రత (అంచనా)

15-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	38	26
తెనాలి	38	27
నరసరావుపేట	39	27
బాపట్ల	38	28
రెంటచింతల	39	28
చీరాల	38	28



నిల్వ ఉంచిన పొగాకు బేళ్లు

బర్లీ మంటలు

- పొగాకు గిట్టుబాటు ధరపై ఆశలు ఆవిరి
- సమీక్షలకే పరిమితమవుతున్న పాలకులు
- పత్తాలేని కంపెనీలు.. ప్రభుత్వ ఆదేశాల బేఖాతరు

బర్లీ పొగాకు దిగుబడులు మొదలై రెండు నెలలు కావొస్తోంది. అప్పటి నుంచి పంట కు సరైన ధరలేక రైతులు తమ గోడు ప్రభుత్వానికి వెళ్లబోసుకుంటూనే ఉన్నారు. కనీస స్థాయిలో కూడా ధర పలకడం లేద ని వ్యాపారులు రకరకాల కొర్రీలతో మరీ తీసికట్టుగా అడుగుతున్నారని, ప్రభుత్వం తమ సమస్యపై దృష్టి పెట్టాలని పాలకులను అభ్యర్థిస్తూనే ఉన్నారు. రైతుల గోడును ఆలకించిన ప్రభుత్వం తాడేపల్లి వేదిక గా బర్లీ పొగాకు కొనుగోళ్లపై అటు అధికా రులతో ఇటు కంపెనీలతో సమీక్ష నిర్వ హించింది. కొనుగోళ్లను రోజు వారీ పర్యవేక్షించడానికి నలుగురు అధి కారులతో ఈ నెల 1 నుంచి గుంటూరు లోని పొగాకు బోర్డు కార్యాలయంలో కాల్ సెంటర్ సైతం ఏర్పాటు చేసింది. దీనికి కొనసాగింపుగా వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ కూడా క్షేత్ర స్థాయిలో పొగాకు రైతుల వెతల ను పరిశీలించడానికి పర్యూరు బాట పట్టారు. ఇదంతా కూడా పొగాకు రైతుల సమస్యల పరిష్కారం కోసం రెండు వారాల వ్యవధిలో ప్రభుత్వం వైపు నుంచి వచ్చిన కదలిక.

మూడు జిల్లాల పరిధిలో 96,000 వేల ఎకరాల వరకు..

గడచిన రెండేళ్ల బర్లీ పొగాకు సాగు రైతాంగానికి కొద్దిపాటి లాభాలను తెచ్చిపెట్టింది. దీంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున రైతాంగం దాని వైపు మళ్లింది. సంప్రదాయ సాగు అయిన మిర్చి, పత్తిని కాదని కూడా రైతులు బర్లీ బాట పట్టారు. బర్లీసాగు బాపట్ల జిల్లాలో 70,000 ఎకరాలు ఉండగా ఇది రాష్ట్రంలోనే అత్యధికంగా నిలిచింది. సాగు మొత్తం పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలోనే ఉంది. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో మరో 26,000 ఎకరాల వరకు సాగైంది. దిగుబడులు మొదలై దాదాపు రెండు నెలలు కావొస్తోంది. ఇప్పటికీ దాదాపు 60,000 ఎకరాల్లో పంట రైతుల వద్దనే ఉంది. గతేడాది క్వింటా పొగాకు ధర గరిష్టంగా రూ.16,000 వరకు పలికింది. దిగుబడి ఎకరాకు 15 క్వింటాల వరకు రావడంతో రైతులు ఒడ్డున పడ్డారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. రెండు వా రాల క్రితం వరకు కనీసం 8 నుంచి రూ.9,000 వరకు కొనే వ్యాపారులైన గ్రామాల్లో కనబడేవారని ప్రస్తుతం ఆ ధరకు కూడా అడిగే నాథుడు కనబడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాపట్ల, మే 14, (ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు కొనుగోళ్ళపై ప్రభుత్వం అత్యం త ప్రాధాన్య అంశంగా తీసుకుని రివ్యూ లు జరిపినా, పొగాకు కంపెనీలను కొనుగోళ్ల కోసం దాదాపుగా హెచ్చరించి నా రైతులకు దక్కిన ప్రయోజనం గుండుసున్నా. రెండు వారాల క్రితం వరకు ధర దిగదిడుపుగా అడిగే వ్యాపారులు అయినా వచ్చేవారని, ఇప్పుడు కనీసం పొగాకును అడిగే నాథుడే కరువయ్యారని రైతాంగం కన్నీరు మున్నీరవుతోంది. ప్రభుత్వం సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్న దశలోనే ఓ కౌలు రైతు ఆత్మహత్య చేసుకుని తీవ్రతను తెలియజేశారు. ఈ ఘటన జరిగి వారం రోజులు గడవక ముందే ఇంకొల్లు మండలానికి చెందిన మరో రైతు బలవన్మరణానికి ప్రయత్నించగా సకాలంలో స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇదే పరిస్థితి కొనసాగితే తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం కనబడడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధర విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే తప్ప పొగాకు కంపెనీలు మొద్దు నిద్ర వీడవని రైతాంగం వాపోతోంది.

సమీక్షలకే పరిమితమైన ప్రభుత్వం..

సమస్య తీవ్రతను గుర్తించిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విషయాన్ని వ్యవసాయశాఖ దృష్టికి నెల రోజుల క్రితమే తీసుకెళ్లారు. అధికారులు, కంపెనీలు, రైతు సంఘాలనాయకులను ఒకే వేదికమీదకు తీసుకొచ్చి రైతులకు ఏ విధంగా చేస్తే మేలు జరుగుతుందనే అంశంపై కసరత్తు చేశారు. దీని ఫలితమే గుంటూరులో కాల్ సెంటర్ ఏర్పాటు చేయడం కానీ, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి క్షేత్రస్థాయి పర్యటనకు రావడం కానీ జరిగింది. కానీ ప్రభుత్వం వైపు నుంచి కంపెనీలకు కొనుగోళ్లపై ఆదేశాలు ఇవ్వడం తోనే సరిపెట్టారు తప్పితే వాటి అమలుపై పర్యవేక్షణే కరువయింది. గుంటూరులో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ అలంకార ప్రాయమే తప్ప దాని వల్ల రైతులకు జరిగిన లబ్ధి ఏంటంటే అధికారులు వద్దే సమాధానం లేకపోవడం గమనార్హం బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల అందరి పరిస్థితి దాదాపుగా ఉరి కొయ్యకు వేలాడుతున్నట్లే ఉంది. ప్రభుత్వమే స్వయంగా రంగంలోకి (మిగతా 8వ పేజీలో)

- మార్గం మధ్యలోనే మొరాయిస్తున్న వాహనాలు
- అత్యవసర సేవలకు ఆటంకాలు
- ఎక్కడా ప్రాణాపాయం లేకున్నా... ఎప్పుడు... ఎక్కడ ఆగేనో! ఆ దేవుడికే ఎరుక
- గత ప్రభుత్వ పాలనలో నిర్వహణ లోపాలు
- కొత్త వాహనాలు మంజూరు చేయకుంటే ప్రాణాలకు నో గ్యారెంటీ

108కి.. సుస్తీ

మనలో ఎవరైనా ప్రమాదానికి గురైతేనో!, లేక ఏదైనా అనారోగ్య సమస్య ఏర్పడితేనో వెంటనే గుర్తొచ్చేది 108 వాహనం. అయితే మన ప్రాణాలు అత్యవసర సమయాల్లో కాపాడే ఆ 108కే కష్టమొస్తే? ప్రతి క్షణం విరామం లేకుండా పరుగులు పెట్టాల్సిన వాహనం మధ్యలో సుస్తీ చేసి ఆగిపోతే? ఏ అర్థరాత్రి సమయం లోనో మనలో ఎవరైనా అత్యవసర చికిత్స అవసరమై 108 వాహనంలో వెలుతున్నప్పుడు వ్యాన్ ముందుకు వెళ్ల కుండా మొరాయిస్తే? తలచుకుంటేనే వెన్నులో వణుకు పుడుతుంది కదూ!. ఒక్కసారిగా ప్రాణం పోయినంత భయం కలుగుతుంది కదూ!... అవును. ప్రస్తుతం అత్యసర సమయంలో సంజీవనిలా పరుగులుపెట్టే 108 వాహనాలకు నిర్వహణా లోపం సమస్యగా మారింది.



వేమూరు మార్కెట్ యార్డు దగ్గర టైర్ మార్చాల్సి రావటంతో మరో 108 వాహనం నుంచి టైర్ తీసి మార్చుకునే స్థితి

తెనాలి, మే 14, (ఆంధ్రజ్యోతి): చాలాచోట్ల 108 పాత వాహనాలకు గత ప్రభుత్వ కాలంలో పైపై మెరుగులుదిద్ది రోడ్డుమీదకు వదిలేయటంతో అవి ముందుకు వెళ్లనంటూ మొరాయిస్తున్నాయి. చిలకలూరిపేట హైవేపై గుంటూరు వెంగళాయపాలెం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి 1.40 గంటల సమయంలో ఒక 108 వాహనాన్ని మరో 108 వాహనం లాక్కెళుతూ కనిపించింది. ఒక రోగిని అత్యవసర వైద్యసేవ కోసం తీసుకెళుతున్న సమయంలో మొరాయించటంతో మరో వాహనం ఆగమేఘాలమీద వచ్చి దానిని లాక్కెళ్లిందనేది సమాచారం. అయితే రోగికి మాత్రం ప్రాణాపాయం ఏమీ జరగకపోవటం ఊపిరి పీల్చుకునే విషయం. మంగళవారం సాయంత్రం వేమూరు మార్కెట్ యార్డ్ 108 వాహనం టైర్లు దెబ్బతింటే మరో వాహనం వచ్చి, దాని టైర్‌ను తీసి ఆగిన వాహనానికి అమర్చి ముందుకు కదిలించారు. ఇలా అనేక ఉదాహరణలు ఈ మధ్య కాలంలో కనిపిస్తూనే ఉన్నాయి. దీనంతటికీ కారణం... వాహనాల నిర్వహణ సరిగా లేకపోవటం, గత ప్రభుత్వ కాలంలో వీటిని సరిగా పట్టించుకోకపోగా, విజయవాడ, తాడేపల్లి మెకానిక్ షెడ్‌లలో పైపై మెరుగులద్ది యధావిధిగా వెనక్కు పంపేయటంతో కష్టాలు తప్పటంలేదు. పాతవాటి నిర్వహణ తీరు ఇట్లాఉంటే... ఎప్పుడో రోడ్డెక్కిన పాత వాహనాల స్థానంలో కొత్తవి మంజూరు చేయకపోవటం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ఒకే వాహనం అందుబాటులో ఉంచటంతో అవి విరామం లేకుండా తిరగాల్సి రావటం అవి మొరాయించటానికి కారణమవుతోంది.



నిర్వహణ సరిగాలేక మధ్యలోనే ఆగిపోయిన 108 వాహనం

కూత కూయలేక.. ముందుకు కదల లేక..

108 వాహనం అంటే పైన వెలిగే లైట్లు, కుయ్... కుయ్ మంటూ కూత వేసుకుంటూ అత్యవసర సేవలను గుర్తుచేస్తూ పరుగులుపెట్టే వాహనాలే గుర్తొస్తాయి. అయితే ఇప్పుడు చాలా వాహనాలు కూత (మిగతా 8వ పేజీలో)

అనుకున్నట్లే.. నెగ్గిన అవిశ్వాసం

- కౌన్సిలర్ల విశ్వాసం కోల్పోయిన చీరాల మున్సిపల్ చైర్మన్
- అవిశ్వాసానికి ముందు హైడ్రామా..
- రాజీనామా సమర్పించిన జంజనం
- 26 ఓట్లతో నెగ్గిన అవిశ్వాసం.. 8 మంది కౌన్సిలర్లు ఓటింగ్‌కు దూరం

(బాపట్ల, చీరాల - ఆంధ్రజ్యోతి)

అనుకున్నదే జరిగింది. చీరాల మున్సిపల్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఓటింగ్‌లో చైర్మన్ జంజనం శ్రీనివాసరావుకు వ్యతిరేకంగా 26 మంది చేతులెత్తారు. మున్సిపాలిటీలో 33 మంది కౌన్సిలర్లు ఉండగా ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య ఓటింగ్‌లో పాల్గొనడంతో 26 ఓట్ల తేడాతో అవిశ్వాసం నెగ్గింది. ఓటింగ్ జరిగితే ఓటమి ఖాయమని అవిశ్వాసానికి పావుగంట ముందు జంజనం రాజీనామా డ్రామాకు తెరతీశారు. అయితే అప్పటికే ఓటింగ్‌లో పాల్గొనేందుకు కౌన్సిలర్లు అంతా లోపలికి వెళ్లడం, అధికారులూ అక్కడే ఉండడంతో రాజీనామా అంశాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశం లేకుండా పోయింది. యథావిధిగా ఓటింగ్ జరిపి అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. మొత్తం 25 మంది కౌన్సిలర్లు ఓటింగ్‌లో పాల్గొనగా ఇందులో మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గానికి చెందిన ఐదుగురితో పాటు టీడీపీకి చెందిన 20 మంది కౌన్సిలర్లు ఉన్నారు.



కౌన్సిలర్లతో కలిసి విజయ సంకేతం చూపుతున్న ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్

ముందే రాజీనామా చేసి ఉంటే..

చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని వారం క్రితమే ఎమ్మెల్యే కొండయ్య జంజనాన్ని కోరారు. కానీ అవిశ్వాసం వీగిపోతుందని, కౌన్సిలర్ల మద్దతు తనకే ఉంటుందని రాజీనామాకు ఆయన ససేమిరా అన్నారు. ఎటువైపు నుంచి సహకారం దక్కకపోవడంతో దింపుడు కళ్లెం ఆశలుగా వైసీపీ పెద్దల ద్వారా కూడా కౌన్సిలర్లతో రాయబారాలను జరిపారు. కానీ సమీకరణాలన్నీ తనకు ప్రతికూలంగా ఉన్నాయన్న నిర్ణయానికి వచ్చిన జంజనం రాజీనామా పల్లవిని ఆలస్యంగా ఎత్తుకున్నా అది కూడా విఫలమైంది.

అన్ని ప్రయత్నాలూ చేసి..

ఓ దశలో అవిశ్వాసం వీగేలా చేయడానికి జంజనం తరపున వైసీపీ పెద్దలు రంగంలోకి దిగి బేరసారాల అంకానికి తెరలేపారు. కానీ కౌన్సిలర్లు చైర్మన్‌ను గద్దెదించాలనే పట్టు దలతో ఉండడంతో పా టు ఎమ్మెల్యే కొండయ్య వ్యూహాత్మక అడుగులు కలిసి రావడంతో ఆ ప్రయత్నాలు బెడిసికొట్టాయి. జంజనాన్ని తప్పిం చాల్సిందేనని గతంలోనే ఓ నిర్ణయానికి వచ్చి, ఎమ్మెల్యే కొండయ్య నుంచి హామీ తీసుకునే 19 మంది కౌన్సిలర్లు టీడీపీ బాట పట్టారు. ఈ క్రమంలో జంజనం శ్రీనివాసరావు కూడా టీడీపీ కండువా కప్పుకోవడంతో కౌన్సిలర్లు కినుకు వ హించారు. పార్టీ మారినా జంజనంపై అవిశ్వాసం జరిగి తీరుతుందని ఎమ్మెల్యే వారికి భరోసా ఇవ్వడం, ఓటింగ్ జరగడం పార్టీ మారినా జంజనం మాజీ అవడం జరి గింది.

మున్సిపాలిటీ టీడీపీ ఖాతాలోకి..

అవిశ్వాసం నెగ్గడంతో చీరాల మున్సిపాలిటీని టీడీపీ చేజిక్కించు కు న్నట్లైంది. చైర్మన్ ఎన్నికపై కలెక్టర్ వెంకటమురళి అనుమతితో త్వరలోనే ఓ తేదీని ఖరారు చేయను న్నారు. పార్టీ మారడం ద్వారా పదవికి ఢోకా లేకుండా చేసుకుందామనుకున్న జంజనం ఆశలు నెరవేరకపోగా రాజమార్గంలోనే చైర్మన్ స్థానాన్ని టీడీపీ తన ఖాతాలో వేసుకోనుంది. ముగ్గురు కౌన్సిలర్లు చైర్మన్ పీఠంపై కన్నేయగా ఎమ్మెల్యే కొండయ్య ఆశీస్సులు ఉన్న వారినే పదవి వరించనుంది. జంజనం సామాజిక వర్గానికి అవకాశం దక్కితే గోలి స్వాతి, దాసరి శారదల్లో ఒకరి అదృష్టం వరిస్తుంది. అలాకాకుండా ఇతర సామాజిక వర్గాలకు అవకాశం టీడీపీ అధిష్ఠానం బావిస్తే మించాల సాంబశివరావు, పొత్తూరి సుబ్బయ్య, సూరగాని లక్ష్మీ రేసులో ఉన్నారు. ఇదిలా ఉంటే వైస్‌చైర్మన్ బొనిగల జైసన్ బాబును కూడా అవిశ్వాసంలో దింపేశారు. ఈ క్రమంలో ఆ స్థానం అదే సామాజిక వర్గానికి కేటా యించాల్సి వస్తే సల్లూరి సత్యానందం, మల్లెల లలిత రాజశేఖర్ రేసులో ఉన్నారు. కానీ వైస్ చైర్మన్ పదవిపై గోలి జగదీష్ ఆశగా ఉన్నట్లు, ఆ హామీతోనే బుధవారం జరిగిన అవిశ్వాసం సమావేశంలో చేతులెత్తిన ట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు ఎవ్వరికీ కూడా ఎమ్మెల్యే కొండయ్య ఎటువంటి హామీ ఇవ్వలేదని ఇటీవల క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో తేటతెల్లమైంది.

మహా పూజలు ప్రారంభం

శింగరకొండలో 19న కుంభాభిషేకం

అద్దంకి, మే 14 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మహాకుంభాభిషేక పూజలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ పూజల్లో ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు, రిషిత దంపతులు, విమాన గోపుర నిర్మాణదాత ఒంగోలు రూరల్ మండలం కరవదికి చెందిన టెక్‌బుల్స్ సాఫ్ట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత నలమలపు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు, దేవస్థాన ముఖమండపానికి గ్రానైట్ దాత, ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ కోట శ్రీనివాస కుమార్, నాగలక్ష్మి దంపతులు, ముఖమండప నిర్మాణ దాతలు శింగరాయకొండ మండలం చినకనుమళ్లకు చెందిన గుంజి కృష్ణారావు, రమాదేవి దంపతులు, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య దంపతులు, జీవ ధ్వజస్తంభం దాత పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, కుటుంబసభ్యులు, విశ్రాంత అడిషనల్ డీజీ గోపినాథ్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. 18వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించను న్నారు. 19న ఉదయం 9.03 గంటలకు శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి.



ప్రారంభ పూజల్లో పాల్గొనేందుకు వెళుతున్న దాతలు, అధికారులు

17న వేమూరులో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

వేమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో ఈ సారి వేమూరులో నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 17న శనివారం కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలనకు రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి బుధవారం వేమూరులో పర్యటించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ, మానవ హారం తదితర కార్యక్రమాల నిర్వహణ నిమిత్తంగా కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన అంశాలపై మండల అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వేమూరులో జరిగే కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు పాల్గొంటారన్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభించి అదే ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ఎన్టీఆర్ పురవేదిక వద్దకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని బీట్ ద హీట్ అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్డీవో వెంట డీపీవో ప్రభాకరరావు, ఎంపీడీవో శివన్నారాయణ, తహసీల్దార్ సుశీల తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

జిల్లా ఎలక్ట్రిసిటీ కమిటీ చైర్మన్‌గా ఎంపీ తెన్నేటి

బాపట్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎలక్ట్రిసిటీకమిటీ చైర్మన్‌గా లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్, సెక్రటరీగా కలెక్టర్ జె.వెంకటమురళి, సభ్యులుగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, జడ్పీచైర్‌పర్సన్‌లు ఉంటారు. కన్వీనర్‌గా ఎస్ ఈ ఉంటారు. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై కేంద్రప్రభుత్వం అమలు చేసే ఎలక్ట్రిసిటీకి సంబంధించిన పథకాలు గురించి సమీక్షిస్తుందని ఎంపీ కృష్ణప్రసాద్ తెలిపారు. జిల్లాలో డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ పనితీరు, నిర్వాహణ, పవర్ సప్లై నాణ్యత, పవర్ డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై చర్చించి అధికారులకు సూచనలు, సలహాలు చేస్తామన్నారు.

వసతిగృహ విద్యార్థుల అభినందన సభలో కలెక్టర్

ఉన్నత లక్ష్యాలతోనే భవిష్యత్‌కు బాటలు

బాపట్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత లక్ష్యాలతో భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి విద్యార్థులకు సూచించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులను బుధవారం కలెక్టర్ ప్రశంసించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో వారికి అవార్డులు, పతకాలు ప్రదానం చేశారు. ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులు ఆణిముత్యాలుగా ఎదిగారని ప్రశంసించారు. రేపల్లె ప్రభుత్వ కళాశాల వసతిగృహంలో వసతి పొందుతూ 973 మార్కులు సాధించిన సి.హెచ్. బసవయ్యకు రూ.15 వేల నగదు బహుమతిని కలెక్టర్ అందజేసి సత్కరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఇంటర్‌లో 90శాతానికి పైగా, పదిలో 85 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. చీరాల ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలోని ఆరు వసతిగృహాలలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన సహాయ ఎస్సీ సంక్షేమాధికారి చిన్నసైదారెడ్డిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్సీ సాధికారితాధికారి రాజాదెబోరా, పర్యవేక్షకులు ఎ.శ్రీనివాసులు, ఏఎస్‌డబ్ల్యూవోలు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

నేడు అమ్మనబ్రోలుకు లోకేష్



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

నాగులుప్పలపాడు, మే 14 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన వీరయ్యచౌదరి కుటుంబాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గురువారం పరామర్శించనున్నారు. అందుకోసం వీరయ్య స్వగ్రామమైన అమ్మన బ్రోలుకు వస్తున్నారు. ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ చేరుకుని అక్కడి నుంచి అమ్మనబ్రోలుకు వెళ్తారు.

హెలిప్యాడ్‌ను పరిశీలించిన ఎస్పీ

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గురువారం అమ్మన బ్రోలు రానున్న నేపథ్యంలో చదలవాడలోని సాయివిష్ణు విల్లాస్‌లోని హెలిప్యాడ్‌ను బుధవారం ఎస్పీ ఎఆర్ దామోదర్ పరిశీలించారు. అక్కడి నుంచి అమ్మనబ్రోలుకు చేరుకునే మార్గంలో ట్రయల్‌రన్ నిర్వహించారు. మంత్రి లోకేష్ ప్రయాణించే మార్గంతోపాటు అమ్మనబ్రోలులోనూ పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అమ్మనబ్రోలులో గ్రామస్థులతో సమావేశం నిర్వహించిన ఎస్పీ దామోదర్ అందరూ సమన్వయం పాటించాలని సూచించారు. కేసు దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందన్నారు. గ్రామంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనసేన నాయకులు కంది రవిశంకర్, అడ్మిన్ ఏఎస్పీ ఎం.నాగేశ్వరరావు, ఏఆర్ అడ్మిన్ ఏఎస్పీ కె.అశోక్‌కుమార్, రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం పీడీ పోస్టులను కేటాయించాలి

మార్టూరు, మే14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉన్నత పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులు,ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను కేటాయించాలని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చింతల సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అదేవిధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులను స్కూల్ అసిస్టెంట్లు అందరికీ ఖాళీలు చూపి బదిలీలో కోరుకునేటట్లు చేయాలన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల వలన పేద విద్యార్థులు డ్రాప్ అవుట్స్‌గా మిగిలే అవకాశం ఉందన్నారు. అన్ని పాఠశాలల్లో రెండో పోస్టును కేటాయించాలన్నారు. అంతేగాకుండా మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు.

మెగా డీఎస్సీ దరఖాస్తుకు నేడు తుది గడువు

ఒంగోలు విద్య, మే 14(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ దరఖాస్తు గడువు గురువారంతో ముగియనుంది. మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు గురువారం సాయంత్రంలోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఈనెల 20 నుంచి అభ్యర్థులకు ఆన్‌లైన్ మాక్ టెస్టులు అందుబాటులో ఉంటాయి. 30 నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఆధిపత్య పోరుతోనే హత్య



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, బ్యాగ్, సెల్‌ఫోన్లు



నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ దామోదర్

వీరయ్యచౌదరి హతమార్చేందుకు నాలుగు నెలల ముందు నుంచే ప్లాన్

పెద్ద మొత్తంలో సుపారీ, అడ్వాన్స్‌గా రూ.20లక్షలు

- సూత్రధారి సిద్ధాంతి, ప్రధాన పాత్రధారి వినోద్
- తొమ్మిది మంది అరెస్టు
- పరారీలో సురేష్‌తోపాటు మరో ఇద్దరు

ఒంగోలు క్రైం, మే14 (ఆంధ్రజ్యోతి): ఆధిపత్య పోరులో భాగంగానే తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరిని అత్యంత దారుణంగా మట్టుబెట్టారు. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన వీరయ్యచౌదరి టీడీపీలో చురుకైన నేత. అదే సమయంలో లిక్కర్‌తోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఉంటాడు. గ్రామంలో వీరయ్యచౌదరితోనే తిరిగి మనస్పర్థల కారణంగా మరో గ్రూపుగా ఏర్పడిన కొందరు వ్యక్తులు కిరాయి హంతకులతో వీరయ్యచౌదరిని గతనెల 22 రాత్రి ఒంగోలులోని పద్మ టవర్స్ సమీపంలో ఆయన కార్యాలయంలోనే దారుణంగా హత్య చేయించారు. అందుకు సంబంధించి 12 మందిని నిందితులుగా గుర్తించి తొమ్మిది మందిని అరెస్టు చేశామని, ఇంకా ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. ఈ మేరకు ఎస్పీ ఏఆర్.దామోదర్ బుధవారం తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుల వద్ద ఏడు మొబైల్ ఫోన్లు, మూడు కత్తులు, నల్ల బ్యాగ్, స్కూటీ, మోటర్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు... ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు బుధవారం దక్షిణ బైపాస్ రోడ్డులో గల కార్గిల్ పెట్రోల్ బంకు వద్ద కొంతమంది నిందితులను, ముక్తినూతలపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద మరి కొంతమందిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.

పంచాయతీ ఎన్నికలు నాంది

నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులో 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వీరయ్యచౌదరికి వ్యతిరేకంగా సర్పంచ్ అభ్యర్థిని నిలబెట్టి ఆళ్ల సాంబయ్య నేతృత్వంలో రూ.1.80కోట్లు వసూలు చేసి ఖర్చుపెట్టి గెలిపించుకున్నారు. అందుకు సాంబయ్య మేనల్లుడు ముప్పా సురేష్ కూడా సహకారం అందించాడు. అదేసమయంలో వీరయ్యచౌదరికి వ్యతిరేకులు అంతా ఒక తాటి మీదకు వచ్చారు. అప్పటి నుంచి వడ్డీ వ్యాపారం చేసే సాంబయ్య వద్ద అప్పు తీసుకున్న వారు తిరిగి చెల్లించకుండా చేస్తున్నాడని వీరయ్యపై కక్ష పెంచుకున్నాడు. అదే సమయంలో ఇసుక వ్యాపారం చేసుకుంటున్న వినోద్‌కు సంబంధించిన ఇసుక లారీలను అధికారులకు పట్టించి వ్యాపారానికి అడ్డు వస్తున్నాడని, తమ ఆర్థిక మూలాలు దెబ్బతీస్తున్నాడని వీరయ్యచౌదరిపై వినోద్ కూడా పగ పెంచుకున్నాడు. ఇలా వరుసగా జరుగుతున్న పరిణామాలతో వీరయ్యచౌదరి బతికి ఉంటే తమ పెత్తనం సాగదని, అంతేకాకుండా తన మేనల్లుడు సురేష్ రాజకీయ భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకమే అని భావించారు. దీంతో సాంబయ్య, వినోద్‌లు కలిసి వీరయ్యచౌదరిని హత్య చేయడానికి పథకం రూపొందించారు. పెద్దమొత్తంలో నగదు ఇస్తానని వినోద్‌కు చెప్పి రూ.20లక్షలు అడ్వాన్స్‌గా సాంబయ్య ఇచ్చాడు. అయితే కిరాయి హంతకులకు మాత్రం వినోద్ రూ.40 వేలు మాత్రమే ఖర్చులకు ఇచ్చి హత్య చేయించాడు.

హత్య చేసింది ఇలా...

గత జనవరి నుంచే వీరయ్యచౌదరి హత్యకు పథకం రూపొందించిన వినోద్.. ఒకసారి హైదరాబాద్‌కు చెందిన కిరాయి ముఠాను ఒంగోలు తీసుకొచ్చాడు. అయితే వారు ఒంగోలు వచ్చి ఇక్కడ వీరయ్య గురించి తెలుసుకొని ఆయన టీడీపీలో పేరు ఉన్న నాయకుడని గుర్తించి హత్య చేసేందుకు అంగీకరిచకుండా వెళ్లిపోయారు. అనంతరం వినోద్‌పై సాంబయ్య వత్తిడి పెంచాడు. ఎందుకు జాప్యం జరుగుతుందని నిలదీయడంతో వినోద్ నెల్లూరులో తన స్నేహితుడైన గోళ్ల రుత్వేంద్ర బాబు అలియాస్ నానిని సంప్రదించాడు. అక్కడి నుంచి నెల్లూరుకు చెందిన కిరాయి హంతకుడు నాగరాజుతో మాట్లాడి వారు ఇరువురు కలిసి ఒంగోలు వచ్చి కొద్దిరోజులు ఒక లాడ్జిలో మకాం వేసి వీరయ్యచౌదరి హత్యకు వినోద్‌తో కలిసి పథకం రూపొందించారు. జనవరి నుంచి మూడు నెలల పాటు పలు దఫాలు వారు ఒంగోలు వచ్చి వెళ్లారు. గతనెల 20న నెల్లూరు నుంచి నాగరాజు, వంశీకృష్ణ, వెంకట్ గౌతం, మన్నెం తేజ అలియాస్ బన్నీలు ఒంగోలు వచ్చి ఓ హాస్టల్ మకాం వేశారు. అయితే వీరయ్య చౌదరి హైదరాబాద్ వెళ్లినట్లు తెలుసుకున్నారు. అనంతరం 21న ఒంగోలు రాగా ఆయనపై నిఘా పెట్టారు. ఎప్పటికప్పుడు తోట శ్రీనివాసరావు ద్వారా వీరయ్యచౌదరి కదలికలను తెలుసుకుంటున్నారు. 22వ తేదీ సాయంత్రం 7 గంటల తర్వాత వీరయ్య తన కార్యాలయానికి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ముందుగానే హత్య చేసేందుకు వారు వెంట తెచ్చుకున్న కత్తులను బ్యాగ్‌లో పెట్టుకొని స్కూటీపై ఇద్దరు, మోటర్ సైకిల్‌పై ఇద్దరు కిరాయి హంతకులు వీరయ్యచౌదరి కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఉన్న సిబ్బందిని బెదిరించి వీరయ్యని నాగరాజు, వెంకటగౌతం అత్యంత కిరాతకంగా 50 కత్తిపోట్లు పొడిచారు. ఆ సమయంలో వంశీ చేతికి కూడా కత్తిగాటు పడి గాయమైంది. అయితే ఇదంతా రెండు నిమిషాలలో జరిగింది. వీరయ్యచౌదరి మృతిచెందాడని తేల్చుకుని నలుగురు అక్కడి నుంచి పరారయ్యారు.

పోలీసుల అదుపులో నిందితులు వీరే..

నిందితుల్లో ప్రధాన పాత్రధారి కొప్పోలు రోడ్డులోని డ్రీమ్స్ స్కూలు సమీపంలో నివాసం ఉండే ఇసుక వ్యాపారి బోరుగుంట వినోద్, కిరాయి హంతకులు నెల్లూరు ఏసయ్య కాలనీకి చెందిన తువ్వర వంశీకృష్ణ అలియాస్ జల్సా కృష్ణ, నెల్లూరులోని భక్తవత్సలనగర్ కృష్ణమందిరం ఎదురుగా నివాసం ఉండే బెల్లంకొండ వెంకటగౌతం, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంనకు చెందిన మన్నెం తేజలతో పాటుగా వినోద్ బావ అయిన హైదరాబాద్‌లో ఉంటున్న ఒంగోలు బాలాజీనగర్ వాసి మార్టూరి కిరణ్‌కుమార్, చీమకుర్తి నివాసి ప్రస్తుతం ఒంగోలు బలరామ్‌కాలనీలో ఉంటున్న వినోద్ అసిస్టెంట్ షేక్ సమీర్, హత్య కేసులో సూత్రధారిగా ఉన్న అమ్మనబ్రోలుకు చెందిన ఆళ్ల సాంబయ్య, దేవేంద్రనాథ్ చౌదరి, నాగులుప్పలపాడు మండలం దాసరివారిపాలెంనకు చెందిన తోటా శ్రీనివాసరావులను పోలీసులు అరెస్టు చేశారు. అమ్మనబ్రోలుకు చెందిన పారిశ్రామికవేత్త ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ముప్పా సురేష్, కిరాయి హంతకుడు నెల్లూరుకు చెందిన ఓబిలి నాగరాజు, నెల్లూరుకు చెందిన గోళ్ల రుత్వేంద్రబాబు అలియాస్ నానిలు పరారీలో ఉన్నారు. ఇంకా ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుందని, అనుమానితులను విచారించామని, ఇంకా దర్యాప్తులో భాగంగా మరికొంతమందిని విచారిస్తామని పోలీసులు తెలిపారు.

సురేష్‌కు వినోద్‌తో పరిచయం

ఇసుక వ్యాపారంలో నష్టపోయి ఉన్న వినోద్ అప్పటికే వీరయ్యచౌదరిపై పగ పెంచుకున్నాడు. అదేసమయంలో పురుగుమందులు వ్యాపారం చేసే తోట శ్రీనివాసరావు ద్వారా వినోద్‌తో సాంబయ్యకు పరిచయం ఏర్పడింది. దీంతో సురేష్‌కు హైదరాబాద్‌లో ఉన్న కొన్ని ఇళ్లకు సంబంధించిన వివాదాలను పరిష్కరించేందుకు వినోద్‌ని తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో చెన్నైలో సురేష్‌కు రూ.9కోట్లు బకాయి ఉన్న రఘురామ్ దగ్గర డబ్బులు వసూలు చేసేందుకు సాంబయ్య. వినోద్‌ను ప్రయోగించాడు. నెల్లూరు నుంచి కొంతమంది రౌడీషీటర్లను వెంట తీసుకెళ్లి వినోద్ రఘురామ్‌ను బెదిరించారు. దీంతో వినోద్‌పై సాంబయ్యకు నమ్మకం పెరిగి వీరయ్యచౌదరి హత్యకు డీల్ కుదుర్చుకున్నారు.

- **పోలీసులను అభినందించిన ఎస్పీ**

వీరయ్యచౌదరి హత్య కేసును వేగంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు పాండురంగారావు, సుధాకరరావు, సుబ్బారావు, సుర్యనారాయణ, జగదీష్, సుబ్బారావు, శ్రీకాంత్‌బాబుతోపాటు ఎస్ఐలను ఎస్పీ అభినందిచారు.

మున్సిపాలిటీగా దర్శి

- నగర పంచాయతీ నుంచి అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు



దర్శి నగర పంచాయతీ కార్యాలయం

దర్శి, మే 14(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పలుసార్లు ప్రభుత్వాన్ని కోరారు. పురపాలకశాఖ మంత్రి పి.నారాయణను కలిసి పూర్తి వివరాలతో నివేదికను అందజేశారు. మున్సిపాల్టీ చేయాలని దర్శి నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించి పంపించింది. దర్శి నగర పంచాయతీని మున్సిపాలిటీగా చేసేందుకు అన్నీ అర్హతలు ఉండటంతో ప్రభుత్వం మున్సిపాలిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నూతన మున్సిపాలిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు అందే అవకాశం ఉంది. దర్శి పట్టణం మరింత అభివృద్ధి చెందే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దర్శిని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పురపాలక శాఖ మంతి పి. నారాయణ, టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

- మల్లవరంనకు భారీగా తరలివచ్చిన భక్తులు
- స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోగుని గుండ్లకమ్మ ప్రాజెక్టు చెంత ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉభయ దేవేరులతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు కల్యాణ క్రతువు నిర్వహించారు. శ్రీవారి కల్యాణం తిలకించేందుకు దాదాపు 25 వేల మంది భక్తులు తరలిరావడంతో ఆలయ అధికారులు అందకనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రవికుమార్, కొండూరి శ్రీనివాస్ అయ్యంగార్, దివి వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ఈవో దామా నాగేశ్వరరావు ఎమ్మెల్యేకు శాస్త్రోక్తంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉభయ దాతలుగా మహాలక్ష్మమ్మ, ఎర్రరెడ్డి దంపతులు, పల్లకి సుబ్బరామిరెడ్డి మనువలు వ్యవహరించారు. ఇక సంపత్‌కుమార్, గాలి రాఘవవరప్రసాద్, అద్దంకి శ్రీరామచంద్రమూర్తి, అద్దంకి మురళీకృష్ణ, వింజనంపాటి సారథి ఆలపించిన నారాయణ తీర్థ తరంగాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. మల్లవరం అన్నదాన కమిటీ నిర్వాహకులు నారిపెద్ది వరహాలుచౌదరి, శ్రీవారి వనం కమిటీ సభ్యులు మార్నేని కృష్ణారావు, కావూరి వాసుబాబు, మార్నేని సుబ్బారావు, మార్నేని రాఘవరావు, మన్నం శ్రీనివాస్, తేళ్ల వెంకటసుబ్బారావు, చెరుకూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా బ్రాహ్మణ సేవా సంఘం, ఆర్యవైశ్య సంఘం, ఇతర పలు సంఘాల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబుతో పాటు పలువురు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం పురస్కరించుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు పర్యవేక్షణలో నాగులుప్పలపాడు, మద్దిపాడు, ఎస్ఎన్ పాడు, చీమకుర్తి పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. మద్దిపాడు పీహెచ్‌సీ వైద్యులు ఆలయం వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. ఇక వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మెరుగ నాగార్జున స్వామివారిని దర్శించుకుని పూజలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యుడు వాకా కోటిరెడ్డి, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు, ఎంపీటీసీ ఫైనం ప్రభాకర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అమ్మవారి మంగళసూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం



స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

108కి.. సుస్తి

(5వ పేజీ తరువాయి)

కూయలేకపోతున్నాయి. లైట్లు వెలగనంటున్నాయి. ఇంతవరకు పనిచేయకున్నా, కనీసం రోగిని సకాలంలో ఆసుపత్రికైనా తీసుకెళతాయా..! అంటే అదీ నమ్మకంలేదంటున్నాయి... ప్రస్తుతం ఉన్న పాత 108 వాహనాల తీరు. ఈ మధ్య కాలంలో చాలాచోట్ల ఈ వాహనాలు మొరాయిస్తూ కనిపిస్తూనే ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతి మండలానికి ఒక 108 వాహనం ఏర్పాటు చేశారు. కొన్నిటికి మండల కేంద్రాల్లో నిలిపే వసతి, సిబ్బంది వేచిఉండేందుకు ఏర్పాట్లు లేక చాలాచోట్ల నియోజకవర్గ కేంద్రాల్లో ఉండిపోతున్నాయి. గుంటూరు జిల్లాలో 18 మండలాలకు గాను 18 వాహనాలు, బాపట్ల జిల్లాలో 25, పల్నాడు జిల్లాలో 28 మండలాలకు 28 వాహనాలు కలిపితే, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 71 వాహనాలున్నాయి. అయితే వీటిలో చాలావరకు 2 నుంచి 2.5 లక్షల కిలోమీటర్లు ఇప్పటికే తిరిగేసినవి ఉంటే, మరికొన్ని అంతకు మించి తిరిగినవీ ఉన్నాయి. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటుచెయ్యాల్సి ఉన్నా, గత ప్రభుత్వం భారీగా మార్పులు చేస్తున్నామంటూ 2020లో 146 వాహనాలను, తర్వాత మరికొన్నిటిని రాష్ట్రంలో కొనుగోలు చేసింది. అయితే వీటిలో మన జిల్లాకు పెద్దగా దక్కినవి లేవు. పైగా పాతవాటికి పెద్దగా మరమ్మతులు చేయించిందీ లేదు.

కొత్తగా... అదనంగా అవసరం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 71 మండలాలుంటే, వాటికి ఒక్కొక్క మండలానికి ఒక 108 వాహనం ఉంది. అయితే వీటిలో 40 శాతం వాహనాలు సాధ్యమైనంత త్వరగా మార్చి కొత్తవాటిని ఏర్పాటుచెయ్యాల్సి ఉంది. మరికొన్నిటిని పూర్తిస్థాయి మరమ్మతులు చేయించాల్సిఉన్నాయి. కొన్నిటికైతే టైర్లు అరిగిపోయి, పంక్చర్‌లు పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటే, మరికొన్ని 104 వాహనాలదీ అదే పరిస్థితి. టైర్లు పాడయిపోయి, కొత్తవాటికోసం ఎదురు చూస్తున్నాయి. ఇదిట్లాఉంటే... రాజధాని ప్రాంతం కావటం, అవసరాలు పెరగటం, జాతీయ రహదారులపై ప్రమాదాల సంఖ్య పెరిగిపోతుండటంతో అదనపు వాహనాల అవసరం కూడా ఉంది. గుంటూరు నగరంలో ఈస్ట్, వెస్ట్ మండలాలకు రెండే ఉన్నాయి. నగరం పెద్దదే అయినా మరో రెండు వాహనాల అవసరం ఉన్నా, ఈ రెండిటితోనే చాలాకాలంగా నెట్టుకొస్తున్నారు. కొత్త జిల్లాలు ఏర్పడ్డాక పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో, బాపట్లలో ఒక్కొక్క వాహనం సరిపోకపోగా, అవీ పాతవి కావడంతో తిప్పలు తప్పడంలేదు. వీటికి అత్యవసర మెరుగైన వైద్య సేవలు అవసరమైతే గుంటూరు సమగ్ర వైద్యశాలకు రావలసిందే. ఈ నేపథ్యంలో ఆయా కొత్త జిల్లా కేంద్రాల్లోనే అదనపు వాహనాలు తప్పనిసరి. ఇవికాక బాపట్ల జిల్లా, ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లో గ్రామాలు, దూరంగా ఉండడం, రవాణా సదుపాయాలు సరిగాలేకపోవడం, మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకే వెళ్లాల్సిరావడంతో దూరం పెరిగి ఇబ్బందులు పడుతున్నవారూ ఉన్నారు.

190 కొత్త వాహనాలొస్తున్నాయ్... ఏజన్సీకూడా మారుతుంది

పాతబడిపోయి, రిపేర్లకు గురవుతున్న వాహనాలను ఇప్పటికే గుర్తించాం. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు 190 కొత్తవాటిని కొనేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. త్వరలో అవికూడా సమకూరతాయి. ఏజన్సీ కూడా మారబోతోంది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కూడా పూర్తయింది. మరో వారంలో కొత్త ఏజన్సీ బాధ్యతలు తీసుకుంటుంది. ప్రభుత్వం వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పూర్తి ప్రక్షాళన చేయదలచుకుంది. త్వరలో అన్నీ అందుబాటులోకి వచ్చేస్తాయి. పాతవి ఉన్నా, ఏ ఇతర ఇబ్బందులు ఉన్నా, రాష్ట్రంలో ఎక్కడా ఒక్క రోగికి కానీ, అత్యవసర చికిత్స అవసరమైనవారికి కానీ ఇబ్బంది రానివ్వకుండా, ప్రాణాపాయం లేకుండా కాపాడగలిగాం. భవిష్యత్‌లో మరింత మెరుగైన సేవలు అందేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

సత్యనారాయణ, 108 సర్వీసుల రాష్ట్ర పర్యవేక్షకుడు

'బర్లీ' మంటలు..!

(5వ పేజీ తరువాయి)

దిగి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరపడమే ఈ సమస్యకు పరిష్కారం అని రైతులు చెబుతున్నారు. లేదంటే మరింత మంది రైతులు బలికాక తప్పదని అంటున్నారు.

అప్పులు తీర్చలేని పరిస్థితి

12 ఎకరాలు కౌలుకు తీసుకుని బర్లీ పొగాకు సాగు చేశాను. ఎకరానికి లక్షన్నర వరకు పెట్టుబడి ఖర్చు అయింది. ఇప్పుడు చూస్తే కనీసం కొనేవాడు కనబడడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. అప్పులు తీరే మార్గం కనబడడం లేదు

తులసి శంకర్, పర్చూరు

కంటిమీద కునుకు ఉండడం లేదు

ఓ పక్క పొగాకును అడిగే వారే కనబడడం లేదు. మరో వైపు పొంచి ఉన్న వర్షాలతో కంటిమీద కునుకు ఉండడం లేదు. ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. కంపెనీలు కన్నెత్తి కూడా చూడడం లేదు. చేతికి అంది వచ్చిన పంటను అమ్ముకోవడానికి నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. ప్రభుత్వమే ఆదుకోవాలి **పీ.శ్రీనివాసరావు, ఉప్పుటూరు గ్రామ రైతు**

బెదిరింపులకు పాల్పడుతున్నట్లు మహిళ ఫిర్యాదు

వేటపాలెం(చీరాల), మే 14 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీలతో బెదురింపులకు పాల్పడుతున్నారని మహిళ వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దేశాయిపేటకు చెందిన మహిళ మరొకరికి బాకీ పడింది. దీంతో వారు రూ.10 వంతున వడ్డీ వసూలు చేస్తూ బెదురిస్తున్నట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆపేదెవరు.. ఆక్రమించెయ్

పొదిలి, మే 14 (ఆంధ్రజ్యోతి) : తిలాపాపం తలాపిడికెడు అన్నట్టు పొదిలిలో కొందరు అక్రమాలకు తెగబడుతున్నారు. ఖాళీ స్థలాలను విచ్చలవిడిగా ఆక్రమిస్తున్నారు. వీటిపై సమసగ్ర సర్వే నిర్వహించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ అన్సారియా పలుమార్లు ఆదేశించినప్పటికీ స్థానిక యంత్రాంగం బేఖాతరు చేస్తోంది. గతంలో పొదిలిలో జరిగిన ఒక బహిరంగ సభలో స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ అక్రమార్కుల ఆట కట్టిస్తానని, ఆక్రమణకు గురైన ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తానని, ప్రభుత్వ ఆస్తులను అక్రమార్కుల చెర నుంచి విడిపిస్తానని మంత్రి బాలవీరాంజనేయ స్వామి, జేసీ గోపాలకృష్ణ ఎదుట ప్రకటించారు. స్పందించిన మంత్రి, జేసీలు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అక్రమాలు నిగ్గుతేల్చాలని, వారంలోపు సమగ్ర నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కంటి తుడుపు చర్యగా సర్వే పేరుతో అధికారులు కాలయాపన చేసి కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కారు. దీంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.

దొంగలూ దొంగలూ కలిసి ఊళ్లు పంచుకున్నట్లు రెండు ప్రధాన పార్టీల్లో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా పంచేసుకుంటు న్నారు. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. పొదిలి పట్టణంలో ఇప్పటికే చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, రహదారి మార్జిన్‌లను ఆక్రమించేశారు. దాదాపు రూ.100 కోట్లకు పైగా విలువైన భూములను లాగేసుకున్నారు. పట్టణం శరవేగంగా విస్తరించడం, జిల్లాకు నడికూడలి కావడం, రైల్వేస్టేషన్, గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తుండడం, స్థలాల ధరలు అమాంతం పెరగడంతో అక్రమార్కులు దొరికినకాడికి దోచేసుకునే పనిలో పడ్డారు. వారికి అంటకాగిన అధికార యంత్రాంగం తమ వంత సహకారం అందిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



సర్వే నంబరు 217లో ఆక్రమణలో ఉన్న కుంటు పోరంబోకు స్థలం



సర్వేనంబరు 217లో అక్రమ నిర్మాణాలు

చర్యలు లేకపోవడంతో మళ్లీ ఆక్రమణలు

సర్వే నెంబర్ 219-2లో 1.86 సెంట్ల భూమి ఉంది. **ఈ భూమి విలువ సుమారుగా రూ.6 కోట్లు ఉంటుంది.** దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. అది ప్రభుత్వ భూమి అని కోర్టు తీర్పు ఇచ్చింది. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో కొనకనమిట్ల మండలానికి చెందిన వైసీపీ కార్యకర్త 20సెంట్ల స్థలంలో సిమెంట్ ఇటుకలతో ప్రహరీని కట్టారు. ఆ తరువాత పత్రికల్లో వార్తలు రావడంతో మేలుకున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ భూమి కోర్టులో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. ఆ భూమిపై రెండు ప్రధాన పార్టీల పార్టీలకు చెందిన నేతలు కన్నేశారు. అది తమ ఆధీనంలో ఉన్నట్లు బుయిస్తున్నారు. సిండికేట్ రాజకీయాలతో భూమిని పంచుకునేందకు రహస్య ఒప్పందాలు కుర్చుకున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే వీటితోపాటు ఎంతో విలువైన ఖాళీ భూములు కబ్జా అయ్యే ప్రమాదం ఉంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

219-2 సర్వే నెంబర్‌లో భూ సమస్య ప్రస్తుతం కోర్టులో ఉంది. సర్వే నెంబర్ 217లో 1.56 సెంట్లు భూమిలో ఆక్రమణలు జరుగుతున్న విషయం తెలియదు. పరిశీలించి ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకుంటాం.

అవీ..ఇవీ..

రేపు సోలార్ ప్లాంటు ఏర్పాటుపై గ్రామసభ

బల్లికురవ, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎస్ఎల్ గుడిపాడు సమీపంలో ప్రభుత్వం నూతనంగా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిందని దీనిపై రైతుల అభిప్రాయాలను తెలుసుకొనేందుకు శుక్రవారం గ్రామసభ ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. చీరాల ఆర్డీవో ఈ సభకు హాజరు కానున్నట్లు తెలిపారు. సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ చేపట్టాల్సి ఉందని రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

కౌలురైతులకు భూ యజమానులు సహకరించాలి


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): కౌలురైతులకు సీసీఆర్సీ కార్డులు పొందెందుకు భూ యజమానులు సహకరించాలని తహసీల్దార్ సింగారావు పేర్కొన్నారు. గుర్తింపు కార్డు పొందడం వలన భూ యాజమాన్యపు హక్కుకు ఎలాంటి భంగం వాటిల్లదన్నారు. మండలంలోని కొండమంజులూరు, కల్లంవారిపాలెం గ్రామాలలో బుధవారం కౌలు రైతులకు రుణాల కార్డుల జారీపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ నెల 31వ తేదీలోగా కౌలుదారులు సీసీఆర్సీ కార్డులు పొందాలని సూచించారు. బ్యాంక్ ద్వారా సున్నా వడ్డీతో కూడిన పంటరుణంతో పాటు ఇతర సాగు ప్రయోజనాలు కౌలు రైతుకు లభించాలంటే సీసీఆర్సీ కార్డు కలిగి ఉండాలని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఐ. శ్వేత, టీడీపీ నేత చింతల సహదేవుడు, 'సుబ్బారెడ్డి, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, బుల్లయ్య, వీవోఏ. శైలేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వస్థలంలో బంకు ఏర్పాటు


వైద్యశాల ముందు ఏర్పాటు చేసిన బంకు

బల్లికురవ. మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుంటుపల్లి ప్రభుత్వ పాథమిక ఆరోగ్య కేంద్రం ముందుభాగంలో అదేగ్రామానికి చెందిన ఓ యువకుడు బంకు ఏర్పాటు చేశాడు. దీని ఏర్పాటుపై గ్రామస్థుల నుంచి పలు అభ్యంతరాలు వచ్చాయి. వైద్యశాల ముందు అనుమతులు లేకుండా దుకాణం ఏర్పాటు చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక్కడ రాత్రివేళల్లో మందుబాబులు తిష్టవేస్తున్నారని, రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు. వైద్యశాల ప్రహరి ముందు బంకు ఏర్పాటు చేయడంపై వైద్యాధికారి రవితేజ బుధవారం బల్లికురవ పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలంలో పెట్టిన బంకు వెంటనే తొలగించాలని అయన పోలీసులను కోరారు.

విజిలెన్స్ అధికారుల దాడులు


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

చీరాల, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉషారాణి, అపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్‌థామస్ ఆధ్వర్యంలో 35 బృందాలుగా ఏర్పడి 2263 మీటర్లను తనిఖీలు చేశారు. అందులో భాగంగా విద్యుత్‌చౌర్యం కేసులో 16 మందికి రూ.29,100, అపరిమిత లోడ్ 342 మందికి గాను రూ.12,38 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరి ప్రసాదరావు, ఏఈలు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ప్రసాద్

అద్దంకిటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గ స్థాయిలో త్వరలో జరగనున్న భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు కేఎల్ డీ ప్రసాద్ కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో విస్తృతస్థాయి కౌన్సిల్ సమావేశం ఖాదర్‌బాషా అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి తమ్మల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్మికులు హక్కుల సాధన కోసం జరిగే ఈ సమ్మెలో కార్మికులు భాగస్వాములు కావాలన్నారు. ముందుగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జేబీ శ్రీధర్‌తో పాటు మృతి చెందిన పలువురు పార్టీ నాయకులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ ఏజీటీయూసీ రైతు సంఘం నాయకులు షేక్ ముస్తాపా, చీదర్ల కొండయ్య, మేకల రమణయ్య, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- మార్టూరు మండలంలో 250 ఎకరాల్లో సాగుకు తోడ్పాటు
- ఉచితంగా మొక్కల పంపిణీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


సాగుపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పాం సాగుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనిలో భాగంగా మార్టూరు మండల రైతాంగానికి 250 హెక్టార్లలో పామాయిల్ సాగు చేసుకునే విధంగా ఉద్యానశాఖ అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇస్తూ జీవో విడుదల చేసింది. దీనిలో భాగంగా ప్రభుత్వం రైతులకు తొలివిడతగా సాగుచేసే 250 ఎకరాలకు సరిపడా మొక్కలను అజంతా సోయా సీడ్స్ లిమిటెడ్ సమకూర్చనుంది. ఒక హెక్టారుకు రూ.20వేల విలువైన 150 మొక్కలను రైతులకు ఉచితంగా పంపిణీ చేయనుంది. అంతేకాక నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.5250 చొప్పున హెక్టారుకు నిర్వహణ నిమిత్తం కింద పెట్టుబడి అందజేసేలా కూటమి ప్రభుత్వం ఉద్యాన శాఖకు అనుసంధానించింది. ఎమ్మెల్యే ఏలూరి వ్యవసాయరంగంపై ఉన్న మక్కువతో మార్టూరు, బల్లికురవ మండలాల్లోని ఉద్యాన రైతులను ఆధునికసాగు వైపు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో ఫలితం దక్కినట్లయ్యింది. అంతేకాక ఇంపోర్టెడ్ మొక్కల సాగుచేసే అయిల్ ఫామ్ రైతులకు మొక్కలు కొనుగోలు కోసం నూరుశాతం రాయితీగా రూ.29 వేలు అందజేయనున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం మార్టూరు మండలంలో అయిల్‌ఫామ్ సాగుకు 250 ఎకరాల్లో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు

76 విద్యాలయాలకు ఫ్యాన్లు, లైట్లు


పాఠశాలల్లో బిగించేందుకు తెచ్చిన ఫాన్లు

అద్దంకి, మే14 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో సుమారు రూ.50 లక్షలతో కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)నిధులతో అద్దంకి నియోజకవర్గంలోని 76 పాఠశాలలు, కళాశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలకు 1009 ఫ్యాన్‌లు, 1160 లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు ఫ్యాన్లు, లైట్లు చేరాయి. పనులు కూడా ప్రారంభించి పూర్తి చేస్తున్నారు. అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఇప్పటి వరకు 550 మందికి సైకిళ్లు పంపిణీ చేయగా, నియోజకవర్గంలోని అన్ని హైస్కూళ్లలో చదివే సుమారు 10 వేల మంది బాలికలకు త్వరలో సైకిళ్ళు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. పేద విద్యార్థులు విద్యనభ్యసించే పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో వసతులను విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అన్ని విద్యాలయాలలో కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటుపై మంత్రి దృష్టి సారించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా పీ-4 విధానాన్ని ఆదర్శంగా తీసుకున్న మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విద్యాశాఖకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన చేస్తున్నారు. దీనిపై విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల సాధికారిత కోసం సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్ర

అద్దంకి,మే14(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే కుటుంబాలకు సాధికారిత కల్పించేందుకు సమగ్ర నమోదు చేపట్టడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. అద్దంకి పట్టణంలోని పోస్టాఫీస్ ఎదురు ఉన్న మున్సిపల్ మస్టర్ కేంద్రం వద్ద బుధవారం 'నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం'(నమస్తే) పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనధికార పారిశుధ్య కార్మికులకు గుర్తింపు కార్డులు, సామాజిక భద్రత, ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య ప్రయోజనాలు కల్పించేందుకు దోహదపడుతుందని కమిషనర్ రవీంద్ర అన్నారు. కార్యక్రమంలో దళిత రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్లు భగవాన్‌దాస్, దార్ల కోటేశ్వర రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బల రామిరెడ్డి, డీఆర్‌సీ వలంటీర్లు అపర్ణ, వెంకటేశ్వర్లు శ్రీరామ్ పాల్గొన్నారు.

శింగరకొండలో రాతి మండపం నిర్మాణానికి విరాళాలు


విరాళాలు అందజేస్తున్న కరి చిరంజీవి, శ్రీమన్నారాయణ, హరిప్రసాద్

అద్దంకి,మే14(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణానికి బుధవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. శింగరకొండ ప్రసన్నాంనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చిన్ని శ్రీమన్నారాయణ, సీతాదేవి దంపతులు రూ.1,01,116, అద్దంకి చెందిన రాయపాటి హరిప్రసాద్, అనుమతి దంపతులు రూ.1,11,116 రూపాయలు, అవిశన మారుతిరెడ్డి, సుభాషిణి దంపతులు రూ.1,01,116 కరి ఆంజనేయులు జ్ఞాపకార్థం కరి చిరంజీవి, శివలక్ష్మి దంపతులు రూ.1,01,116 అందజేశారు.

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హుండీలలోని కానుకలను బుధవారం లెక్కించారు. మార్చి 15వ తేదీ నుంచి బుధవారం వరకు రెండు నెలలకు రూ.14,28,554 ఆదాయం వచ్చినట్లు ఈఓ తిమ్మానాయుడు తెలిపారు. హుండీల లెక్కింపును ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, మేదరమెట్ల గ్రూపు దేవస్థానాల ఈవో వాసుబాబు తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన గ్రామంలో గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న బ్రహ్మంగారి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి ఆలయ పూజారి శ్రీనివాసాచారి, నాగబ్రహ్మచారిల పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా వీర బ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆనంతరం దేవాలయంలో నాగమయ్య, నాగయ్యల విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. పూర్వం నుంచి కొణిదెన గ్రామంలో బ్రహ్మంగారి దేవాలయం వద్ద కల్యాణం నిర్వహిస్తున్నామని భక్తులు తెలి పారు. ఈసందర్భంగా గ్రామస్థుల సమష్టి కృషితో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శింగరకొండలో మహాకుంభాభిషేకం

శాస్త్రోక్తంగా పూజలు ప్రారంభం


యాగశాలలో వేదపండితుల పూజలు

అద్దంకి, మే14 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలో మహాకుంభాభిషేక శోభ నెలకొంది. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండపాన్ని సుమారు రూ.6.85 కోట్లతో నిర్మించారు. 19వ తేదీ జరిగే మహాకుంభాభిషేకం, జీవధ్వజ పునఃప్రతిష్ఠలకు బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం ఈవో, దాతలు, వేదపండితులు, పూజారులు దేవాలయ ప్రదక్షణ చేశారు. అనంతరం బాలాలయంలో ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గురువందనం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్విగరణ, ధీక్షాధారణ, పంచగవ్య ప్రాచన, మాతృకాపూజనం, అజస్రారాధన, యాగశాల సంస్కారం, వాస్తుమండపారాధన, వాస్తుహవనము, పర్యగ్నికరణం దేవతానుష్టానములు నిర్వహించారు. సాయంత్రం క్షేత్రపాలక మండపారాధన, యోగిని మండపారాధన, నవగ్రహ మండపారాధన, సర్వతోభద్ర మండల ఆరాధన, సహస్రమోదక గణపతి హసనము, అంకురార్పణ, అగ్నిమధనం, కుండసంస్కారం, బలిహరణ, చతుర్వేద స్వస్తి నీరాజన, మంత్ర పుష్పములు తదితర క్రతువులను వేద పండితులు హరిశంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో నిర్వహించారు. యాగశాలలో యజ్ఞనం చేసేందుకు వచ్చిన పూజారులకు ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు నూతన వస్త్రాలను అందజేశారు. శింగరకొండ ప్రాంతం విద్యుత్ వెలుగులతో దేదీప్య మానంగా మారింది. ఈవో తిమ్మానాయుడు, రుషిత దంపతులతో పాటు ప్రధాన దాతలు నలమలపు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీదేవి దంపతులు, కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతులు, గుంజి కృష్ణారావు, రమాదేవి దంపతులు, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య దంపతులు, మేదరమెట్ల శంకరారెడ్డి, కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఆలయ ప్రదక్షణ చేస్తున్న దాతలు, వేదపండితులు, పూజారులు

అభివృద్ధికి అందరూ సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

మేదరమెట్ల , మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని ఎంపీపీ సాదినేని ప్రసన్న కుమారి అన్నారు. బుధవారం కోరిశపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులపై అనవసమైన ఫిర్యాదులు చేసుకోకుండా సహకరించుకుని మండల అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఇంటింటికి తాగునీరు అందించే పథకాన్ని పూర్తి చేయాల న్నారు. మండలంలోని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు తమ శాఖల నివేదికలను వినిపించారు. పాఠశాలలో మౌలిక వసతుల గురించి సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

చందలూరులో నేత్రదానం

పంగులూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో నేత్రదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన చిట్టాబత్తిన విజయసారధి(81) బుదవారం అనారోగ్యంతో స్వగృహంలో మృతిచెందాడు. వారి కుమారులు శేషారావు, మురళీకృష్ణలు తండ్రి నేత్రాలను దానం చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న కాకణి శంకర్ నేత్రాలయ సిబ్బంది బుధవారం సాయంత్రం నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేసిన విజయసారధి కుటుంబ సభ్యులను అభినందించారు.

ఏపీ పాలీసెట్‌లో శశాంక్‌కు ఉత్తమ ఫలితం


శశాంక్(ఫైల్)

ఈపురుపాలెం(చీరాల), మే 14 (ఆంధ్రజ్యోతి) : ఈపురుపాలెం బాయ్స్ హైస్కూల్‌కు చెందిన పాలెపు శశాంక్ ఏపీ పాలీసెట్‌లో సత్తా చాటాడు. 120 మార్కులకు ఏకంగా 117 మార్కులు సాధించి ఉన్నతంగా రాణించాడు. దీంతో ప్రిన్సిపల్ సుధావాణితో పాటు, గ్రామప్రజలు శశాంక్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

పోలూరులో కొబ్బరిచెట్టుపై పడిన పిడుగు

యద్దనపూడి, (మార్టూరు)మే14(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలం పోలూరు గ్రామంలో నున్నా సీతారావమ్మ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరిచెట్టుపై బుధవారం సాయంత్రం పిడుగుపడింది. ఈ ఘటనలో కొబ్బరి చెట్టు పూర్తిగా దగ్గమయ్యింది. అయితే ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెంపు


పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరుగుంతుందని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని గోవాడలో పీఎండీఎస్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ 20 రకాల విత్తనాలు కలిపిన కిట్లను ఒక్కొక్క కిట్ 12 కిలోల చొప్పున ఒక ఎకరాకు సరిపడ రూ.900లకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎకదళ, ద్విదళ విత్తనాలు కలిపి ఉన్న విత్తనాల సాగు చేసి పూత దశలో భూమిలో కలి యదున్నడం వలన భూసారం, సేంద్రీయ కర్బనం, పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచిన నరిశెట్టి రమేష్‌బాబు, స్వాములు, సత్యనారాయణ, అంకారావులను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పుట్టా సాంబశివరావు, ఏపీ సీఎస్ఎఫ్ ప్రతినిధులు అశోక్‌కుమార్, కోకిలవనజారాణి, పద్మలత, భారతి, నరేంద్ర, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కేసరి వెంకటరెడ్డి మృతి


కేసరి వెంకటరెడ్డి(ఫైల్)

మేదరమెట్ల, మే 14(ఆంధ్రజ్యోతి): పమిడిపాడు మాజీ సర్పంచ్ కేసరి వెంకటరెడ్డి(61) అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే జాగర్లమూడి రాఘవరావు అనుచరుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వెంకటరెడ్డి పమిడిపాడు సర్పంచ్‌గా, పమిడిపాడు సొసైటి అధ్యక్షుడుగా రెండుసార్లు, పనిచేశారు. పమిడిపాడు శివారు కృష్ణరాజువారిపాలెం (రెడ్డిపాలెం) చెందిన వెంకటరెడ్డి సర్పంచ్‌గా, సొసైటి అధ్యక్షుడుగా గ్రామంలో ప్రజలకు సేవలు అందించారు. ఆయనకు భార్య ఒక కమారుడు ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఫోన్‌చేసి కుటుంబ సభ్యులకు చివరి కాల్ అంటూ సమాచారం
- మాటల్లో పెట్టి అడ్డుకున్న కుటుంబ సభ్యులు

వాడరేవు (చీరాల), మే 14 (ఆంధ్రజ్యోతి) : మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన బుధవారం మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం కావూరివారిపాలేనికి చెందిన వ్యక్తి ఇటీవల కొంత అప్పులు పాలయ్యాడు. ఈ క్రమంలో ఓ బ్యాంకులో లోనుకు దరఖాస్తు చేసుకోగా, బ్యాంకర్స్ లోను రాదని మంగళవారం ఫోన్ ద్వారా తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన ఆయన ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి వెతుకులాట ప్రారంభించిన కుటుంబ సభ్యులకు తిరిగి ఆయన బుధవారం చివరిసారిగా అంటూ వీడియో కాల్ చేశాడు. ఈ సమయంలో కుటుంబ సభ్యులు ఈపూరుపాలెం పోలీసుల సహాయంతో లోకేషన్ గుర్తించి అతడిని సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. ఆలస్యమయితే ఇబ్బంది జరిగేదని కుటుంబ సభ్యులు విలపించారు.

తల్లీకొడుకులపై దాడి

- సైడు కాలువలో చెత్త తొలగిస్తుండగా ఘటన

అద్దంకి, మే14 (ఆంధ్రజ్యోతి): వర్షం నీళ్లు ఇంటిలోకి వస్తుండగా సైడ్ కాలువలో చెత్త తొలగిస్తున్న తల్లి, కొడుకుపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మండలంలోని ధర్మవరంలో బుధవారం ఉదయం వర్షం పడి సైడుకాలువలో నీరు ఇంట్లోకి వస్తుండడంతో యద్దనపూడి లీలమ్మ సైడ్ కాలువలో చెత్త తొలగిస్తోంది. చెత్తతొలగిస్తే వర్షపు నీరు పక్క ఇంట్లోకి పోతాయని మారం సుబ్బారెడ్డి, కుమారులు కోటిరెడ్డి, సుదర్శన్‌రెడ్డిలు లీలమ్మ, ఆమె కుమారుడుని కొట్టగా గాయాలు కావడంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవితేజ తెలిపారు.


ఓఎన్‌జీసీ పనులకు వచ్చిన కూలీ మృతి

మార్టూరు, మే14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇసుకదర్శి పొలాల్లో జరుగుతున్న కేంద్ర చమురుసంస్థ(ఓఎన్‌జీసీ) పనులకు వచ్చిన కూలి నేలపాటి శ్రీనివాసరావు (45) మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకొంది. మృతుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాట్రేయనికోన మండలం దొంతకూరు గ్రామానికి చెందిన వారు. ఆయనతో పాటు దాదాపుగా 20 మంది కూలీలు ఈ పనులు కోసం మార్టూరు ప్రాంతానికి వచ్చారు. వారిలో కొంతమంది ఇసుకదర్శి గ్రామంలో ఒక ఇంటిలో అద్దెకు ఉన్నారు. అయితే ఉదయం ఇంటిలో మరుగుదొడ్డికి వెళ్లిన శ్రీనివాసరావు అకస్మాత్తుగా పడిపోయాడు. దీంతో ఆయన్ను సహచర కూలీలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయన్ను పరీక్షించి, అప్పటికే చనిపోయారని చెప్పారు. ఈ విషయమై సహచరకూలీలు పోలీస్‌స్టేషన్‌కు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ప్రస్తుతం మృత దేహం మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 15 మే 2025

నాటి వైభవం.. నేడు ఏదీ!? 8

మనుగడ కోల్పోతున్న ఎన్‌డీసీఎంఎస్

కేంద్రం	నెల్లూరు		కావలి		కందుకూరు		ఆత్మకూరు		ఉదయగిరి	
ఉష్ణోగ్రతల వివరాలు	40.5	29.8	39	29	40	29	41	29	40	29

ఠారెత్తిస్తున్న ఎండలు

40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు

మరింతగా ఉంటున్న వేడి ప్రభావం • మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి





నెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. గడిచిన కొన్ని రోజులుగా చాలా మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే వేడి ప్రభావం మాత్రం అంతకుమించే ఉంటోంది. ముఖ్యంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల మధ్య బయట తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా సముద్ర తీరం వెంబడి ఉండటంతో చమట ప్రభావం కూడా ఎక్కువగా ఉంటోంది. బుధవారం నెల్లూరులో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధికంగా బోగోలు, దగదర్తి మండలాల్లో 41.7 డిగ్రీలు ఉండగా, ఏఎస్‌పేటలో 40.8, బుచ్చిరెడ్డిపాళెంలో 40.2, కొండాపురంలో 40, మనుబోలులో 41.2, మర్రిపాడులో 40, పొదలకూరులో 40.1, వరికుంటపాడులో 40 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం ఏకంగా 26 మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరికొన్ని రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగే ప్రమాదం కనిపిస్తోంది. ఈ ఎండ దెబ్బకు పనులు చేయలేక కార్మికులు అల్లాడుతున్నారు. ఇక వృద్ధులు, చిన్న పిల్లలు ఇళ్ల వద్దనే ఉంటున్నా ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. ఈ ఏడాది వడదెబ్బ బారిన పడుతున్నవారి సంఖ్య కూడా ఎక్కువగానే కనిపిస్తోంది. ఆసుపత్రుల్లో ఈ ప్రభావం స్పష్టంగా తెలుస్తోంది.

తలపై రుమాలు, చేతిలో నీళ్ల సీసా తప్పనిసరి

● మండుతున్న మెట్ట

అనంతసాగరం : భానుడి ప్రభావంతో మెటప్రాంతం మండిపోతోంది. వడగాడ్పులు భరించలేక పల్లెజనం అల్లాడిపోతోంది. ఉక్కపోతతో ఇటు ఇంట్లో ఉండలేక.. ప్రచండుడి భగభగలకు బయట తిరగలేక అవస్థలు పడుతున్నారు. అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో బుధవారం గరిష్ఠంగా 44 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు సమాచారం. ఉదయం 11 గంటల నుంచే వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వరుణుడి కరుణ కోసం పల్లెజనం ఆశగా ఎదురుచూస్తోంది.



గాంధీబొమ్మ కూడలి



వీఆర్సీ సెంటర్ లోని నీటికొలనులో ఎండిన మొక్కలు



నెల్లూరు : నిర్మానుష్యంగా ఉన్న రైల్వేస్టేషన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి



ఉదయం 11 గంటలకే అనంతసాగరం బస్టాండ్ సెంటర్ ఖాళీ

జీవాల దాహార్తి.. తొట్టెలతో స్వస్తి

● జిల్లాలో యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు



తొట్టెలో నీరు తాగి దాహం తీర్చుకుంటున్న జీవాలు

నెల్లూరు (జడ్పీ), మే 14 (ఆంధ్రజ్యోతి) : మండుతున్న ఎండలకు మూగజీవాల దాహం తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మిస్తోంది.ఏర్పాటు చేస్తుంది. తొలివిడతగా 963 తొట్టెలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు. ఒక్కో తొట్టికి రూ.22 వేల చొప్పున నిధులు మం జూరు చేస్తున్నారు. పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో వీటిని నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే సర్వేపల్లి, కోవూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో 705 తొట్టెల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇందులో 322 తొట్టెల నిర్మాణం పూర్తయ్యాయి. వీటన్నిటికి స్థానిక పంచాయతీల ద్వారా నీరు సరఫరా చేసి పశువులు, జీవాలకు అందుబాటులో ఉంచుతూ వాటి దాహార్తిని తీరుస్తున్నారు. మరో 383 తొట్టెల నిర్మాణాలు పూర్తికావొస్తున్నాయి. అయితే నిధుల విడుదలలో కొంత జాప్యం జరుగుతుండటంతో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. అయితే, డ్వామా పీడీ గంగాభవాని చొరవ తీసుకుని పనులు చేయిస్తున్నారు. ఈ నెలాఖరు తొలివిడత 963 తొట్టెలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

నోటిఫికేషన్

నెం. 01 డిసిల్టింగ్/ తేది: 14-05-2025

డి.ఎల్.ఎస్.సి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు కలువాయి మండలము, రాజుపాళెం గ్రామము పెన్నానది ఆనికట్ అప్ స్ట్రీమ్ (46.19 హెక్టర్స్ ఏరియా) కోసము ఆసక్తిగల సంస్థల నుండి APPCB నుండి స్వీకరించిన సమ్మతి మేరకు CTE Orders NLR- 68/APPCB/ZO-TPT/CTE/2024-459 Date: 02-11-2024 మరియు CTO Order NLR- 68/APPCB/ZO-TPT/CTO/2024-597 Date: 17-12-2024, దరఖాస్తులు కోరింది. మానవశక్తి ద్వారా డిసిల్టింగ్ మరియు సమీపములోని నిర్దేశిత డంపింగ్ పాయింట్కు ఉపయోగకరమైన మెటీరియల్ను రవాణా చేయడానికి ఖర్చు టన్నుకు రూ.129/-గా నిర్ణయించబడినది. ఆసక్తిఉన్న సంస్థలు దరఖాస్తు చేసుకోగలరు.

వరుస సంఖ్యా	వివరములు	అప్ స్ట్రీమ్ సంగం బ్యారేజ్ నియర్ రాజుపాళెం గ్రామం, కలువాయి మండలం
1.	Bid Document Fee	Rs. 15,000/- Through DD in favour of sand account 2024 Nellore.
2.	Earnest Money Deposit (EMD) (10%)	Rs. 90,75,150/- in favor of sand account 2024 Nellore.
3.	Performance Security Deposit PSD (20%)	Rs. 1,81,50,300/- in favor of sand accounts 2024 Nellore (Successful Bidder)
4.	Bid Submission Opening Date:	15-05-2025 at 10:00 A.M
5.	Bid Submission Closing Date:	21-05-2025 at 05:00 P.M
6.	Bid Opening Date & Time	22-05-2025 at 04:00 P.M

Note: దరఖాస్తు రుసుము (Bid Document Fee) తిరిగి వాపసు ఇవ్వబడదు. ప్రైస్ బిడ్లు మరియు టెక్నికల్ బిడ్లు శ్రీయుత కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారి ఆధ్వర్యంలో నెల్లూరు నందు తెరువబడును. ఆసక్తి కలవారు Bid Document Fee మరియు EMD తో పాటు వారి దరఖాస్తును తీసుకొని శ్రీయుత కార్యనిర్వాహక ఇంజనీర్, నెల్లూరు మధ్య విభాగము, నెల్లూరు వారి కార్యాలయము నందు ఆఫీసు పనివేళలో Tender Schedule పొందగలరు. Technical మరియు Price Bid open చేయు సమయానికి బిడ్డర్లు గానీ బిడ్డర్ల తరపున ఏజెంటులు గానీ హాజరుకావలెను. ఈ నోటిఫికేషన్ను జారీ చేసి అధికార యంత్రాంగానికి ఈ నోటిఫికేషన్ వాయిదా వేయడానికి లేదా రద్దు చేయడానికి పూర్తి అధికారములు కలవు.

జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

నోటిఫికేషన్

నెం. 01 డిసిల్టింగ్/ తేది: 14-05-2025

డి.ఎల్.ఎస్.సి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు కొండాపురం మండలము, సాయిపేట గ్రామము ఉప్పుటేరు ఆనికట్ అప్ స్ట్రీమ్ (13.02 హెక్టర్స్ ఏరియా) కోసము ఆసక్తిగల సంస్థల నుండి APPCB నుండి స్వీకరించిన సమ్మతి మేరకు CTE Orders NLR- 69/APPCB/ZO-TPT/CTE/2024-458 Date: 02-11-2024 మరియు CTO Order NLR- 69/APPCB/ZO-TPT/CTO/2024-596 Date: 17-12-2024, దరఖాస్తులు కోరింది. మానవశక్తి ద్వారా డిసిల్టింగ్ మరియు సమీపములోని నిర్దేశిత డంపింగ్ పాయింట్కు ఉపయోగకరమైన మెటీరియల్ను రవాణా చేయడానికి ఖర్చు టన్నుకు రూ.94.90/-గా నిర్ణయించబడినది. ఆసక్తిఉన్న సంస్థలు దరఖాస్తు చేసుకోగలరు.

వరుస సంఖ్యా	వివరములు	అప్ స్ట్రీమ్ ఉప్పుటేరు ఆనికట్ నియర్ సాయిపేట గ్రామం, కొండాపురం మండలం
1.	Bid Document Fee	Rs. 15,000/- Through DD in favour of sand account 2024 Nellore.
2.	Earnest Money Deposit (EMD) (10%)	Rs. 18,50,500/- in favor of sand account 2024 Nellore.
3.	Performance Security Deposit PSD (20%)	Rs. 37,01,000/- in favor of sand account 2024 Nellore. (Successful Bidder After Conformation)
4.	Bid Submission Opening Date:	15-05-2025 at 10:00 A.M
5.	Bid Submission Closing Date:	21-05-2025 at 05:00 P.M
6.	Bid Opening Date & Time	22-05-2025 at 04:00 P.M

Note: దరఖాస్తు రుసుము (Bid Document Fee) తిరిగి వాపసు ఇవ్వబడదు. ప్రైస్ బిడ్లు మరియు టెక్నికల్ బిడ్లు శ్రీయుత కలెక్టర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు వారి ఆధ్వర్యంలో నెల్లూరు నందు తెరువబడును. ఆసక్తి కలవారు Bid Document Fee మరియు EMD తో పాటు వారి దరఖాస్తును తీసుకొని శ్రీయుత కార్యనిర్వాహక ఇంజనీర్, నెల్లూరు ఉత్తర విభాగము, కావలి వారి కార్యాలయము నందు ఆఫీసు పనివేళలో Tender Schedule పొందగలరు. Technical మరియు Price Bid open చేయు సమయానికి బిడ్డర్లు గానీ బిడ్డర్ల తరపున ఏజెంటులు గానీ హాజరుకావలెను. ఈ నోటిఫికేషన్ను జారీ చేసి అధికార యంత్రాంగానికి ఈ నోటిఫికేషన్ వాయిదా వేయడానికి లేదా రద్దు చేయడానికి పూర్తి అధికారములు కలవు.

జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ప్రజాధనాన్ని దిగమింగుతారా!?

- కోవూరు పూర్వ కార్యదర్శిపై క్రిమినల్ కేసు
- డీపీవో, డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ, సర్పంచులపైనా..
- రాష్ట్ర పంచాయత్ రాజ్ శాఖ ఉత్తర్వుల జారీ
- రూ.1,15,95,388లు పక్కదారి

కోవూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్మును తన ఖాతాకు మళ్లించుకుని దిగమింగిన ఒకప్పుడు కోవూరు పంచాయతీ కార్యదర్శి ప్రస్తుత వింజమూరు కార్యదర్శి శివకుమార్‌పై క్రిమినల్ కేసు నమోదుకు రంగం సిద్ధం అవుతోంది. నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఇటీవల ఆయన్ను విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజాగా శివకుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా కలెక్టరు ఆనంద్‌కు రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఆదేశాలు జారీ చేశారు. 2019 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబరు మధ్య కాలంలో శివకుమార్ కోవూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఆయన పని చేస్తున్న కాలంలో రూ.1,15,95,388 మేర అవినీతికి పాల్పడినట్లు అధికారులు లెక్క తేల్చారు. శివకుమార్‌తోపాటు ఇందుకు బాధ్యులుగా అప్పటి సర్పంచు, డీఆర్వో, డీఎల్‌పీఓ, ఆడిటింగ్ అధికారులపైనా క్రిమినల్ కేసు నమోదుకు అధికారిని నియమించాల్సిందిగా కలెక్టరుకు ఆదేశాలు అందడం సంచలనాత్మకంగా మారింది.

● వెలుగు చూసిందిలా..



కార్యదర్శి శివకుమార్

స్థాని మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి తమ క్వార్టర్స్‌కు ఇంటి పన్ను రూ. 37,148 పంచాయతీకి చెల్లించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ నుంచి రశీదు కూడా పొందారు. ఇంతలో బదిలీపై శివకుమార్ వింజమూరుకు వెళ్ళారు. ఇంటి పన్ను చెల్లించాలని కోరుతూ ప్రస్తుత కార్యదర్శి శ్రీనివాసులు న్యాయాధికారికి డిమాండు నోటీసులు ఇచ్చారు. తాము ఇంటి పన్ను చెల్లించినా డిమాండు నోటీసులు ఇచ్చారంటూ న్యాయాధికారి కలెక్టరుకు తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన కలెక్టరు సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన రూ.6లక్షలను కూడా పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తమ సొంత ఖాతాలో వేసుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ విషయమై ఓ ఈఓపీఆర్డీ రహస్యంగా నివేదిక తయారుచేసి కలెక్టరుకు అందించినట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోమని కలెక్టరు రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ప్రతిపాదన పంపారు. ఇలా పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగం వెలుగు చూసింది. భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడినా పట్టించుకోని జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీఓ, ఈఓపీఆర్డీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు అందాయి. చెక్కులపై సంతకాలు పెట్టిన అప్పటి సర్పంచు, స్పెషల్ ఆఫీసర్లపై కూడా కేసులు నమోదు చేయమని పంచాయతీ రాజ్ కమిషనర్ సంచలనాత్మక ఉత్తర్వులు జారీ చేశారు.

కరెంటు బిల్లుల చెల్లింపు

మరింత సులభం

క్యూఆర్ కోడ్ ద్వారా సంస్థకు జమ

బిల్లులోనే ముద్రించిన విద్యుత్ శాఖ



మనుబోలు, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో వినియోగదారులకు ఆ సంస్థ మరింత సౌలభ్యాన్ని తీసుకువచ్చింది. ఈ నెల నుంచే బిల్లులో క్యూఆర్ కోడ్ ముద్రించి అమలులోకి తెచ్చింది. కొన్నేళ్ళ క్రితం విద్యుత్ శాఖ సిబ్బంది బిల్లులు ఇళ్ళకు వచ్చి కట్టించుకునేవారు. ఆ తరువాత పెద్ద బుక్కులు తీసుకువచ్చి ఒకచోట కూర్చొని రాతపూర్వకంగా బిల్లులు కట్టించుకుని, చిన్న స్లిప్‌లు ఇచ్చేవారు. కొన్నాళ్లకు మిషన్ల ద్వారా బిల్లులు జారీచేసి, ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి కట్టించుకునేవారు. కొద్దికాలంలోనే ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ తదితరాల ద్వారా చెల్లింపులు ప్రారంభించారు. కొద్ది నెలలు కాగానే ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లింపులు వద్దని విద్యుత్ సంస్థ వాటిద్వారా చెల్లింపులను నిలిపివేసింది. తరువాత ఆన్‌లైన్‌లో సంస్థ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లించాలని ప్రారంభించింది. తాజాగా క్యూఆర్‌కోడ్‌ను తీసుకువచ్చి చెల్లింపు ప్రక్రియ ప్రారంభించింది. మే నెలలో జారీ చేస్తున్న బిల్లుల్లోనే క్యూఆర్‌కోడ్ రూపొందించి వినియోగదారులకు అందజేస్తోంది. క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంల ద్వారా బిల్లు చెల్లించవచ్చు.

● ఈ సర్వీసులకు మాత్రమే

జిల్లాలోని నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు, కోవూరు డివిజన్ల పరిధిలో 9.61 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇందులో గృహ కనెక్షన్లు 7.8 లక్షలు, వ్యవసాయ కనెక్షన్లు 1.45లక్షలు, పరిశ్రమలు 3,204, ప్రభుత్వ కార్యాలయాలు, వీధిదీపాలు, వాణిజ్యం, ఇతరత్రా కనెక్షన్లు 84 వేల వరకు ఉన్నాయి. ఇవిగాక ఆలయాలు, బడులు, ఇతరత్రా ప్రభుత్వానికి సంబంధించిన వాటర్ సర్వీసులు 19,278 వరకు సర్వీసులు ఉన్నాయి. ఈ నూతన విధానం ప్రభుత్వ సర్వీసులకు వర్తించదు. అలాగే అరియర్స్ బిల్లు పెండింగ్‌లో ఉన్న వినియోగదారులకూ ఈ వెసులుబాటు ఉండదని అధికారులు చెబుతున్నారు.

త్వరలో ప్రభుత్వ సర్వీసులకూ..



వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేందుకే ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని అమల్లోకి తెచ్చాం. ప్రభుత్వ సర్వీసులకు, మరికొన్ని సర్వీసులకు తప్ప మిగతా సర్వీసులకు ఈ ప్రక్రియ అందుబాటులో ఉంటుంది. కొన్ని నెలల తరువాత ప్రభుత్వ సర్వీసులకు కూడా ఈ విధానాన్ని తీసుకువస్తాం. క్యూఆర్‌కోడ్ ద్వారా బిల్లులు ఎలా చెల్లించాలో వీడియోల ద్వారా ప్రచారం చేస్తున్నాం.

- వి. విజయన్, ఎస్ఈ, విద్యుత్ శాఖ



దేవేరులతో కలిసి పల్లకీలో పెంచలకోన నుంచి గోనుపల్లికి బయలుదేరిన పెంచలస్వామి

అత్తారింటికి పెంచలోరు!

ఆరు రోజులపాటు భక్తజనుల నడుమ బ్రహ్మోత్సవాలను జరుపుకున్న లక్ష్మీనృసింహుడు బుధవారం తన అత్తారిల్లు అయిన గోనుపల్లి గిరిజన కాలనీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కాలనీలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

8

నెల్లూరు రూరల్ తహసీల్దారు సస్పెన్షన్

నెల్లూరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ తహసీల్దారు లాజరస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందిన సమాచారం మేరకు పీజీఆర్ఎస్‌లో ఉన్నతాధికారులకు అందించాల్సిన సమాచారం లోపభూయిష్టంగా ఉండటం, తప్పుడు నివేదికలు అందచేయడం వంటి ఫిర్యాదులు కలెక్టర్‌కు చేరాయి. వీటిపై సమగ్రంగా విచారణ చేపట్టిన కలెక్టర్ అవన్నీ వాస్తవాలని తేలడంతో తహసీల్దారును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో ఓ డిప్యూటీ తహసీల్దారు పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తుండగా ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది తెలియాల్సి ఉంది. కాగ కనుపర్తిపాడు భూ వ్యవహారంలో జిల్లా రెండవ ఉన్నతాధికారి సంతకాన్ని ఫోర్జరీ చేశారన్న ఆరోపణలు తాజా ఘటనలో ప్రధాన అంశంగా తెలుస్తోంది.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 500



ఏకే కండ్రిగ వద్ద పూడిపోయిన డీఎం చానెల్

- పూడికతీతకు నోచుకోక కనుమరుగు
- డీఎం చానెల్‌ను కమ్మేస్తున్న చిల్లచెట్లు
- మరమ్మతులకు నోచని వెల్‌సైపన్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- సాగునీరు అందక రైతుల ఆందోళన

దుస్థితిలో కాలువలు!



తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన కూలిన వెల్‌సైపన్

బిట్రగుంట, మే 14(ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలంలో సాగునీటి సరఫరా జరిగే ప్రధాన కాలువలు దుస్థితికి చేరాయి. ఏళ్ల తరబడి పూడికతీతకు నోచుకోక ఏపుగా పెరిగిన చిల్లచెట్లు, జమ్ము, పిచ్చిమొక్కలు కమ్మేసి రూపురేఖలు మారి కనుమరుగవుతోన్నాయి. వెల్‌సైపన్లు సైతం శిథిలావస్థకు చేరి కూలిపోతున్నాయి. అయినా సంబంధిత అధికారులు వాటి గురించి పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఈ క్రమంలో వర్షాలు పడి, జలాశయాల నుంచి నీటిని విడుదల చేసిన సమయంలో సాగునీరు సక్రమంగా అందే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోగోలు, తాళ్లూరు, బిట్రగుంట, ముంగమూరు తదితర పంచాయాతీల రైతులకు అనువైన డీఎం చానెల్ కర్రతుమ్మ చెట్లతో కమ్ముకుపోయింది. సోమశిల జలాశయంలో, చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో రెండో కారు పంటకు సాగునీరు విడుదల చేస్తున్న పరిస్థితుల్లో ఈ కాలువలు దుస్థితిలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ కాలువల గురించి పట్టించుకున్న నాథుడే లేకపోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కావలి కాలువ నుంచి వచ్చే ఎస్వీపీఎం కాలువ పూడికతీత పనులు తాళ్లూరు వరకు జరిగాయి. అయితే కాలువలో పూడికతో పాటు తెల్లరాళ్లు పడి ఉండటం వలన సాగునీరు సాగేందుకు ఇబ్బందిగా ఉందని రైతులు అంటున్నారు. పడమర పల్లెలో రైతులు వేరుశనగ వేసేందుకు సమాయత్తమవుతోన్నారు. కాగా నాగులవరం వద్ద ఉన్న వెల్‌సైపన్ మూడేళ్ల క్రితం తుఫాన్‌కు దెబ్బతినడంతో నామమాత్రపు మరమ్మతులు చేశారు. నాగులవరం ఉత్తరం నుంచి శ్రీవేంకటేశ్వరపాలెం వైపు వెళుతున్న ఎస్వీపీఎం కాలువ తాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు దక్షిణం వైపు ఉన్న వెల్‌సైపన్ పడిపోయి నెల లు కావస్తున్నా పట్టించుకున్న పాపానపోలేదు. ఎస్వీపీఎం కాలువ నుంచి దామవరం కాలువ, నాగులవరం చెరువుకు నీటి విడుదలకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన షెట్టర్లు, గోడలు పూర్తిగా దెబ్బతిని పడిపోయి నాలుగేళ్లు అవుతున్నా ఇంతవరకు పట్టించుకున్నా నాథుడేలేడు. దీంతో నాగులవరం చెరువు కింద ఉన్న రైతులకు దామవ రం, నారాయణపురం రైతులకు సాగునీరు సక్రమంగా అందక ప్రతి ఏటా సాగునీటికి గొడవలు జరుగుతోన్నాయి. అలాగే ఎనిమిదేళ్ల క్రితం వేసిన జీప్‌ట్రాక్‌లో పెద్దపెద్ద గోతులు ఏర్పడి రైతులు పోలాలకు వెళ్లిరావాలంటే నరకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత వేసవి కాలంలోనైనా కాలువల పూడికతీతతో పాటు దెబ్బతిన్న షెట్టర్లు, వెల్‌సైపన్ల పనులను చేపడితే వరి సాగు చేసే రైతులతో పాటు వేరుశనగ సాగు చేస్తున్న రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు అంటున్నారు. వర్షాకాలంలో రైతులు తీవ్ర ఇబందులు పడకుండా జీప్‌ట్రాక్ నిర్మాణ పనులు చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

తూములు, షెట్టరు పరిస్థితిని ఇటీవల నెల్లూరులో జరిగిన సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోయాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం. తాళ్లూరు వద్ద సైపన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, ఏఈ, ఎస్వీపీఎం సెక్షన్-2

గృహాల స్వభావం నిర్ధారణకే సర్వే

● శావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



కావలి, మే 14 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో గృహముల స్వభావంను నిర్ధారించేందుకే ప్రత్యేక బృందాలు సర్వే చేసి ఇళ్ల కొలతలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో కావలినే పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసుకుని సర్వే చేస్తున్నారు. ఇంటి పన్నులు పెంచేందుకు సర్వే చేస్తున్నారని ప్రజలు ఆందోళన పడుతుండడం తమ దృష్టికి వచ్చింది. అది నిజం కాదు. ఇళ్ల స్వభావాలను బట్టి భవిష్యత్తులో ఇళ్ల ప్లానులు సరళీకృతం చేయడానికి ఈ సర్వే చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు.

? పట్టణంలో ఇళ్ల కొలతలు తీస్తున్నారు.. మళ్లీ ఆస్తి పన్ను పెంచుతున్నారా.

! గృహముల స్వభావం నిర్ధారించుకొనుటకే ఇళ్ల సర్వే చేసి వాటి నిర్మాణాల కొలతలను కొలుస్తున్నారు. పన్నులు పెంచడానికి కాదు.

? రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీలలో సర్వే చేస్తున్నారా.. లేక కావలిలోనేనా.

! రాష్ట్ర వ్యాప్తంగా కావలి మున్సిపాల్టీని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసుకుని ఇక్కడే సర్వే చేస్తున్నారు.

? సర్వేలో ఎన్ని టీములు ఉన్నాయి. స్థానిక సిబ్బందేనా.. బయటనుంచి ఎవరైనా వచ్చారా.

! పట్టణంలో 28 సచివాలయాలలో సచివాలయానికి ఒక టీం వంతున 28 టీంలు సర్వేలో పాల్గొంటున్నాయి. స్థానిక సచివాలయ సిబ్బంది సర్వే చేస్తుండగా మున్సిపల్ పట్టణ ప్రణాళికా విభాగం నుంచి వచ్చిన వారు పర్యవేక్షిస్తున్నారు.

? ఇంటి పన్నులు పెంచేందుకే సర్వే చేస్తున్నారనే యాజమానుల ఆందోళన చెందటంలో వాస్తవం ఉందా.

! భవిష్యత్తులో ఇంటి నిర్మాణాల ప్లానులు సరళీకృతం చేయడం కోసం గతంలో తీసుకున్న ప్లానులకు, కట్టిన నిర్మాణాలకు వ్యత్యాసం తెలుసుకునేందుకే సర్వే చేసి ఇళ్ల కొలతలు తీసుకుంటున్నారు. ఇళ్ల పన్నులు పెంచుతున్నారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

సివిల్ సర్వీస్ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే ఇంటూరి అభినందన



సివిల్ సర్వీస్ ర్యాంకర్ అన్నా కౌషిక్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణానికి చెందిన వడ్లమూడి చెంచురామయ్య మనవడు అన్నా కౌషిక్ ఇటీవల జరిగిన యూపీఎస్సీ అఖిల భారత సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 225వ ర్యాంక్ సాధించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పట్టణంలోని చెంచురామయ్య నివాసంకు వెళ్లి కౌషిక్‌ని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందచేశారు. నియోజకవర్గ యువతకు ఆదర్శంగా నిలిచినందుకు స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నే రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

లింగసముద్రం మండలం మాలకొండరాయునిపాలెం గ్రామానికి చెందిన చేబ్రోలు జ్యోతికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.65,939 చెక్కును బుధవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పేదల వైద్య ఖర్చుల కోసం ఇతోధికంగా నిధులు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు పేదప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని అయన పేర్కొన్నారు.

గౌతమ బుద్ధుడి జయంతి

కందుకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ధర్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌతమబుద్ధుని జయంతి సభను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశానికి, యువతకు గౌతమబుద్ధుడు అందించిన సందేశం ఆచరణీయంగా ఉన్నాయన్నారు. భారతీయుల మనసుల్లో గౌతముడు ఆదర్శపురుషుడిగా చిరస్మరణీయంగా ఉన్నాడన్నారు. ఈ సందర్భంగా బీహార్ బుద్ధగయలోని బౌద్ధమహావిహారాన్ని బౌద్ధులకే అప్పగించాలని జరుగుతున్న ప్రపంచ బౌద్ధుల నిరసన శాంతి ఉద్యమానికి కొవ్వొత్తులు వెలిగించి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ధర్మచక్ర ఫౌండేషన్ ఉపాసక గాండ్ల హరిప్రసాద్, డి.వీరనారాయణ, గేరా చిరంజీవి, పాలేటి కోటేశ్వరరావు, అల్లు వెంకటేశ్వర్లు, కల్లగుంట మోహనరావు, పోకూరి కోటయ్య, ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



టీడీపీ నేత సంజయ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

బిట్రగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలువురు టీడీపీ నేతలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. బేతనీపేటకు చెందిన టీడీపీ యువనాయకుడు జీ.సంజయ్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందాడు.ఎమ్మెల్యే ఆయను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. చెంచులక్ష్మీపురంకు చెందిన కాంద్ర రమ మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఓ టీడీపీ నేత తల్లి జయమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు నాగేశ్వరరావు, ఎం.వెంకయ్య, మధుబాబునాయుడు, సిద్ధు, రఘురాంనాయుడు, ప్రభాకర్, సుధీర్‌బాబు, వెంకటేశ్వర్లు, సుభాని తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

● ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ

కందుకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సబ్‌కలెక్టరు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో అన్నిశాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని ప్రకటించినప్పటికీ ప్రధానంగా రెవెన్యూకు సంబంధించిన మ్యూటేషన్, సర్వే సమస్యలపైనే అర్జీలు అందాయి. మొత్తం 28 అర్జీలు రాగా పింఛన్‌కోసం, కుటుంబ సమస్యపై ఒక్కో అర్జీ రాగా మిగిలిన అన్ని అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. దీంతో ఆయా గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లావణ్య పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న టీం సేవియర్స్ సభ్యులు

కావలి, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో టీం సేవియర్స్ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుడు నల్లిపోగు ప్రణీత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ ఖాజీ, సంఘసేవకులు డాక్టర్ ముక్తీ ఖలీల్ అహ్మద్ ప్రారంభించి మాట్లాడుతూ టీం సేవియర్స్ సమాజానికి మంచి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈశిబిరంలో 30 మంది రక్తదానం చేయగా ఆర్టీసీ ఉద్యోగి జె.శ్రీనివాసులురెడ్డి 34వ సారి, రెడ్‌క్రాస్ ఉద్యోగి పద్మావతి 29వ సారి, టీంసేవియర్స్ సభ్యుడు కొండూరు వినీల్, ప్రయివేట్ స్కూల్ ఉపాధ్యాయుడు నెల్లూరు సెభాష్ 20వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, రెడ్‌క్రాస్ బాధ్యులు పాములూరు శ్రీధర్, కలికి శ్రీహరిరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, రక్తకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమ్య, తదితరులు పాల్గొన్నారు.

యానాది రైతులవే తొలగించడం అన్యాయం

● ఆర్డీవో కార్యాలయం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత, గిరిజనులు

కావలి, మే 14(ఆంధ్రజ్యోతి): అల్లూరు మండలం పురిణి చెరువులో ఆక్రమణల తొలగింపులో పెద్ద పెద్ద రైతులను వదిలి కేవలం యానాది రైతులనే తొలగించడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు దళిత సంఘర్షణ సమితి, యానాది సమాఖ్య ఆధ్వర్యంలో దళిత, గిరిజన కుటుంబాలతో కలిసి బుధవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ పెద్ద పెద్ద రైతుల ఆక్రమణలను వదిలి యానాదులకు సంబంధించి కట్టలను మాత్రమే తొలగించి ఆ భూములను చెరువులో కలపడం యానాదుల పొట్ట కొట్టడమేనన్నారు. యానాదుల సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ మాట్లాడుతూ యానాదులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించిన ఈ ఆక్రమణల తొలగింపు విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పోరాడుతామన్నారు. అనంతరం ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో చౌటూరి భాస్కర్, చౌటూరి ప్రసాద్, కత్తి పద్మ, పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.

కమనీయం వేణుగోపాలుడి కల్యాణం



వేణుగోలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఉలవపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులో జరుగుతున్న వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా ఆలయం ఆరుబయట మండపంలో జరగింది. టీటీడీ వేద పండితుల మంత్రోచ్ఛరణలతో జరిగిన ఈ కల్యాణానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి కోవూరు ఎమ్మెల్యే, టీడీపీ బోర్డు మెంబరు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రతిఏటా స్వామివారి కల్యాణం ఆలయ ప్రాంగణంలోని మండపంలో జరిగేది. అక్కడ ఖాళీలేక కొందరు భక్తులు బయటే నిలబడి కల్యాణం అనంతరం స్వామివారి దర్శనం చేసుకునేవారు. తొలిసారి ఆరుబయట స్వామివారి కలాణ్యం ఈవో శ్రీనివాస్, ధర్మకర్త సుధీష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరగడంతో భక్తజనం తిలకించారు. 100 ఏళ్ల పైన చరిత్ర ఉన్న రథం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తాత్కాలిక రథం ఏర్పాటు చేసి తిరువీధుల్లో ఊరేగించారు.

తహసీల్దారు శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



తహసీల్దారు శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ, ఆర్ఐ, సర్వేయర్లు

వలేటివారిపాలెం, మే 14(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం తహసీల్దారుగా శీలం శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఒంగోలు రూరల్ మండలం డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దారుగా ఉన్న డిప్యూటీ తహసీల్దారు షేక్ నాయబ్‌రసూల్ పదోన్నతిపై ఒంగోలు రూరల్ మండల తహసీల్దారుగా వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు డీటీ నాయబ్‌రసూల్, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ గోపిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమ పూజలు



హోమ పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

కావలిటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి) పరివార సమేత వాసవీ కన్యకాపరమేశ్వరి పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా బుధవారం హోమం పూజలు నిర్వహించారు. ఉదయం అర్చక బృందంచే గురు ప్రార్థన, గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, అఖండ దీప స్థాపనం, అంకురార్పణ, యాగశాల సంస్కారం, చతుర్వేద పారాయణం, వాస్తు నవగ్రహ యోగిని, అగ్ని ప్రతిష్ఠ, గణపతి సుబ్రమణ్య వాస్తు హోమములు, మహా మంగళ హారతి, మంత్ర పుష్పం పూజల అనంతరం తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. సాయంత్రం ఆవాహిత దేవతా పూజ, బింబశుద్ధి అగ్ని ఉత్తరణ హోమం పూజలు జరిగాయి. మంగళవారం జరిగిన కలశాల ప్రదర్శనను దిగ్విజయం చేసిన భక్తజనానికి ఆలయ కమిటీ పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ శాశ్వత గౌరవాధ్యక్షుడు కందుకూరి సత్యనారాయణ, గ్రంధి రమేష్, అధ్యక్షుడు వోలేటి నాగేశ్వరరావు, కార్యదర్శి చీదెళ్ల రామచంద్రారావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆలేఖ్య, కనమర్లపూడి నారాయణ, అమరా వేదగిరి పాల్గొన్నారు.

నేడు కావలి మండల సమావేశం

కావలి రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాయంలో ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన గురువారం ఉదయం 10 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యుడుతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు. కాగా ఈనెల 6వ తేదీన జరిగిన మండల సమావేశానికి వైసీపీకి చెందిన ఎంపీటీసీలు డుమ్మా కొట్టడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సారైనా వారు సమావేశంలో పాల్గొని ప్రజా సమస్యలపై చర్చిస్తారా డుమ్మా కొడతారా అనీ మండలంలో చర్చించుకుంటున్నారు.

ఎడగారు సాగుకు సన్నద్ధం

అల్లూరు, మే 14(ఆంధ్రజ్యోతి) : ఎడగారు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో 18 వేల ఎకరాల్లో సాగు చేపట్టేందుకు సాగునీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్న క్రమంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. కొంతమంది రైతులు డ్రమ్‌సీడర్ ద్వారా విత్తనాలను నేరుగా పొలంలో చల్లే ప్రక్రియను చేపట్టగా అత్యధికమంది రైతులు నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కి దున్ని భూములను చదును చేసుకున్న క్రమంలో మరో పది రోజుల నుంచి వరినాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాగా కెఎన్ఎం 733 రకం సాగు చేపట్టే రైతులు నారు పీకే వారం రోజుల ముందు 3జి గుళికలను వినియోగించుకోవాలని, తద్వారా ఉల్లికోడు, తెల్ల తెగులు నివారించుకోవచ్చని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచిరచారు. అదేవిధంగా ఈ రకం వరి నారు పీకేందుకు గట్టిగా ఉంటుందని, మూడు రోజుల ముందు నారుమడిలో జిప్సమ్ చల్లుకోవడం ద్వారా భూమి గుల్లబారి నారు సులువగా వస్తుందని తెలిపారు.



ఎడగారుకు సిద్ధం చేస్తున్న నారుమడి

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

కందుకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చెంచిరెడ్డిపాలెంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు నరాల శ్రీనివాసరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తక్షణం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబులు డిమాండ్ చేశారు. బుధవారం వారు చెంచిరెడ్డిపాలెం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మహేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయం నష్టాలు వస్తుండటంతో రైతులు వ్యవసాయాన్ని వదిలి వలసలు వెళ్లిపోయారని, శ్రీనివాసరెడ్డి వ్యవసాయంపై మక్కువతో అప్పులపాలై తణువు చాలించడం దురదృష్టకరమన్నారు. సీపీఐ నేత బూసి సురేష్‌బాబు, దామా కృష్ణయ్య, మాధవ, ఆనంద్ మోహన్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రహదార్ల వెంబడి ఫ్లెక్సీలు!

● ప్రమాదాలకు కారకాలు



ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

కలిగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదాలకు కారకాలుగా మారిపోయాయి. కలిగిరి-కావలి రహదారి ప్రాంతంతో పాటు కలిగిరి పట్టణంలో తహసీల్దారు కార్యాలయం, ఆర్టీసీ బస్‌స్టేషన్, ఆర్‌అండ్‌బీ బంగ్లా, బస్ స్టేషన్ ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. రాజకీయ నాయకులతోపాటు, హాస్పిటల్స్ బంగారు దుకాణాలు, వస్త్ర దుకాణాలు ఇలా పలు వ్యాపారసంస్థలు ప్రధాన కూడళ్లలో తమ వ్యాపార విస్తరణకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు పంచాయతీ అనుమతులు ఏమాత్రం లేవు. వీటికితోడు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చిన్నపాటి గాలులకు ఒరిగిపోయి ప్రమాదకరంగా తయారై ఉన్నాయి. అదేవిధంగా ప్రధాన కార్యాలయాలు, బస్‌స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో వివిధ పనులపై కార్యాలయాలకు, బస్‌స్టేషన్‌లకు వచ్చేవారికి ఇబ్బందికరంగా మారిపోయాయి. అనుమతులు లేకుండా రహదారులపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంపుతామని బెదిరించి దోచుకెళ్లారు

నెల్లూరు(క్రైం), మే 14(ఆంధ్రజ్యోతి): రైలుదిగి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు చంపుతామని బెదిరించి నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన బుధవారం నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సంగం మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన వీరరాఘవయ్య పది రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెల వద్దకు వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున రైలులో నెల్లూరుకు చేరుకుని రైలుదిగి ఆత్మకూరు బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు రెండు బైక్‌లలో వచ్చి వీరరాఘవయ్యను అడ్డుకున్నారు. కత్తితో చంపుతామని బెదిరించి అతని వద్ద నుంచి రూ.1000 దోచుకెళ్లారు. దీంతో బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

18న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 18న గొలగమూడిలోని ఫన్ పార్కు కన్వెన్షన్ హాలులో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై సుమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



అశ్వవాహనంపై లక్ష్మీనరసింహుడు

నెల్లూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో జరుగుతున్న లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం శ్రీవారు అశ్వారూఢుడై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చప్పర ఉత్సవం ఘనంగా జరిగింది. అనంతరం అశ్వవాహన సేవ, పార్వేట ఉత్సవం నిర్వహించారు. చివరిగా చోర సంవాదం ఘట్టం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

వింజమూరు మండలం నల్లగొండ్లలో వెలసి ఉన్న శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనర సింహుడి కల్యాణాన్ని బుధవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్‌పీ కొండారెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం తిరుపతి నుంచి వచ్చిన వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా స్వామి,అమ్మవార్లకు దండల మార్పిడి, ఎదురుకోలు ఉత్సవం, మంగళసూత్రధారణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి భక్తులు చదివింపులు చదివించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ అన్నపురెడ్డి మురళీధర్‌రెడ్డి, టీడీపీ నేత అంకినపల్లి ఓబులరెడ్డి, కలిగిరి సీఐ వెంకటనారాయణ దంపతులు, ఈవో శాంతయ్య, ఎస్ఐ వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

- వింజమూరు, (ఆంధ్రజ్యోతి)



లక్ష్మీ నరసింహుడి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

- మనుగడ కోల్పోతున్న ఎన్‌డీసీఎంఎస్ • షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- రూ.కోట్ల ఆస్తులకు రక్షణ కరువు • ఉన్న ఉద్యోగులపై అజమాయిషీ లేదు
- మంత్రి చెప్పినా అందని హమాలీ చార్జీలు
- కొత్త చైర్మన్ 'గంగోటి' అయినా గాడిలో పెట్టేనా!?

నాటి వైభవం.. నేడు ఏదీ!?

నెల్లూరు(హరనాథపురం), మే 14(ఆంధ్రజ్యోతి) : లాభాల బాటలో ఓ వెలుగు వెలిగిన నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్) తన మనుగడను కోల్పోతోంది. అసలు డీసీఎంఎస్ ఉందా అనే పరిస్థితికి చేరుకుంది. ఒకప్పుడు సబ్సిడీపై రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పంపిణీ, ప్రభుత్వ వసతిగృహాలకు పలసరుకులు, ఎన్నికల సమయంలో స్టేషనరీ, టీటీడీకి కందిపప్పు తదితరాలను అందచేసింది. అంతేగాక ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు, దీపావళి పండుగలో టపాకాయల విక్రయాలు ద్వారా లాభాలు ఆర్జించింది. జిల్లాలోని పలు ప్రాంతాలలో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేది. 2020లో ఖరీఫ్, రబీ సీజన్లలో జిల్లాలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.135 కోట్ల వ్యాపారం ద్వారా రూ.2 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రూ.6కోట్ల చిరుధాన్యాల వ్యాపారం చేసి రూ.2 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. నగరంలోని ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణం ద్వారా రూ.17 కోట్ల విలువైన ఎరువులను విక్రయించడం ద్వారా ఆదాయాన్ని ఆర్జించింది. గత ఏడాది వరకు కూడా డీసీఎంఎస్ లాభాల బాటలోనే ఉండేది. ఆ తరువాత సదరు సంస్థకు ముసలం మొదలైంది. ఎలాంటి వ్యాపారాలు చేపట్టకుండా కుదేలయ్యింది.



మూసి వున్న డీసీఎంఎస్ ఎరువుల దుకాణం

● 'జనరిక్'లో మందులేవీ!?

నగరంలోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభించారు. అవసరమైన మందులు ఏర్పాటు చేయలేదు. జనాదరణ ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

● ఆ దుకాణం ఎప్పుడూ మూతే

నగరంలోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఎరువుల విక్రయ కేంద్రం ఏ సమయంలో వెళ్లినా మూసే ఉంటోందని రైతులు ఆరోపించారు. దాని నిర్వహణకు ఒకరిని నియమించినా తలుపులు మాత్రం తెరుచుకోవడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులను ఆ దుకాణంలో అందుబాటులో ఉంచితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

● విలువైన ఆస్తులకు రక్షణ ఏది

జిల్లాలో డీసీఎంఎస్‌కు విలువైన ఆస్తులు ఉన్నాయి. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో ప్రధాన కార్యాలయం ఉండగా, నగరంలోని నవాబుపేటలో రైస్‌మిల్లు కూడా ఉంది. దీని విలువ రూ.కోట్లలో ఉంది. ఈ మిల్లు శిథిలావస్థకు చేరుకోవటంతో దాని స్థానంలో షాపింగ్ కాంప్లెక్సు, గోదాములు కట్టించి డీసీఎంఎస్‌కు ఆదాయం సమకూర్చాలని గతంలో పనిచేసిన చైర్మన్ వీరి చలపతిరావు ప్రతిపాదించి, ప్రభుత్వం నుంచి అనుమతులు కూడా తెచ్చారు. అయితే, ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆత్మకూరులో డీసీఎంఎస్‌కు దుకాణాలు ఉన్నా పట్టించుకునే దిక్కేలేదు. ఈ ఆస్తులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● అందని హమాలీ చార్జీలు

డీసీఎంఎస్ ద్వారా ధాన్యం సేకరించినందుకు రైతులకు హమాలీ చార్జీలను రూ.50లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత ఫిబ్రవరిలో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు తమకు హమాలీ చార్జీలు చెల్లించమని రైతులు కోరారు. మూడు రోజుల్లో ఇవ్వాలని మంత్రి కూడా అధికారులను ఆదేశించినా ఇప్పటికీ అతీగతీ లేదు. రాపూరు సబ్‌డివిజన్ సహకారశాఖాధికారి ప్రస్తుతం డీసీఎంఎస్‌కు బిజినెస్ మేనేజర్‌గా ఉన్నారు. ఆయన రాపూరుతోపాటు, ఇక్కడ బిజినెస్ మేనేజర్‌గా విధులు నిర్వహించాల్సి ఉంది. ఎరువుల అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై నవాబుపేట పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైతే దానిపై ఎలాంటి ప్రగతి లేదనేది సమాచారం.



డీసీఎంఎస్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల కుర్చీలు

● సమావేశానికే దిక్కులేదు!

గత అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది మార్చి 31లోగా డీసీఎంఎస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా, దానిని ప్రత్యేకాధికారి అయిన జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్వహించలేదు. తమకు జీతాలు సక్రమంగా చెల్లించటం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలను పని చేయకుండా చేశారు. దీంతో అసలు విధుల నిర్వహణకు ఉద్యోగులు వస్తున్నారో లేదో తెలియని పరిస్థితి. మొత్తం మీద డీసీఎంఎస్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయింది. డీసీఎంఎస్‌కు చైర్మన్‌గా గంగోటి నాగేశ్వరరావును ఇటీవల ప్రభుత్వం నియమించింది. మనుగడ కోల్పోతున్న డీసీఎంఎస్‌కు నాగేశ్వరరావు అయినా పూర్వవైభవం తెస్తారో లేదో వేచి చూడాల్సిందే.

హమాలీ చార్జీలు చెల్లిస్తాం

రైతులకు హమాలీ చార్జీలు రూ.50 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. త్వరలోనే చెల్లిస్తాం. కొత్త చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తాం. ఉద్యోగులు సక్రమంగా విధులకు వస్తున్నారు. వారిని ఇన్‌కంటాక్సు వంటి వేరే పనులకు పంపుతుంటాం. జనరిక్ మందుల దుకాణంలో అవసరమైన మందులను సమకూర్చుతాము.

- రవికుమార్, బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్

నాన్‌డెల్టాలో రెండో పంటకు నీరు కూటమి ఘనతే!

- కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి, కాకర్ల

సంగం, మే 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పరిధిలో నాన్ డెల్టాలో రెండో పంటకు సాగు నీరు విడుదల చేయడం కూటమి ప్రభుత్వ ఘనతేనని కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ తెలిపారు. సంగం వద్ద బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువకు రెండో పంటకు బుధవారం వారు నీటిని విడుదల చేశారు. ముందుగా వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చి కాలువ హెడ్‌రెగ్యులేటర్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మొదటి పంట సమయంలో జలాశయంలో 72 టీఎంసీలు ఉన్నా, పాలకుల నీటి నిర్వహణ లోపం కారణంగా డెల్టాలో సైతం రెండో పంటకు నీటిని విడుదల చేయలేకపోయారన్నారు. బెజవాడ పాపిరెడ్డి కాలువ పరిధిలో సుమారు 74 వేల ఎకరాలకు సుమారు 8.7 టీఎంసీల నీటిని కేటాయించాలని ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ నీరు చివరి ఆయకట్టు వరకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి, వైస్ చైర్మన్ మధుబాబునాయుడు, ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఈఈ నాయక్, డీఈ, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



హెడ్‌రెగ్యులేటర్లు ఎత్తి బెజవాడ పాపిరెడ్డి కాలువకు నీటిని విడుదల చేస్తున్న కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కావ్య, కాకర్ల

అత్తారింటికి చేరిన నృసింహుడు

గోనుపల్లిలో అంబరాన్ని అంటిన సంబరాలు

గోనుపల్లిలో ఉత్సవర్ల ఊరేగింపు



రాపూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ముగించుకుని బుధవారం తిరిగి అత్తగారిల్లు అయిన గోనుపల్లి గిరిజన కాలనీకి పెనుశిల లక్ష్మీనృసింహుడు చేరుకున్నారు. గోనుపల్లిలో ఉన్న పెంచలస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవ విగ్రహాలను బ్రహ్మోత్సవాల ముందు రోజు కోనకు పల్లకీలో తీసుకెళ్లి ఉత్సవాలు ముగిశాక మళ్లీ గోనుపల్లికి తీసుకురావడం ఆనవాయితీ. ఇందులోభాగంగా కోనలోని అలంకార మండపం వద్ద స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం పెంచలకోన ప్రారంభ ఆర్చి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వీడ్కోలు పలికారు. అక్కడ నుంచి బయలుదేరిన స్వామి వారి పల్లకీని మోసే బోయీలకు ఎండకు కాళ్లు కాలకుండా దారి పొడవునా ట్యాంకర్‌తో నీటిని చల్లుతూ గిరిజన కాలనీకి చేరుకున్నారు.



కోనలో స్వామివారికి వీడ్కోలు పలుకుతున్న అధికారులు, అర్చకులు

● అల్లుడి రాకతో సంబరాలు

తమ ఆడపడుచు చెంచులక్ష్మిని వివాహమాడి గోనుపల్లికి సతీసమేతంగా స్వామివారు రావడంతో గోనుపల్లివాసులు సంబరాలు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలనీలోనే స్వామివారిని ఉంచడంతో గిరిజనులు తమ కొత్త అల్లుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోనుపల్లిలో గ్రామోత్సవం జరిగింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఉప ప్రధానార్చకులు సీతారామయ్య , పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న గోనుపల్లి వాసులు

రీ అప్పోర్షన్మెంట్ జాబితాలు విడుదల చేయాలి

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో పాఠశాలల రీస్ట్రక్చరింగ్ వల్ల రీ అప్పోర్షన్మెంట్‌కు గురయ్యే ఉపాధ్యాయుల జాబితాలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఏ సురేంద్రరెడ్డి, ఎం పిచ్చిబాబు ఓ ప్రకటనలో కోరారు. అధికశాతం మండలాల్లో కేడర్ స్ట్రెంగ్త్ వివరాలు, రీ అప్పోర్షన్మెంట్‌కు గురయ్యే ఉపాధ్యాయుల జాబితాలను బహిర్గతం చేయకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. రీ అప్పోర్షన్మెంట్‌కు గురై ప్రిఫరెన్షియల్ కేటగిరి కిందకు వచ్చే వారికి మరోసారి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి సర్టిఫికెట్ వచ్చేలా చూడాలని కోరారు. అలాగే అన్ని వాతావరణ పరిస్థితుల్లో రోడ్డు సౌకర్యంలేని కేటగిరి-4 పాఠశాలల జాబితాను రివైజ్ చేసి తాజా జాబితాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

సోమశిలలో 48.211 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 14 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి 48.211 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 5,730, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వారు తెలిపారు.

పాలిసెట్‌లో 96.49 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 96.49 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రవేశ పరీక్షకు నెల్లూరు డివిజన్‌లో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, వీఆర్ పీజీ కళాశాల, డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల, వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలల్లో, ఆత్మకూరు డివిజన్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సోమశిల రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, కావలి డివిజన్‌లోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పీబీఆర్ విశ్వోదయా కళాశాలల్లో, కందుకూరు డివిజన్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 30వతేదీ పరీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫలితాలను బుధవారం విడుదల చేయగా ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 96.49శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్షకు బాల, బాలికలు మొత్తం 4,081 మంది దరఖాస్తు చేసుకోగా 3529 మంది హాజరయ్యారు. వీరిలో బాలురు 2,148, బాలికలు 1257 మంది కలిపి 3,405 మంది ఉత్తీర్ణతతో 96.49 శాతం సాధించారు.

తహసీల్దార్‌తో మాట్లాడుతున్న జేసీ కార్తీక్



ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్పునకు 34 ఎకరాలు : జేసీ

మనుబోలు, మే 14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కనేఉన్న 34 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్పునకు కేటాయించనున్నామని జేసీ కే. కార్తీక్ తెలిపారు. బుధవారం మండలంలోని బండేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 434లోని 34 ఎకరాల ప్రభుత్వ భూమిని నుడా అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రికార్డుల ప్రకారం సర్వే నెంబర్‌లో విస్తీర్ణం, హద్దుల గురించి తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. పేదలకు తక్కువధరకే ఇళ్లప్లాట్లు అందించేలా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌ను ప్రభుత్వం తీసుకురానున్నదన్నారు. ఈ క్రమంలో భూసేకరణ చేశామన్నారు. ఈ 34 ఎకరాల స్థలాన్ని త్వరలోనే నుడాకు అప్పగించనున్నామన్నారు. నుడా ఈ భూమిని టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేయనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్, సుబ్బయ్య, నుడా సెక్రటరీ పెంచలరెడ్డి, వీఆర్‌వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్ఐవో వరప్రసాదరావు

నెల్లూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్-1ఏ, 2ఏ, బోటనీ-1,2, సివిక్స్ 1,2 పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 15,031 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 14130 మంది హాజరు కావాల్సి ఉండగా 13626 మంది హాజరయ్యారు. 504 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1461 మంది హాజరుకావాల్సి ఉండగా 1405 మంది హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐవో వరప్రసాదరావు 17 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 9, ఫ్లైయింగ్ స్క్వాడ్ 29 కలిపి మొత్తం 55 కేంద్రాలను పరిశీలించారు. పలు కేంద్రాల వద్ద విద్యార్థులతో మాట్లాడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విద్యాప్రమాణాల మెరుగునకు ప్రత్యేక వాట్సప్ గ్రూపు

- జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ

జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో రాబోవు విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు, సిబ్బందికి ముఖ హాజరు ప్రవేశపెడుతున్నామని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు. హాస్టల్ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వసతి గృహాల్లో అమలు చేయబోయే కార్యక్రమాలపై ఆమె ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

? విద్యాప్రమాణాల మెరుగు కోసం తీసుకుంటున్న చర్యలేమిటి

! బీసీ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల విద్యాప్రమాణాల మెరుగునకు ప్రత్యేక వాట్సప్ గ్రూపును ప్రారంభిస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ గ్రూపును అమలులోకి తెస్తాం. ఇందులో ప్రతీ వారం అన్నీ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కొక్క ప్రశ్నపత్రం పంపించి విద్యార్థులతో పరీక్షలు రాయిస్తాం. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందేలా చూస్తాం. తక్కువ మార్కులు వచ్చిన వారిని గుర్తించి వారికి మంచి విద్యాబోధన అందేలా చర్యలు తీసుకుంటాం.

? ముఖ హాజరు ఉంటుందా..

! వచ్చే జూన్‌లో హాస్టళ్ల ప్రారంభమయ్యేనాటి నుంచి విద్యార్థులకు ముఖ హాజరు ప్రవేశపెడతాం. అధికారులు, హాస్టల్ సిబ్బంది కూడా ముఖ హాజరు వేసేలా చర్యలు తీసుకుంటాం.



? విద్యార్థుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారా..

! జూన్ 12 నుంచి హాస్టళ్ల ప్రారంభమవుతాయి. విద్యార్థులకు తరచూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయించి, వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

? హాస్టళ్ల మరమ్మతు పనులు ఎంత వరకు వచ్చాయి.

! 35 బీసీ హాస్టళ్లలో మరమ్మతులకు ప్రభుత్వం రూ.70 లక్షలు విడుదల చేసింది. 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు హాస్టళ్ల ప్రారంభమయ్యేలోగా పూర్తిచేయిస్తాం.

? విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తారా..

! అందచేస్తాం. హాస్టళ్ల వంట పనివాళ్లు, హెచ్‌డబ్ల్యూవోలతో సమావేశం నిర్వహించి, సీనియర్ వంట పనివారితో మిగిలిన వంట పనివారికి శిక్షణ ఇప్పిస్తాం. బిరియానీ, సాంబార్‌రైస్ వంటి రుచికరమైన వంటకాలు విద్యార్థులకు అందేలా చూస్తాం.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థుల హవా

- ఏపీఆర్‌జేసీలో స్టేట్‌లో టాప్‌టెన్‌లో నాలుగుర్యాంకులు
- పాలిసెట్‌లో జిల్లాస్థాయిలో టాప్ ర్యాంకుల కైవసం

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): ఏపీప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుపతిలోని 'విశ్వం' స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో వై.దేదీప్యకు 3వర్యాంకు, కె.మునిరూపేష్‌కు 7వ, జె.అంజలికి 9వ, మనీషాకు 10వ ర్యాంకు వచ్చిందన్నారు. వీరితోపాటు రేవంత్, అబ్దుల్‌ఖాదర్, యోగి, సమత, దేదీప్య, భవ్య, శ్రీగీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్యశ్రీ 120కి117 మార్కులతో బాలికలవిభాగంలో జిల్లాలో టాపర్‌గా నిలచిందని ఆయన తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్‌ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారి 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లోనూ తమ విద్యార్థులు ఏటా టాప్‌ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పోటీపరీక్షల సమాచారం కోసం 8688888803/02, 9399976999 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసివిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.



ఏపీఆర్‌జేసీ టాపర్లను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి